

# ఒక్కొక్క పాటేసి...

## తెలంగాణ నూటొక్క పోరు పాటలు

# ఒక్కొక్క పాటేసి......

## తెలంగాణ నూటొక్క పోరు పాటలు

సంపాదకులు
జయధీర్ తిరుమలరావు

TELANGANA RESOURCE CENTRE

తెలంగాణ రిసోర్స్ సెంటర్

*హిమాయత్‌నగర్, హైదరాబాద్*

*2014*

# ఒక్కొక్క పాటేసి...

## తెలంగాణ నూటొక్క పోరు పాటలు

# Okkokka Paatesi...

## Anthology of Telangana Songs

*edited by* ***Jayadhir Tirumal Rao***

*First Edition : April, 2014*

*Copies : 1000*

*Price : **Rs. 150/-***

*Published by :*
***M. Vedakumar**, Chairman*
*Telangana Resource Centre*

*For Copies :*
**Telangana Resource Centre**
*"Chandram" 490, Street No. 11,*
*Himayatnagar, Hyderabad-500029.*
email: trchyd@gmail.com
*Mobile : 9030626288*
***website : www.trchyd.org***

Disha Pustaka Kendram ● Sahachara Book Mark ● Navodaya Book House

*Cover Painting :* Aelay Laxman

*Cover Design :* Ramanajeevi

*Layout :* **Charita Impressions**,
Azamabad Industrial Area, Hyderabad - 500 020.

*Printed at :*
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph. +91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

# అంకితం

ప్రజాస్వామ్య జన స్వప్నానికి
వారధులైన కవులకు-

కలం గళాల ముద్దబంతి
పూరేకులకు-

పోరు హారంలో మణిపూసలైన
అమరవీరులకు

నూటొక్క పువ్వేసి.........

# ఒక్కొక్క పాటేసి....


| | | | |
|---|---|---|---|
| 1 | అమ్మా తెలంగాణమా | - గద్దర్ | 19 |
| 2 | అమరవీరులకు అంకితం | - కొమిరె వెంకన్న | 23 |
| 3 | అమర వీరులారా మీకు వందనం | - శనిగారం బాబ్జీ | 25 |
| 4 | అమ్మమ్మ సింగరేణి | - జయరాజు | 27 |
| 5 | అలలమీద నావ | - యాదగిరి | 28 |
| 6 | అవ్వోనివా... | - గూడ అంజయ్య | 30 |
| 7 | ఆడపిల్లనమ్మా | - వై.వెంకన్న | 32 |
| 8 | ఆడుదాం డప్పుల్ల | - మిత్ర | 33 |
| 9 | ఆకాశాన మబ్బుల్లారా | - గోపాల్ | 36 |
| 10 | ఆగమైన తెలంగాణ | - దాసరాజు రామారావు | 38 |
| 11 | ఆళ్వారూ మట్టిపోరూ | - దేశపతి శ్రీనివాస్ | 40 |
| 12 | ఇంకేమి మిగిలిందిరా | - జయరాజు | 42 |
| 13 | ఉస్మానియా క్యాంపస్‌లో | - అభినయ శ్రీనివాస్ | 44 |
| 14 | ఎగిసెగిసి పడుతుంది గోదావరి | - శక్తి | 46 |
| 15 | ఎట్లున్నవే నా పల్లె | - నెర్నాల కిషోర్ | 48 |
| 16 | ఎన్నాళ్ళింక ఆరని కన్నీళ్ళు | - పోలిశెట్టి రంగయ్య | 53 |
| 17 | ఎన్ని కమిటీలేస్తరో | - యశ్‌పాల్ | 55 |
| 18 | ఏమని పాడాలి | - యాదగిరి | 60 |
| 19 | ఎర్రెర్రని తెలంగాణ | - చెరబండరాజు | 61 |
| 20 | ఎంజెయ్యాలె... | - భీమసేన | 63 |
| 21 | ఎంతని సూత్తవురో | - రడం శ్రీనివాస్ | 65 |
| 22 | ఎందాక జూద్దాంరో | - గూడ అంజయ్య | 66 |
| 23 | కదిలింది తెలంగాణ | - పయిలం సంతోష్ | 68 |

| | | | |
|---|---|---|---|
| 24 | కదిలిరండి తెలంగాణ భూమి పుత్రులారా | - సుద్దాల అశోక్ తేజ | 70 |
| 25 | కొమ్మాలల్ల కోయిలమ్మ | - గిద్దే రామనర్శయ్య | 71 |
| 26 | గణగణగణగణ తెలంగాణ | - అంబటి వెంకన్న | 73 |
| 27 | గూడు నిడిసినం | - గుండమల్ల శ్రీనివాస్ | 75 |
| 28 | గోదారమ్మ | - కొమిరె వెంకన్న | 77 |
| 29 | గోదారి గోదారి | - యశ్‌పాల్ | 79 |
| 30 | ఛలో ధూంధాం | - మిత్ర | 81 |
| 31 | జనహోరు | - జయం (పికెఎమ్) | 83 |
| 32 | జయ జయహే తెలంగాణ | - అందెశ్రీ | 86 |
| 33 | జమిడికె నాధం | - పి. కాశిం | 88 |
| 34 | జిల్లేడమ్మ జిట్ట | - గోరేటి వెంకన్న | 93 |
| 35 | జై జై తెలంగాణ | - యశ్‌పాల్ | 95 |
| 36 | జై బోలో తెలంగాణ | - అందెశ్రీ | 97 |
| 37 | జై తెలంగాణ | - లోకేందర్ | 101 |
| 38 | జైత్రయాత్ర | - జూలూరు గౌరీశంకర్ | 103 |
| 39 | జైకొట్టి తెలంగాణ పాట | - వసునూరి రవీందర్ | 104 |
| 40 | తలాపున పారుతోందీ గోదారి | - శివుడు | 106 |
| 41 | తల్లి తెలంగాణ | - పి. జగన్‌మోహన్‌రావు | 108 |
| 42 | త్యాగాల వనమా - తెలంగాణమా | - కోటి | 110 |
| 43 | తిరగబడ్డ తెలంగాణ బిడ్డ | - తోట మల్లేశం | 112 |
| 44 | తెలంగాణ జంగు సైరను | - మిత్ర | 114 |
| 45 | తెలంగాణ పల్లె గొల్లుమంటుందో | - బోడ చంద్ర ప్రకాశ్ | 116 |
| 46 | తెలంగాణ ఆట | - అంబటి వెంకన్న | 118 |

| | | | |
|---|---|---|---|
| 47 | తెలంగాణ జండపట్టు | - కోదారి శ్రీను | 120 |
| 48 | తెలంగాణ తల్లేమో | - ఎన్నార్ | 122 |
| 49 | తెలంగాణ కోటి రతనాల వీణ | - సుద్దాల అశోక్‌తేజ | 124 |
| 50 | తెలంగాణ లొల్లి | - చెరుకు సుధాకర్ | 126 |
| 51 | తెలంగాణ చెదిరిపోతుంది | - యాదగిరి | 130 |
| 52 | తెలంగాణ పులిబిడ్డలారా | - మంతటి కృష్ణవర్మ | 132 |
| 53 | తెలంగాణ గీతం | - మిత్ర | 133 |
| 54 | తెలంగాణకై పోరు చేద్దాం | - ఉప్పెన | 136 |
| 55 | తెలంగాణ మహిళల పోరు | - దేవేందర్ | 139 |
| 56 | తెలంగాణ యువకుడా | - భూపాల్ | 141 |
| 57 | తెలంగాణ లలిత | - రాజ నర్శింహ | 145 |
| 58 | తెలంగాణ ముద్దు బిడ్డలారా | - గుడిపల్లి రవి | 148 |
| 59 | తేడా లేనిదెక్కడ? | - సుద్దాల అశోక్ తేజ | 150 |
| 60 | తేమ లేని తెలంగాణ | - కోదారి శ్రీను | 152 |
| 61 | ధూల అంటు దుంకరో | - ఉప్పెన | 155 |
| 62 | నా తల్లి తెలంగాణ | - నలిగంటి | 156 |
| 63 | నా తెలంగాణ | - గద్దర్ | 159 |
| 64 | నా తెలంగాణ | - గూడ అంజయ్య | 165 |
| 65 | నా తల్లి తెలంగాణ | - గద్దర్ | 178 |
| 66 | నాగేటి చాలల్లో నా తెలంగాణ | - నందిని సిద్ధారెడ్డి | 180 |
| 67 | నా చిన్ని తమ్ముడా | - జయరాజు | 183 |
| 68 | నిన్ను విడిచి ఉండలేనమ్మా | - భిక్షపతి | 185 |
| 69 | నేలమ్మ నేలమ్మ | - సుద్దాల అశోక్ తేజ | 187 |

| | | | |
|---|---|---|---|
| 70 | పల్లె అందాలు | - గోరేటి వెంకన్న | 189 |
| 71 | పల్లె జూడు | - కొమిరె వెంకన్న | 192 |
| 72 | పల్లె తెలంగాణ | - భూపాల్ | 194 |
| 73 | పల్లె కన్నీరు పెడుతుందో | - గోరేటి వెంకన్న | 196 |
| 74 | పల్లె పల్లెనా | - శ్రీను | 201 |
| 75 | పండు వెన్నెల్లలోన | - నిస్సార్ | 203 |
| 76 | పాలమూరు వలస బతుకు | - మిత్ర | 206 |
| 77 | పొడిసేటి పొద్దోలె ఎలమందా | - నెర్నాల కిషోర్ | 208 |
| 78 | పొద్దుతిరుగుడు పువ్వు | - గద్దర్ | 211 |
| 79 | పోరాడరా | - ననుమాస | 212 |
| 80 | పోరు పుట్టిందిరా! | - జక్క గోపాల్ | 214 |
| 81 | పోరు సాగుతున్నది | - ఏపూరి సోమ | 217 |
| 82 | ప్రజా తెలంగాణకై | - పయిలం సంతోష్ | 219 |
| 83 | బంగారు భూమన్న | - అన్వేషి | 221 |
| 84 | బిడ్డల్ని ఎడబాసి | - కోదారి శ్రీను | 222 |
| 85 | ముద్దుల రాజాలో | - కోదారి శ్రీను | 225 |
| 86 | యలమంద | - గోరేటి వెంకన్న | 227 |
| 87 | రాజన ఓ రాజన | - గూడ అంజయ్య | 230 |
| 88 | రాజిగ ఓరి రాజిగ | - గూడ అంజయ్య | 234 |
| 89 | రాతి బొమ్మల్లోన | - ఏపూరి సోమన్న | 237 |
| 90 | రేలా రేలా రేలారె | - వరవరరావు | 239 |
| 91 | రేల దూల తాలెల్లాడె తెలంగాణ నేల | - గోరేటి వెంకన్న | 241 |
| 92 | వందనాలు వందనాలమ్మో | - అంబటి వెంకన్న | 243 |

| | | | |
|---|---|---|---|
| 93 | వానమ్మ వానమ్మ వానమ్మో | - జయరాజు | 245 |
| 94 | వీరులారా వందనం | - దరువు ఎల్లన్న | 247 |
| 95 | సావద్దు నా ముద్దు బిడ్డ | - నడ్డెబోయిన శ్రీనివాస్ | 249 |
| 96 | సాగదింక అన్యాయం | - జనసాగర్ | 251 |
| 97 | సింగూర నిర్వాసితుడు | - లింగన్న | 253 |
| 98 | సూడు తెలంగాణ | - అందెశ్రీ | 254 |
| 99 | సెలుక సేను | - గోరేటి వెంకన్న | 255 |
| 100 | హైద్రాబాద్ హమారా హై | - గుడిపల్లి రవి | 256 |
| 101 | పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న గానమా | - గద్దర్ | 260 |

# వందనమమ్మా! పది జిల్లల గానమా!

పాట అంటే– ఆదిలాబాదు శిలాజాలకంటిఉన్న ఆదిమ స్మృతి. కరీంనగర్ కోటిలింగాల ఆంధ్ర రట్టాల అపూర్వ చారిత్రకత. మూడు నదుల సంగమ క్షేత్రం బోధన్ పురా వైభవ చిహ్నం. వోరుగల్లు పౌరుషాగ్ని వైభవ పునీత స్రవంతి. పాలమూరు శ్రమ జీవన కళా స్మృతుల స్ఫూర్తి, ఉరుములు, మెరుపుల మెతుకు సీమ గాన ఖజానా. నలగొండ జీవన అనునిత్య పోరాటాల బతుకురాగం. భాగ్యనగర్ కళా వైభవోన్నతుల ముత్యాల నజరానా. వెరసి ప్రజోద్యమ పల్లవుల విజయగాథ. – తెలంగాణ పది జిల్లల పాట.

ఇక్కడ పాట ఆదివాసీ విల్లమ్ము. పాట ముగ్గిరిని కన్న మూలపుటమ్మ పురిటినొప్పి. సబ్బండ వర్ణాల ఏకైక భావ ప్రకటనా రూపం. పాటలేని తెలంగాణా లేదు. కోటల్ని కూల్చింది ఫిరంగి కాదు, పాటే. అది సామ్రాజ్యాల్ని దించింది. పాట ఒక తుడుం. పాట శ్రమజీవి నుదుటి స్వేద స్వరం.

సృజనాత్మక భావ విస్తరణకి అది అమోఘమైన కొనసాగింపు. ఊటలై ప్రవహించింది నోటి పాట. ప్రవాహాల వేగాన్ని తనిఖీ చేసిన స్పీడోమీటరు. వడి తగ్గిన వేళలో జడివానై కురిసింది పాటే. ఆరని అగ్ని శిఖని అగ్గికొండ చేసిందీ పాటే.

గోదావరంత ధూంధామైంది.కృష్ణమ్మ సప్త రాగాల ప్రవాహమైంది. ప్రాణహిత పంచరంగుల పటమై ఎగసింది. మానేటి పాట పరవశించిన తొలి కోడైంది. త్రిలింగాల మధ్య ఓంకార ఝుంకారమైంది. త్రికళింగాలలో త్రివేణి నృత్యమైంది.

అంతటి ఘన కీర్తి ఉన్నా–

పాట ఎప్పుడూ రెండో పౌరుడే పండిత సాహిత్యానికి. కొందరు కవిత్వానికి పాటని సుదూరపు చుట్టం అంటారు. కాని, అది నోటి సాహిత్యానికి వజ్రజిత పాదవు. దాని శక్తి వర్ణించడానికి అల్పులే పండితులందరూ. ప్రత్యేక పోరాటాన్ని పక్కన పెట్టినవారున్నారు. కాని ఆ పాటలతో పరవశత్వం పొందనివారు లేరు.

రాగాల్ని వినీవిననట్లు నటించారు. కానీ ఊగే తలలను ఆపలేకపోయారు. గాన లయలు పాదాలను దరువు వేయించింది ఉమ్మడిగ. పల్లవులలో పండిన కరుణరసం ఎర్ర జెండాలన్నింటిని కదిలించిన జీవ ద్రావకమైంది. జీవన పోరాట పార్శ్యగ్రంధాలయ్యాయి. ఆ లయలు, బాణీలు ఉద్యమ బాటలై పరుచుకున్నాయి. ఆ బాణీలు, ఆ గానం, ఆ అనుభూతి అవిస్మృత జ్ఞాన జ్ఞాపకం. అదే తెలంగాణ ఉద్యమ గీతం!

ఇంతకాలం ఉద్యమాలను కవిత్వం జాగృతపరిచింది. కాని కవిత్వం తెలంగాణా ప్రాంతీయోద్యమ మలిదశని తట్టి లేపింది. ఆత్మగౌరవం జండా ఇరుసుగా మారింది. ప్రతి ఘటనలో ఉద్యమానికి చేయూత నిచ్చింది. కవిత్వా చరణం లేని రాజకీయ సభ లేదు, పాటలేని వేదిక బహు అరుదు.

నిజానికి అంతర్జాతీయంగా కవిత్వం రెలవెన్స్ తగ్గిన కాలమిది. వివిధ అస్తిత్వోద్యమాల్లో కవిత్వం తగ్గిపోతున్న కాలం . ఉద్యమ స్వభావం సైతం ఆవిరవుతున్న వేళ. ప్రగతిశీలరంగంలో వాసీ రాశీ సన్నగిల్లుతున్న దృశ్యం. ఆయా రంగాలకి చెందిన కవులే మమేకతతో కవిత్వం రాయడం లేదన్నది వాస్తవం. భిన్న అస్తిత్వోద్యమాలు కవిత్వంలోనే తమ ఆస్తిత్వాన్ని అధికంగా వ్యక్తం చేశాయిఒకప్పుడు. ఆతరువాత కవిత్వంతో పాటు తమ ప్రభవాన్ని కోల్పోతున్న వైనం. ఎన్ని తునకలైనా దళితవాదం ఇంకా బట్టకట్టి బరిమీద నిలిచింది. బీసీవాదం వెనకపట్టు పట్టింది. బీసీ కవిత ఇతర వాదాలకి వత్తాసైంది. ప్రస్తుతం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం, తదితర విధ్వంసాలకు వ్యతిరేకంగా ముందు నిలిచింది. అదే కవిత్వానికి శక్తి. కొత్త రూపు. జవం, జీవం. ఈ అంశాలే 'పాట'ని తట్టి లేపాయి. ప్రజా కవులను వెన్నంటి ముందుకు ఉరికించింది.

జీవితానికి దూరమైన అనుభవాన్ని కవిత్వీకరించడంలో కృత్రిమత్వం ఉంటుంది. పేదరికం, కన్నీళ్ళు, జీవిత పోరాటం, ఆశించని ఫలితాలు వెరసి అసంతృప్తికి దారి తీస్తుంది. ఒకనాడు తమ బతుకుల బాగు కోసం చేసే ప్రతి ఉద్యమంలో పాట ముందు వరసనే ఉంది. పలు రాజ వంశాల నిర్మాణం, వాటిని విస్తరించడం, కాపాడ్డం కోసం ఆనాడు యుద్ధాలు చేశారు. 'రాజ్యం' ఆ ప్రజలపైనే దాష్టీకం నెరిపినప్పుడు జానపద వీరులు ఎన్నో ప్రతిఘటనలు చేశారు. ప్రతి ప్రతిఘటన చరిత్రలో ఒక గాథగా నిలిచింది. ఒక వీరగాథై విస్తరించింది. ఇక్కడ శైవం, వైష్ణవం కూడా జన సామాన్య మతమైంది. వాటిలో కింది వర్గాల స్వభావం విస్పష్టం. రాజరిక మతాలను ఎదిరించిన దాఖలాలు కోకొల్లలు. ఎన్ని ఉద్యమాలు

జరిగినా ప్రజలు ఆర్థికంగా పేదలే గాని మానసిక చైతన్యంలో సంపద్వంతులే. తమ తమ గ్రామాలను, ప్రాంతాలను జీవన యోగ్యం చేసుకుని బతకడం నేర్చుకున్నారు.

ఐతే ప్రతిసారీ వలస పాలకులు, రాచరికంతో కుమ్మక్కై ఆక్రమించడం, దొరికినంత దోచుకోవడం అలవాటైంది. నయా నైజాం పాలకవర్గం తెలంగాణా ప్రజల ప్రయోజనాలకు గండి కొట్టారు. ఈ మధ్య కాలంలో భాష పేరుతో తెలంగాణా ప్రజలను కించపరిచారు. ఉద్యోగాలు మళ్ళించబడ్డాయి. ఆర్థికంగా, సంపద పరంగా బలవంతంగా దోచుకోవడం ఎక్కువైనప్పుడు తమ రాష్ట్రం తమకు కావాలని నినదించారు. ఈ భావనను అటు వచన కవులు, ప్రజా కవులు ఏక కాలంలో అందిపుచ్చుకున్నారు.

డిగ్రీలు పొంది పల్లెల్లో నిరుద్యోగులుగా ఉన్నవాళ్ళ యాతనలు చెప్పనలవిగావు. నిండుతున్న ఉద్యోగాలలో ప్రాంతేతరులే ఎక్కువ. తెలంగాణ పది జిల్లాల్లో అన్ని అర్హతలున్నా స్థానికులుగా స్థానికేతరులే ఎంపిక కావడం యదార్థం. అంతటా వనరులు దోపిడే. స్థానిక రాజకీయ నాయకుల వత్తాసు పలకడం విచారకరం. ప్రజల పేదరికం అన్నిరకాల వెనకబాట్లకి కారణం. రాజకీయ పోరాట శక్తులు ప్రాంతీయ అస్తిత్వోద్యమానికి వత్తాసు పలికినా, ఆచరణలో దూరమే పాటించారు. ఈ సమయంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి ఊరూరా చైతన్యం పెంచే పని కవులపైన పడింది. కవులూ, రచయితలు, పాత్రికేయులు ఈ పరిస్థితికి అతీతంగా లేరు. పైగా ఆ చైతన్యంలో భాగమయ్యారు. నిరంతరం ఉద్యమంలో భౌతికంగా, భావనాత్మకంగా భాగస్వామ్యం వహించిన కవులు నిరంతరం రాయడం మొదలుపెట్టారు. అలా రాసిన కవిత్వం సొంతంగా అచ్చేయడం కూడా ఆరంభమైంది. ఇంత మొత్తంలో కవిత్వం వస్తున్న దశలో అందులోని మంచి కవితను ఎంపిక చేసి పొక్కిలి, మత్తడి, ముసుం వంటి కవితా సంకలనాలెన్నో వెలువడ్డాయి. తెలంగాణా రచయితల సంఘం వంటి పలు సాహిత్య సాంస్కృతిక సంస్థలు ఒక్కొక్కటే ఆవిర్భవించాయి. కవులు వ్యక్తిగతంగా వందలాది కవితా సంకలనాలు అచ్చు వేశారు.

పుస్తకావిష్కరణ సభలు, జిల్లా సాహిత్య సభలు, వందలాది కవి సమ్మేళనాలు జరిగాయి. పత్రికలలో ఆవిష్కరణ సభ వార్తలు, గ్రంథ సమీక్షలు, ఎన్నో వ్యాసాలు అచ్చయ్యాయి. ఆవిధంగా రాజకీయ ఆలోచనలకు కవిత్వం ఒక స్థిరమైన ఆలోచనా విధానాన్ని జోడించింది. ప్రజా దృక్పథం నుండి సమస్యలను చూడ్డం కవిత్వమే నేర్పింది.

చరిత్ర, సాహిత్య చరిత్ర, సంస్కృతి, జానపద, గిరిజన సాహిత్యాల అధ్యయనం వంటి రంగాలలో జరిగిన లోటుపాట్లనీ, అసమగ్రతని, విస్మరణని కవులు బలంగా ముందుకు తెచ్చారు.

వచన కవిత్వం పరిధి చిన్నది. ఉద్యమం విస్తృతమైనది. కాబట్టి పాట రంగప్రవేశం చేసింది. గద్దర్, గూడ అంజయ్య వంటి సీనియర్ కవులూ, గోరేటి, అందెశ్రీ, మిత్ర వంటి ఎంతోమంది ప్రజా కవులు కలాలకు, గళాలకు పదునుపెట్టారు. అదును చూసి మిగతా కవులు, కొత్తకవులు ఆ దారిలో అడుగు వేశారు. నుడుగులు కట్టారు. ఒక గొప్ప సాంస్కృతిక చైతన్యం విచ్చుకుంది. ఊరూరా ధూంధాములై పాట ఎగిసిపడింది.

ఉద్యమంలో కవిత్వం పలచబడడానికి వీలుంది. కాని ఉద్యమాలలోనే కవిత్వం కొత్త భాషతో, భావనతో జెండాలాగా సమున్నతంగా ఎగిరే అవకాశం ఉంది. అలా ఎన్నో రకాల పాటలు దశలవారీగా ప్రచారం పొందాయి. పాట ప్రదర్శనగా విస్తరించింది. పాట కొత్త సాంకేతిక సహాయంతో విపరీతంగా ప్రచారమైంది. ఆడియో, వీడియో మాధ్యమాలలో ఊరూ, వాడా చేరింది. యూట్యూబ్‌లో దృశ్యమై, సెల్‌ఫోనులో రింగ్ శబ్దమై ప్రవహించింది. సినిమా తెరని, హాలుని ఉద్యమ వేదిక చేసింది. ప్రజలు పాటను తలకు ఎత్తుకుని దీవించారు. భారతదేశంలో ఈమధ్య కాలంలో ఇంత గొప్ప గాన సాహిత్యం ఎక్కడా రాలేదు. ఏ ఉద్యమంలోనూ ఇన్ని పాటలు వెలువడలేదు. ఇన్ని వేల సాంస్కృతిక ప్రదర్శనలు జరగడం కూడా ప్రథమం. వందలాది కవులు పాటలు రాశారు. వేలాదిమంది గాయకులయ్యారు. కానీ ఈ పాటలను సాహిత్యంగా ఇంకా సరిగ్గా గుర్తింపబడలేదు. రేపటి తెలంగాణాలో పాటల సాహిత్య అధ్యయన పీఠం ప్రత్యేకంగా ఏర్పాటు చేయకతప్పదు.

ఈ సంకలనంలో అక్షరాల నూటొక్క పాటలు ఉన్నాయి. ఒక్కో కవి రాసిన పాటలు అవసరాన్నిబట్టి నాలుగైదు కూడా తీసుకున్నాం. వారు రాసిన అన్ని పాటలూ తీసుకోలేకపోయాం. కవిత్వం, ఇతివృత్తం, భావన, ప్రచారం, జనాదరణ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ పాటలను ఎంపిక చేశాం. ఇందులో రాని పాటలు వేలకు వేలు ఉన్నాయి. ఇంకా చాలామంది కవులు ఉన్నారు. ఉద్యమ పాటలను అన్నింటిని కలిపి ఒక సమగ్ర గేయ సంకలనంగా తీసుకురావలసిన అవసరం ఉంది. ఆ ప్రయత్నం ఎవరైనా చేస్తే అందుకు కావలసిన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధం.

*ఈ సంకలనంలో చోటుచేసుకోవలసిన కవులకన్నా గాయకుల సంఖ్య మరీ పెద్దది. జరిగిన సభలూ, సమావేశాల వివరాలకోసం ప్రత్యేకంగా పరిశోధన చేయవలసి ఉంది. వెరసి తెలంగాణా పాటకు పట్టంకట్టే దిశగా ఈ సంకలనం ఆలోచింప చేస్తుందనడంలో సందేహం లేదు. ఈ సంకలనానికి సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వవలసిందిగా కోరుచున్నాం. మలి ప్రచురణలో వాటిని పరిగణనలోకి తీసుకోగలమని హామీ. పాట పేరుని ప్రాతిపదికగా చేసుకుని అక్షరక్రమంలో వరసగా ఇచ్చాం.*

1 మార్చ్ 2014 — జయధీర్ తిరుమలరావు
హైదరాబాదు — సంపాదకుడు

# మట్టి పరిమళాల పల్లవులు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, దాని పునర్నిర్మాణం కోసం తెలంగాణ రిసోర్స్ సెంటర్ నడుం బిగించింది. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగాలలో నూతన చైతన్యం నింపడం, వనరులని పరిరక్షించడం, విధ్వంసాల్ని, వివక్షతల్ని నిలవరించడం వంటి పలు కార్యక్రమాలను చేపట్టింది. అందులో భాగంగా నెగడు, మనిషి వంటి వరస ప్రచురణలు చేపట్టింది. దక్కన్‌ల్యాండ్ మాసపత్రికను ప్రారంభించింది. ప్రతి శనివారం 'చర్చ' కార్యక్రమం ఏర్పాటు చేసింది.

ఈ ప్రయాణంలో, ప్రస్తుతం 'ఒక్కొక్క పాటేసి....' పాటల సంకలనం తీసుకు వస్తున్నాం.

తెలంగాణ మలి దశ పోరాటం ఆరంభం నుండి పాట ఉద్యమానికి జత కలిసింది. సాహిత్యం, రాజకీయం కలగలసి ఒక వినూత్న చైతన్యం వెల్లివిరిసింది. రాజకీయంగా భోనగిరి సభ ఒక మైలు రాయి. ఆ సభలో "అమ్మా తెలంగాణమా" అనే పాట సాహిత్యంలో ఒక దారి దీపం. అటునిటుగా పాటలు లేవని కాదు. ఒక ఉప్పెనగా పాటలు పుట్టడానికి అదొక ప్రేరణగా మారిందని మాత్రం చెప్పవచ్చు. ఈ ఒక్క పాట నిర్వహించిన పాత్రపై సిద్ధాంత వ్యాసాలు కూడా రాయవచ్చు.

ఇప్పటివరకు వందలాది కవులు వేలాది పాటలు రాశారు. ఐతే చాలా పాటలు ఆయా ప్రాంతాలలో బాగా ప్రచారంలో ఉన్నాయి. ఒక్కోపాట ఎన్నో పాఠాంతరాలుగా మారాయి. మారుమూల పల్లెలో ఉండి రాసిన పాటల్లో బలం ఉంటే అది పది జిల్లాల్లో ప్రచారం పొందింది. అలా ఎందరో కవులు సాహిత్యంలో స్థానం సంపాదించారు.

తెలంగాణా కల సాకారం అవుతున్న సమయంలో ఉత్సాహ వాతావరణం కల్పించి, మరోమారు దీక్షాబద్ధులం కావాలి. తెలంగాణ నవ జన నిర్మాణంలో పాటని విస్మరించకూడదు. అందుకే ఈ పాటల సంకలనం ఇప్పుడు వెలువరిస్తున్నాం. లభ్యమైన మంచి పాటలు సేకరించి పాఠకులకు అందించి గేయ సాహిత్యం

నిర్వహించిన పాత్రను, పాట విలక్షణతని మరోసారి జ్ఞాపకం చేసుకోవడం సముచితంగా ఉంటుందని భావించాం.

తెలంగాణ పాటల ఖని. నల్లబంగారం తీస్తున్న కొద్దీ వెలువడినట్లుగా తవ్వినకొద్దీ పాటలే. కొత్త రాష్ట్రం ఏర్పడుతున్నది. అన్ని గండాలను అధిగమించాలి. నవ తెలంగాణలో ప్రజల బాధలు తీరాలి. అందుకు ఎలాంటి ఆటంకం ఏర్పడి మళ్ళీ పాట పదునుదేరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చెరబండరాజు పాట సైతం ఈ ప్రవాహం వేగం పెంచింది. ఆ పోరాటం కొనసాగుతుంది. గద్దర్, గూడ అంజయ్యలు ప్రజల పాటకి కొత్త శక్తి నింపారు. వీరి అనంతర కవులు పాట వైశాల్యాన్ని, లోతుని గణనీయంగా పెంచి ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళారు.

కేవలం భౌగోళిక తెలంగాణే కాదు. వనరులు, పర్యావరణం, సాంస్కృతిక వైవిధ్యత వంటి వాటి పరిరక్షణ కోసం ప్రజల ప్రతిఘటన స్థాయిని పెంచుకుంటూ, పెంచుతూ ముందుకు సాగే క్రమంలో ఈ పాటల సంకలనం ఉపయోగపడాలని రిసోర్స్ సెంటర్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నది. టీఆర్‌సి 'చర్చ' కార్యక్రమాల్లో భాగంగా మూడు సభలు తెలంగాణ ఉద్యమ పాటలపై నిర్వహించాం. ఈ చర్చలలో కొన్నింటిని అచ్చులో తీసుకురావడం జరిగింది.

తెలంగాణేతర తెలుగు ప్రాంతాలలో కూడా ఈ పాటల సవ్వడి వినిపించాలని భావిస్తున్నాం. అది పుస్తకం రూపంలో మాత్రమే సాధ్యం. ఈ గేయ గాన సాహిత్యం సాహిత్యంగా, ఈ కవులు అగ్రశేణి కవులుగా గుర్తింపు పొందాలి. అందుకు ఇలాంటి పుస్తకాలు మరికొన్ని ప్రచురించాలని మా ఆకాంక్ష. ఈ పాటలు చాలా వరకు ప్రజల నాలుకలపై నర్తిస్తున్నవే. ఇవి నోటి సాహిత్య రూపంలో బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఇవి తెలంగాణా ప్రజల ఆస్తి. ఈ పాటలను తెలుగు ప్రజలందరి ఉమ్మడి సంపద కావాలని కోర్కె. ఈ పాటలపై అంతర్జాతీయంగా ఉన్న అభిమానుల దృష్టి, పరిశోధకుల చూపు పడాలని ఆశిస్తున్నాం.

తెలంగాణా ప్రజోద్యమ ఘట్టాలు, వివిధ దశలు ఈ పాటలలో ప్రతిబింబిస్తాయి. అంటే ప్రజల ఉద్యమ చైతన్య స్ఫూర్తి కుడా ఈ పాటలలో నమోదయ్యింది. ఈ పాటలను ఆ విధంగా ప్రజలు రూపొందించిన నివేదికలుగా రేపు చరిత్రకారులకు కూడా ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు. తెలంగాణ ఉద్యమ పాటల సంకలనాన్ని తీసుకు రావలసిన అవసరం ఉందని చెప్పి, ఆ సంకలనం

*రూపొందించడంలో శ్రమకోర్చిన జయధీర్ తిరుమలరావుగారికి మా వందనాలు.*

*ఏవైనా సూచనలు ఇస్తే వాటిని మలి ప్రచురణలో సవరించుకోగలమని తెలియజేస్తున్నాను. ఈ పుస్తకంలో చోటు చేసుకోని పాటలను మలి ప్రచురణలో చేర్చగలం. లేదా మరో సంకలనం తీసుకురాగలం. కావున ఈ తొలి సంకలనాన్ని గుండెలకత్తుకుని ఆదరిస్తారని ఆశిస్తున్నాం..*

*దండాలతో--*

మీ

వేదకుమార్.యం

ఛైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్

29 మార్చ్ 2014

హైదరాబాదు

# ఒక్కొక్క పాటేసి......

# అమ్మా తెలంగాణమా

– గద్దర్

అమ్మా తెలంగాణమా – ఆకలి కేకల గానమా
అమ్మనీకు వందానాలమ్మో
కమ్మనీ ప్రేమా నీదమ్మొ
ఎట్లోల్ల మట్టి చిప్పవూ....
గాయిదోల్ల గండ్ర గొడ్డలివి ॥అమ్మా॥

కమ్మంమెట్టు అడవులతోని – కట్టుకుందీ పచ్చని చీరా
ఆదిలాబాదు ఆకునులిపి – పెట్టుకుందీ నొసట బొట్టు
నాగారం అడవి తుమ్మతో – దిద్దుకుంది కండ్లకాటిక

కుసుమ పువ్వులు నూరమ్మో
పసుపు పూసూకుందమ్మో
నిండు ముత్తయిద తెలంగాణమూ...
ముండమోసినట్టున్నాదమ్మో ॥అమ్మా॥

పసుపు పచ్చా ఆకుపచ్చా – నాపరాయి సూపుసూడు
ముదుమానిక్యం అమృతపాణి – ముద్దు ముద్దు మొకం సూడు
దేవుండ్లకు మారు రూపము – నల్ల సరపు నునుపు సూడు

కొంగుకు బంగారమమ్మో
సింగసరేణి మందమర్రెమ్మో
ఎండి బంగారం దండిగ వున్నా...
బోడి మెడతో గొల్లునేడ్సినది ॥అమ్మా॥

కొమ్రంభీముని కొల్సిమొక్కేటి - కేస్లాపూరూ జాతర చూడు
అలిగిన సీతకు మొండి రామునికి - బంధం గల్పిన భద్రాచలమూ
శివ శివ అంటూ ఒక్కపొద్దిడిసే - యముడాల రాజన్న రూపం చూడు
పాయలై విడిపోయే గంగా - ఏడుపాయల జాతర చూడు
గొడ్రాల్లకు బిడ్డలనిచ్చే - సమ్మక్క సారక్క జాతరచూడు
పోసమ్మ, మైసమ్మ కాలెమ్మ తల్లి - గండి మైసమ్మ కనుగుడ్లు సూడు

కొమరెల్లీ మల్లన్న చూడు
కొండ సోరికెల్లో దాగుండు
కోటి దేవుళ్ళకు దీపం బెట్టినా....
కూటికి లేని తల్లిని చూడు ॥అమ్మో॥

పొద్దుగాల్లనే నిద్దుర లేపే - బాలసంతుల శంఖం చూడు
తాంబుర్ర బుర్రల తందాన తాననే - బల్గూరి కొండయ్య బుర్రకథను
దే అల్లాకే నామ్ అంటూ - ఫకీర్ సాహెబ్‌ల దీవెన దేఖో
వంగీ వంగీ దండం బెట్టే - గంగిరెద్దులా రంగుల సూడు
ఢిళ్ళెం పళ్ళెం ఢీం ఢీం అనగా - గొల్లకుర్మల ఒగ్గుకథలమ్మో
గుడుక్ గుడుక్ అని జెమ్డికెమీదా - బయిండ్లోండ్ల ఎల్లమ్మ కథలూ
వెన్నెల రాత్రులో కోలన్నలు - చిందులు వేసే చిరుతల భజన
జెజ్జనక జెన్ దద్దనక ధన్ - డప్పు మీద దరువులు సూడు

తీన్‌మార్ దెబ్బ చూడమ్మో
తీరొక్క దరువూ సూడమ్మో
ఆటపాటలా పల్లోయమ్మో....
నోటిమాట రాని తల్లోయమ్మో ॥అమ్మో॥

మహాతల్లి మహాబలేశ్వరం - కృష్ణమ్మకు జన్మనిచ్చింది
భగీరథి తుంగభద్ర - పెద్దవాగు పాలేరును
అహల్యను అలుముకున్నది - మూసీ నదిని ముద్దాడింది
పాలమూరు వొడిలో కృష్ణా - పాడుకున్నదీ ఆడుకున్నదీ
నల్లగొండా గుండెల మీద - నడక నేర్చినది నాట్యమాడినది
జోరు జోరుగా వోరుగ వచ్చి - జూరాల వద్దా జూలలూగినది
శ్రీశైలం మల్లన్నను చూసీ - శివతాండవం చిందు లేసినది

నందికొండ గుండెల్లో తల్లి
సల్లంగా నిద్దురబోయిందీ
కృష్ణమ్మ తల్లి తెలంగాణకు....
కన్నీళ్ళు తప్ప నీళ్ళివ్వలేదు ॥అమ్మా॥

పడమటి కనుమల నాసిక్‌లోనా - తల్లి గోదావరి పుట్టిన ఇల్లూ
బాస చేసే బాసర వద్దా - ఆదిలాబాదులో అడుగుబెట్టింది
సేతులు చూపి కిన్నెరసానిని - ఎత్తుకోని ఎగరేసింది
మంజీరాలను కిన్నెరసానిని - మనస్సునిండా దాసుకున్నదీ
సేతులు చూసీ ఎత్తుకున్నదీ - మూతులు ముడ్సీ ముద్దాడినదీ
పోచంపాడు కాడ పొదిగిపోతనని - బాస చేసినది బరోసిచ్చినది

గంగమ్మకు దయరాలేదమ్మో
గంటెడూ నీల్లివ్వలేదమ్మో
గోదావరమ్మ తెలంగాణను....
గొడ్రాలు చేసి పోయినదమ్మో ॥అమ్మా॥

అడవితల్లి గుండెల్లోనా - గోండుదాదల అడుగులుజాడు
తుడ్రమామ కొండమామా - ఈకెలు జాడు ఈటెలు జాడు
యాడియంబోడియం జిమ్మెక్కజిమ్మో - లంబాడి చెల్లెల నాట్యంజాడు

చెంచొల్ల కూనలు చూడమ్మో
వాడిన అడవి పూలమ్మో
పచ్చపచ్చని అడవి తల్లి
నెత్తురు మడుగుల్లో మునిగిందమ్మో ॥అమ్మో॥

కుమిలి కుమిలి నా తెలంగాణము - కుంపటయ్యి మండుతుందమ్మో
మోసపోయిన తెలంగాణము - కాషెపోసి కదులుతుందమ్మో
నెత్తురుపోసిన తెలంగాణము - ఎత్తినదమ్మొ పోరు గీతము

ఏడ్చిన తెలంగాణమ్మో
ఎదురు తిరిగి లేస్తున్నాదమ్మో.....
దగా పడ్డ నా తెలంగాణము
దండుగట్టిమరి కదులుతున్నది ॥అమ్మో॥

# అమర వీరులకు అంకితం

- కొమెరె వెంకన్న

వీరులారా ఓ బిడ్డలారా
ఉద్యమాల మా ధృవతారలారా
వేలవేల తారల్లో మీరు....॥2॥
వేదుచుక్కలై వెలుగుతున్నరా ॥వీరు॥

నింగిలోన చుక్కల్లో మీరే
నేలపైన మొక్కల్లో మీరే
మబ్బుచాటున మెరుపుల్లా మీరే
మండేటి సూర్యుల్లు మీరే ॥వీరు॥

తెల్ల మల్లెమొగ్గలు మీరే
ఎర్ర మోదుగు పువ్వులు మీరే
ఆకు చాటు పిందెలు మీరే
ఆశయాల బాటలు మీరే ॥వీరు॥

ఏరువాక తొలకరి మీరే
ఏడురంగుల సింగిడి మీరే
ఎగిసిపడ్డ అలలు మీరే
ఎర్రసంద్రం కెరటాలు మీరే ॥వీరు॥

రామచిలక పలుకుల్లో మీరే
కోయిలమ్మ పాటల్లో మీరే
పాలపిట్ట పరుగుల్లో మీరే
పావురాల గుంపుల్లో మీరే ॥వీరు॥

లేగదూడ అరుపుల్లో మీదే
లేడిపిల్ల గంతుల్లో మీరే
జింకపిల్ల పరుగుల్లో మీరే
పులి పిల్లల పంజా మీరే ॥వీరు॥

# అమర వీరులారా మీకు వందనం

- శనిగారం బాజ్జీ

అమరవీరులారా మీకు వందనం
మా పోరాట యోధులారా వందనం ॥2॥

పోరాట చరితగల్ల తెలంగాణ మనది
ఆంధ్ర పాలకుల దోపిడీ చూసిన మీరు
1969లోన ॥తెలంగాణా కొరకు ప్రాణాలు వదిలినట్టి॥
విద్యార్థి వీరులారా వందనం
మా తెలంగాణ వీరులారా వందనం ॥అమర॥

తెలంగాణ తల్లి కడుపు కోత చూసి
కోట్లాదిమంది ప్రజల బతుకు మారాలని
॥ప్రత్యేక రాష్ట్రం కోసం ఒంటిని నిప్పు చేసి॥ ॥2॥
శ్రీకాంత చారి నీకు వందనం
వేణుగోపాల్‌రెడ్డి నీకు వందనం ॥అమర॥

ఉస్మానియా గడ్డమీద ఉక్కు పాదం మోపి
ఆంధ్ర సర్కారంత అల్లకల్లోలం చేస్తె
॥అగ్గి పిడుగులై॥ అసెంబ్లీ వరకు నడిచిన ॥2॥
యాదన్న నీకు వందనం
సువర్ణ నీకు మా వందనం ॥అమర॥

ఎదురు చూసి ఎదురు చూసి
ఏండ్లు గడిచినాయి ఎతలు తీరకపాయే

॥610 జీవో రాకాపాయే॥ ॥2॥
తూటాకు ప్రాణమిచ్చినా వీరుడా
మా కిష్టన్న నీకు మా వందనం ॥అమర॥

వీరులారా మీ త్యాగాలు మరువలేము
ఆశయ సాధనకు ముందుండి పోరాడతాము
॥కొట్లాడి రాష్ట్రాన్ని సాధించి తీరుతాము॥ ॥2॥
మా గుండెలల్లో గుడి కడుతం వీరులారా
మా పంటలల్లో మిమ్ము చూస్తం వీరులారా ॥వీరులారా॥

# అమ్మమ్మ సింగరేణి

- జయరాజు

అమ్మమ్మ సింగరేణి అమ్మా సింగరేణి
సల్లంగ చూడవే తల్లి సింగరేణి
అమ్మా సింగరేణి మా తల్లి సింగరేణి
అవ్వా సింగరేణి మా బువ్వా సింగరేణి ॥అమ్మా॥

ఖమ్మం వరంగల్లు ఆదిలాబాద్ కరీంనగర్
కన్నతల్లివోలె మమ్ము సాదుకున్నవు
కడుపులున్న దంతపెట్టి కట్టెలాగ కాలిపోతు
మాఇంటి దీపమై వెలుగుతున్నవు ॥అమ్మా॥

నువ్వుకాలు పెడితె రైలు బండి ముందు కురుకును
నువ్వు కాలుతుంటె కరంటు వెలుగులవ్వును
నీ చమట తోటి చలువరాతి మేడలాయెను
నీ నెత్తురంత మిల్లులాకు సత్తువాయెను ॥అమ్మా॥

తెల్లవాల్లు కొల్ల గొడెతె తల్లడిల్లినా
నీ పాలతోటి సంఘపోల్ల సాదుకున్నావు
నీ కొంగు చాటునా మమ్ము దాచుకున్నావు
నువ్వు దోపిడోల్ల గుండెలల్లో పేలుతున్నవు ॥అమ్మా॥

నిన్ను చూసి సర్కారోడు మురిసిపోయెనె
నిన్ను పెద్ద పెద్ద దొరలాకు అమ్మ చూసెనె
అమ్మలాంటి నిన్ను మేము అమ్మనియ్యమే
వాల్ల గుండెలల్లో బొగ్గులాగ మండుతాములె ॥అమ్మా॥

# అలలమీద నావ

- యాదగిరి

అలలమీద సాగుతున్న నావలా
పాట పల్లెలో ప్రవహించేను ఏరులా
త్యాగాల ఈ నేల తనువంత గాయాలా
చిగురించేను కొమ్మలా
వెన్ను తడై అమ్మలా ॥అలల॥

గలగల జలపాతం సంగీత నాదాలై
దనదన గుండె దరువే జన విముక్తి గానాలై
స్వయంపాలన ఏలిన సర్వాయి పౌరుషమై
సమ్మక్క సారక్కల తుడుంమోత నినాదాలై
బందగి కొమురం భీం అయిలమ్మ, కొమురన్నల-
వేలకోలదిగ వీరుల త్యాగాల దారిలోనా ॥అలల॥

పాటలనే తూటాల మాలలుగా అల్లుకొని
వెట్టిచాకిరి విముక్తికై ఎగిసి పిడికిల్లల్లో
గడిలపై తిరుగుబాటు గర్జించిన రోజుల్లో
యుద్ధనీతి సుద్దాల బండిమీద గిరిలై
భూమిపోరు నడిపినప్పుడు భుజంతట్టి లేపినట్టి ॥అలల॥

నల్లమల్ల తల్లి ఒడిలో పల్లవుల చిరుజల్లులో
సమసమాజ స్థాపనకై సాగుతున్న సమరమందు
ఆదివాసి కోయ గోండు హక్కులడిగె రేల పాట

దళారి దోపిడి గుమడెల ఎక్కుపెట్టినమాట
అడవి హక్కు మనదేనని నడిపించెను పోరు బాట
ఆయుధాలనేసుకోని సాయుధ పోరును నడిపి ॥అలల॥

కోటిరతనాల వీణా గానమైన దాశరధి
యువతరమా రా రమ్మని కదిలించెను చరబండ
తెలంగాణ మట్టి బతుకే కాళోజీ నా గొడవల
నిర్భంధాలెన్నైనా నిలబడి కలబడ్డ పాట
యుద్ధనౌక గద్దరన్న ఎన్నుల తూట దించితే
ప్రజల పాటకు చావు లేదని ప్రపంచానికె చెప్పెను ॥అలల॥

అణచబడ్డ కుల గొంతుల అగ్గిమంటలైన పాట
పూలే అంబేద్కర్ల ఆలోచన నేర్పె పాట
మహనీయుల దారిలోన నడిసేను బహుజనం పాట
జనహోరు సంద్రమైన తెలంగణ ప్రజల పాట
కుల వర్గ పోరాటమె మారోజు వీరన్న పాట
పీడిత ప్రజల విముక్తి ఏపూరి సోమన్న పాట ॥అలల॥

# అవ్వోనివా .....

– గూడ అంజయ్య

అవ్వోనివా నువ్వు అయ్యోనివా
తెలంగాణోనికి తోటి పాలోనివా?
ఇసుంట రమ్మంటే ఇల్లంత నాదంటు
తిన్నింటి వాసాలు లెక్కేత్తవా ....! ॥అయ్యోనివా॥

భాగ్యనగరానికి ముగ్గువోసినవా?
పొలిమేర్ల బొడ్రాయి పెట్టినవా?
చార్మినార్కు సున్నమేసినవా?
గోలకొండకు రాళ్ళు మోసినావా?
మూసినదికి గోడ వెట్టినవా?
ఫలకునుమా నువ్వు కట్టినవా?
కూసున్న కాడనె ఎత్తులేసి
హైదరాబాదంత మీదంటవా? ... ॥అయ్యోనివా॥

కోన సీమలో కొబ్బరి తోటంటిమా?
మీ మాగాణి భూముల్లో పాలంటిమా?
గుంటూర్లో గుంటెడు జాగంటిమా?
కాకినాడ ఓడ రేవంటిమా?
పాకొల్లుకు పిల్లనడిగత్తిమా?
వైజాగుకు వియ్యమందొత్తిమా?
కంచంలో పొత్తంటె సై అంటిమి
వియ్యమందుదమంటె వద్దంటిమి ... ॥అయ్యోనివా॥

పప్పులో ఉప్పేసి పొత్తంటిరి
తెలంగాణ ప్రాజెక్టులేం జేస్తిరి
సిక్స్‌టెన్ జీవోను ఏం జేత్తిరి
మసిపూసి మారేడు కాయంటిరి
జై తెలంగాణంటె వద్దంటివి
సమైక్యతే నీకు ముద్దంటివి ..... ॥అయ్యోనివా॥

పుడితె ఒక్కటి సత్తె రెండున్నర
తల్లి కడుపులోకి మళ్ళి పోమన్నరు
బరిగీసి పల్లెలు నిలుచున్నయి
తెలంగాణ జెండెత్తి జైయన్నయి .... ॥అయ్యోనివా॥

# ఆడపిల్లనమ్మా

- వై. వెంకన్న

ఆడపిల్లనమ్మా నేను ఆడపిల్లనాని
బాధ పడకమ్మా నీవు దిగులు చెందకమ్మా ॥ఆడ॥

అష్టంలో పుట్టినాననీ అమ్మా జెష్టదాన్నంటున్నారా
ఈ పాడు లోకంలో అమ్మా హీనంగా చూస్తున్నారా
ఆడదని అంటున్నారా అమ్మా పాడుదని అంటున్నారా
అష్టంలో పుట్టిన కృష్ణుణ్ణేమో దేవుడని అంటున్నారా
నన్నేమో పాడుదని తిడుతున్నరా ॥ఆడ॥

పలక బలపం పట్టీ అమ్మా బడికి పోతుంటే
ఆడపిల్లైనందుకు చదువెందుకంటున్నారా
చదువెందుకంటున్నారా అమ్మా సందెందుకంటున్నారా
చదువుల తల్లీ సరస్వతి ఆడదే కాదమ్మా
నాకేమో చదువెందు కంటున్నారా ॥ఆడ॥

ఎదిగేటి నన్ను చూసి అమ్మా ఏడుస్తువున్నారా
లక్షల కట్నాలు ఎట్లా ఇస్తావని అమ్మా కుమిలిపోతున్నారా
కడుపులో ఆడబిడ్డంటే అమ్మా కరగదీస్తున్నారా
ఆడపిల్లను వద్దనుకుంటే సృష్టికి మూలమేది
జగతికి మార్గమేది ॥ఆడ॥

# ఆడుదాం డప్పుల్ల

- మిత్ర

ఆడుదాం డప్పుల్ల దరువెయ్యర
పల్లె తెలంగాణా పాట పాడరా
కోలాటమూ జెడ కొప్పేయ్‌రా
దూలంటూ ఆల్వాపై దుంకాడరా.... ॥ఆడుదాం॥

ఎటు జూసిన టీవీల లొల్లెగదరా
మనపని పాటలన్నిటిపై దాడేగదరా ॥మ॥
ఆడినా సిందోల్ల ఆటల కోసం
పాడినా పద్యాల జాడల కోసం ॥పా॥
పాతరేకు ప్లాస్టిక్‌ను తగిలెయ్యరా
నీతోలు వాద్యాలు మోగించరా .... ॥ఆడుదాం॥

బాలసంతు గంటల్ల మోతలేవిరా
సుప్రభాతమంటూ రోజు సోదాయెరా
కంటినిండ పంటజూసి పొలిజెయ్యరా
ఓలంటూ బంతికాడ గొంతెత్తరా
బతుకమ్మా ఆహో బతుకమ్మ ఓహో
బతుకమ్మా మన బతుకు ఆటేగదరా
జాజిరాడ జమగూడి పోదాం పదరా .... ॥ఆడుదాం॥

కాముడిలా మన గుడిసెలు కాలీపోతే
పెద్దోళ్ళ మిద్దెలెట్ల పెరిగినయిరా

నీల్లొడ్సి మన గొంతులెండీ పోతె
తడిబల్సి వాడెట్ల ఒర్రాబట్టె
ముదిరినా కలుపుల్ని పీకుదంరా
మునుమెల్ల సవ్వడిగా పాడుదంరా ....  ॥ఆడుదాం॥

తెలంగాణ సినిమాల్లో విలనాయెరా
మనభాష మన యాస ఎక్కిరింతరా
నిజమైన విలనోల్లు హీరోలురా
అభిమానా సంఘాలా జోరాయేరా
భాగోతం గద్దెలన్నీ కూలిపాయెరా
పట్నమే సినిమోల్ల పాలాయెరా ......  ॥ఆడుదాం॥

అడవిలో నీ గొంతు కోయిలమ్మయి
పట్నంలో నీదరువు తీన్మారై
సింగరేణి గనిలోన సైరన్ మోతై
బీడీలు దాల్వంగ కూని రాగమై
కరువుల్లో కన్నీళ్ళ అక్షారాలై
పోరులో నెత్తుర్ల సంగీతమై .....  ॥ఆడుదాం॥

తెలంగాణ పోరాటం పల్లవిదేరా
కాళోజి నా గొడవల జన చలనంరా
దాశరథీ జనజీవన యాతరిదేరా

కోటి రతనాల వీణ తెలంగాణరా
తరగని జనగానమై ఊరిందిరా .... ॥ఆడుదాం॥

పాడుదాం తెలంగాణ పాట పాడుదాం
ప్రజల కొరకు గజ్జెకట్టి ఆటలాడుదాం
పాటమీద మాట మీద పెత్తనాలనూ
తరిమికొట్టె పోరాట గుత్పలవ్వుదాం
ఎయ్‌రా తెలంగాణ దరువెయ్యరా
డోలుడాలు చేసుకొని అడుగెయ్యరా! .... ॥ఆడుదాం॥

# ఆకాశానా మబ్బులారా

- గోపాల్

ఆకాశాన మబ్బులారా - పాలమూరూ వచ్చిపోర
ఏకునాదం మోతలై - ఏకతాటిగ కురిసి పోర
గుక్కెడన్ని నీళ్ళులేక - గుండెబగిలి సావనాయె
బీడు భూములు - పంటభూములు
ఊరి చెరువులు - ఊటబావులు
ఒక్కసారీ - రమ్మంటున్నాయి
వాన మబ్బై తరలిరార - ఒక్క చినుకు రాలిపోర ॥ఆక॥

నేలమీదా చెట్టు చేమల
నీరు లేకా నిలువున ఎండి
ఒట్టిబోయీ ఉన్నాయమ్మ
ఆశతోనీ చూస్తున్నాయి పలకరించి పోరాద ॥ఆక॥

పక్షులన్నీ వలసబాయె
పశువులు కోతకు అమ్ముడాయె
కూలీలేకా కుములు డాయె
నల్ల మబ్బై తరలిరార - ఒక్క చినుకు రాలిపోరా ॥ఆక॥

కొట్టములో ఎడ్లు అన్ని
కాటి పాలై పోయినావి
పాడి ఆవు ప్రాణాం పాయె
పల్లెలన్ని ఎండిపాయె - ప్రాణం బోయేకాలమొచ్చె ॥ఆక॥

ఊరులన్నీ దుమ్ములేసి
తల్లి బిడ్డకు దూరమయ్యి
కాని రాజ్యం పోతున్నాము
మళ్ళి వస్తమొ రామొగాని - మము పలకారించరార ॥ఆక॥

# ఆగమైన తెలంగాణ

- దాసరాజు రామారావు

అంగడిలో ఆగమైన అవ్వ తీరుగనున్నవే తల్లి నా తెలంగాణ
తెలుపు నలుపుల బొమ్మ తీరుగ తెల్లబోయి ఉన్నవే ॥తల్లి॥

అలుపు సొలుపుల సెమట పాటల కలుపు తీస్తు ఉన్నవే ॥తల్లి॥
కడుపు కడుపు దప్పి ఆకలి ముడుపు గట్టి ఉన్నవే ॥తల్లి॥
దుక్కిదున్ని పంటనాటి మన్ను బుక్కుతున్నవే ॥తల్లి॥
తెప్ప కాపులేని కంటి చూపు వోలె ఉన్నవే ॥తల్లి॥
రెక్కలన్ని ముక్కలైన డొక్క నిండక ఉన్నవే ॥తల్లి॥

అతివృష్టి అనావృష్టి గుంట నక్కల చుట్టాలె ॥తల్లి॥
పచ్చి కరువుల బాలింతగ ప్రతి ఏడు ఉందువే ॥తల్లి॥
గుడిసె నీది గొంగడి నీది గుడ్డి బతుకు నీదిలే ॥తల్లి॥
నిన్న వచ్చిన కొమ్మలేమో నేడు బంగరు కత్తులాయె ॥తల్లి॥

మాగాణిని మాయజేసి ఎడారిగా మార్చినారే ॥తల్లి॥
ఎడ్డిదానివి తెలివితోటి నిట్ట నిలువు ముంచిరే ॥తల్లి॥
నైజామును ఎదురొడ్డిన చేవ యాడికి బోయెనే ॥తల్లి॥
కోటి రతనాల వీణవంటూ కవులు నిన్ను మెచ్చిరే ॥తల్లి॥

కొల్లగొట్టితే తల్లడిల్లుతూ కొర్రాయిగా మారినవే ॥తల్లి॥
కన్ను కుట్టిన రాజరికం కల్లోలిత మన్నదే ॥తల్లి॥
తూటాలతో పల్లెలాను తూట్లు తూట్లు పొడిచిరే ॥తల్లి॥
రజాకార్లను మించిపోయి రాక్షస పాలన చేసిరే ॥తల్లి॥

ఏడాది పోరన్ని ఎన్‌కౌంటరు చేసిరే ॥తల్లి॥
రక్తంలో నిన్ను ముంచి రామరాజ్యమన్నరే ॥తల్లి॥
కుమిలిపోతూ కమిలిపోతు దడిసి పోతూ ఉన్నదే ॥తల్లి॥
పోరుబాటలో కాలుబెట్టగ పొద్దు నిద్దుర లేచెనే ॥తల్లి॥

# ఆళ్వారూ మట్టిపోరూ

- దేశపతి శ్రీనివాస్

వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
పలుకుతోంది పిడికిలెత్తి తెలంగాణ జోహారూ!!

కన్నతల్లి కడుపులోన కల ఏదో కన్నావు
ఉద్యమాల ఉగ్గు బువ్వ చిన్ననాడె తిన్నావు
బతుకు పోరులోన జనం వెతలహోరు విన్నావు
వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
ఉప్పెనగా ఎగిసిపడిన వెట్టి బతుకు కన్నీరూ!!

ఆదర్శం మూటగట్టి నెత్తికెత్తుకున్నావు
ఆశయాల పుస్తకాలు ఊరూరుకు పంచావు
గ్రంథమాల కట్టి చరిత బంధనాలు విప్పావు
గ్రంథాలయ ఉద్యమమై గడికి  ఎదురు నిలిచావు
వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
రజాకార్ల నెదురొడ్డిన అక్షరాలకైజారూ!!

జైలులోన జనజీవన విలువలు కనుగొన్నావు
కులమతాల పాదులల్ల కూడు పుట్టదన్నావు
భూస్వామ్యం కూల్చకుండ బువ్వదొరకదన్నావు
భూవిముక్తి ఉద్యమంల ముఖ్యకట్టి నిలిచావు
వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
అగ్ని ధార అలుముకున్న త్యాగాల సెలయేరూ!!

కాలాన్నే చీల్చుకొని కలమై తిరిగిస్తావా
కాటగలెసె తెలంగాణ బాటలు నిర్మిస్తావా
వలస తెరలు కమ్మేసిన వెలుగులు వివరిస్తావా
వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
మల్ల నిన్ను పిలుస్తోంది తెలంగాణ మట్టిపోరూ!!

# ఇంకేమి మిగిలిందిరా

- జయరాజు

ఇంకేమి మిగిలిందిరా తెలంగాణ
జిల్లేడు మొలిచిందిరా...
ఇంకేమి మిగిలిందిరా తెలంగాణ
పల్లేరు గాసిందిరా... ॥ఇంకేమి॥

వరిచేను కడుపుకే తిండిగింజలులేక
వలవల ఏడుస్తూ వున్నదీ
పత్తిచేనుకు వంటి మీద బట్టాలేక
సిగ్గుతో తలదించుకున్నదీ ॥ఇంకేమి॥

మొక్కజొన్న సంక బిడ్డనెత్తుకొని
ఊరిడిసి వలసబోతున్నదీ.... ॥ఇంకేమి॥

మాదిగోల్ల డప్పు మండేటి కడుపు
దండోర వాయిస్తూ వున్నదీ
కుమ్మరోల్ల కుండ చేతిలో చిప్పయి
గడప గడపకూ తిరుగుతున్నదీ..... ॥ఇంకేమి॥

ఆవుదూడలకినిన్న పాల సుక్కాలేక
అంబా అని వర్లుతున్నవీ....
కాళ్ళు చేతులు కట్టి కటికోనికిస్తుంటె
పిల్లకేమి బతుకు నిస్తదీ ॥ఇంకేమి॥

పాలు మరువనట్టి పసిగుడ్డులను బట్టి
కన్న తల్లి అమ్ముతున్నదీ
పాలుగారె బుగ్గల్లో పండేటి మొగ్గలు
పండుటాకై రాలుతున్నరూ...! ॥ఇంకేమి॥

# ఉస్మానియా క్యాంపస్‌లో

- అభినయ శ్రీనివాస్

ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా
వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా
కాకతీయ ప్రాంగణంలో కురిసిన ఓ వర్షమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా ॥వీర॥
భలె ... భలె ... భలె .... ॥ఉస్మానియా॥

నల్లగొండ నడిబొడ్డున నాటిన ఓ ఖడ్గమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగు కోట్ల ప్రాణమా
మహబూబ్‌నగర్ మట్టిలోన
మొలచిన మందారమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా ॥నల్లగొండ॥
భలె ... భలె ... భలె .... ॥ఉస్మానియా॥

హైదరాబాద్ ఒడిలోన చేసిన బలిదానమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగు కోట్ల ప్రాణమా
రంగారెడ్డి ఫ్యాక్టరీలో మోగిన నగారమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా ॥హైదరాబాద్॥
భలె ... భలె ... భలె .... ॥ఉస్మానియా॥

మెదక్ సీమ గాలిలోన త్యాగాల గంధమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగు కోట్ల ప్రాణమా

నిజామాబాద్ నుదిటి మీద దిద్దిన ఓ కుంకుమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా ॥నిజామాబాద్॥
భలె ... భలె ... భలె .... ॥ఉస్మానియా॥

కరీంనగర్ రైతు-కూలీ చిందించిన రక్తమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగు కోట్ల ప్రాణమా
అరెరెరరెరె ఆదిలాబాద్ అడవుల్లో
రాజుకున్న రౌద్రమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా ॥కరీంనగర్॥ ॥ ఆదిలాబాద్॥
భలె ... భలె ... భలె .... ॥ఉస్మానియా॥

వరంగల్లు గడ్డమీద చేసిన నినాదమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా
ఖమ్మం మెట్టు పల్లెలోన ఉప్పొంగిన కెరటమా వీర తెలంగాణమా
వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా ॥వరంగల్లు॥ ॥ ఖమ్మంమెట్టు॥
ఆహౌ ... ఆహౌ ... ఆహౌ .... ॥ఉస్మానియా॥

# ఎగిసెగిసి పడుతుంది గోదావరి

- శక్తి

ఎగిసెగిసి పడుతుంది గోదావరి - ఎ(రజెండయ్యి ఎగిసింది గోదావరి
॥ఎగిసెగిసి॥
ఆదిలాబాదులోన తానడుగు పెట్టింది - అడవిమల్లెల వంటి పల్లెను చుట్టింది
భూమిలో దాగున్న బొగ్గును తాకింది
గోదారి ఖనిలోన గోదావరి తాను గంతులే వేసింది గోదావరి ॥ఎగిసెగిసి॥

నిజామాబాదులో నిలువెత్తు లేచింది - బోధను తాలూకా బీదల సాకింది
బీడీల కార్మికుల బతుకు తానయ్యింది
ఆర్మూరులోన గోదావరి - తాను అలలయ్యి లేచింది గోదావరి ॥ఎగిసెగిసి॥

సిరిసిల్లలోన చిందులే వేసింది - జగిత్యాల గడ్డలో జేజేలు కొట్టింది
దొరల గుండెల్లోన పోటెత్తి పారింది
కరీంనగరులోన గోదావరి - తాను కెరటాలు రువ్వింది గోదావరి ॥ఎగిసెగిసి॥

ములుగులో పోరాట మొలకలు వేసింది - మానుకోటలో తాను మొగ్గలే తొడిగింది
ఇల్లందులో ఎ(రమల్లెలయ్యి పూసింది
వరంగల్లులోన గోదావరి - తాను కమ్ముకుని పారింది గోదావరి ॥ఎగిసెగిసి॥

దమ్మాయి గూడెంలో సన్నాయి మోగింది - బాసారమడివిలో బుసగొట్టి లేచింది
నాగేటి చాళ్లల్లో నాగస్వరమూదింది
ఖమ్మము జిల్లాలో గోదావరి - తాను కమ్ముకుని పారింది గోదావరి॥ఎగిసెగిసి॥

పోలారమడవుల పొలిమేర దాటింది - అంకన్న గూడెంలో రంకెలు వేసింది
పల్లెల్లో పోరుకు ఏరువాకయ్యింది

పడమటి జిల్లాల్లో గోదావరి - తాను పరవళ్ళు తొక్కింది గోదావరి ॥ఎగిసెగిసి॥

పాపికొండల నడుమ పరుగులే తీసింది - ఎల్లవరములో పోరుఎల్లలే చెరిపింది
మొఖాసదారుల కోట ముంచెత్తింది
తూర్పుగోదావరిలో - తాను మార్పునే కోరింది గోదావరి ॥ఎగిసెగిసి॥

సుడిగుండమై తిరిగి కొండల్ని ఢీకొంది - దోపిడి బండల్ని నిలువునా కోసింది
ఆనకట్టలు దూకి హద్దులే లేవంది
జీవనది తానంది గోదావరి - తనకు చావంటు లేదంది గోదావరి ॥ఎగిసెగిసి॥

కూలీలు రైతులు కూడి రావాలని - కార్మికులు పేదలు కలిసి నడవాలని
విద్యార్థి మేధావి చేయి కలపాలని
చేతులే చాచింది గోదావరి - పోరుబాటలో రమ్మంది గోదావరి ॥ఎగిసెగిసి॥

# ఎట్లున్నవే నా పల్లె

- నెర్నాల కిషోర్

నిన్ను ఇడిసి నేను బోయి
శానేండ్లు దాటుతున్నదమ్మా
ఎట్లున్నవే నా పల్లె నువ్వు ఎట్లున్నవే నాతల్లీ

మూలసుక్కా పొడవంగానే
బాలసంతుల గంట నిద్రలేపేది
మస్క సీకటిలోన మాపల్లె లేసేది
పచ్చని సెట్లల్ల పక్షుల కిలకిల
కోళ్ళ గూటిలోన కోడిపుంజుల కూత
అమ్మాలక్కాలంత అలుకు పూతలవెంట -2 "ఎట్లున్నవే"

మన్నెగుట్ట మైసనగుట్ట
నడుమన రకపతి బోరెనుకు నుంచి
భగ భగ సూర్యుడు బయటికచ్చేది
తుకుతుక పొయిమీద కూరబువ్వుడికేది
సద్దిగట్టుకోని అవ్వయ్యపనికి మోముబడికి
ఎవ్వలపనులకు వారెల్లి పోయేది -2 "ఎట్లున్నవే"

పైసలాట పల్లిసెండిల ఆట
తొక్కుడుబిల్లా సిక్కుడుపుల్లా
సిర్రెగోనె బొంగరాలు గోటీలు
దాగిల్ల ముగిల్ల కోతికొమ్మచ్చి

టప్పాలాట సింతగింజెలాడుతుంటె
అవ్వపిలువంగానె ఇంట్లచ్చి చేరేది -2 "ఎట్లున్నవే"

స్వామిగాడు సంపతిగాడు అశోక్‌గాడు
అందరం కలిసి సింతల్లబాయిల ఈతగొట్టబోతే
నీల్లమీద నీరుగట్టె తేలితే
దడుసుకెని దరికి పోయిన సంగతి
ఇప్పడికి నాకు గుర్తున్నదమ్మా -2 "ఎట్లున్నవే"

వానలురాక కరువులు వస్తె
కప్పతల్లాట ఆడెటోల్లము
ఆటకు వానమ్మ వలవల పడగానే
పుడమికల్లి పులకరించి పోయేది
పూనాసపట్యె మురిసిపోయేది
పుట్లకొద్ది పంట పురుడువోసేది -2 "ఎట్లున్నవే"

సలికాలమూ వస్తె గాలాలుదెచ్చేది
బాయిగడ్డ తప్వి ఎర్రలు తీసేది
వరుకల పోసుక సెరువుకు పోయేది
జెల్లలు కొర్రమట్టలు పరుకలు
చాపల పట్టుక ఇంటికి వచ్చేది
పులుసుపెడితె కడుపు నిండ తినేది -2 "ఎట్లున్నవే"

బడికి పోనని మారాముజేస్తె
బరిగె లిరిగెటట్టు అవ్వగొట్టేది
ఎంత జెప్పినా వినకాపోతే
దూలానికి కోదండమేసేది
బూమక్క రాదక్క కట్టు ఇప్పేది
ఆకరికి బడి తొవ్వబట్టేది 2 "ఎట్లున్నవే"

బొంబయి నుంచి మా నాన్న వస్తె
కేలలుదెచ్చేది కారిలు దెచ్చేది
కాళ్ళకు లబ్బరి సైండిలు దెచ్చేది
కొత్త కొత్త డిజను బట్టలు దెచ్చేది
మేరోళ్ళ కిషనుకు కుట్టుకు ఇచ్చేది
ఏసికోని సూసి మురిసి పోయేది 2 "ఎట్లున్నవే"

బతుకమ్మ పండుగ సంబరమంట
పండుగకు మా అక్కలచ్చేది
సత్తుపిండి సత్తుముద్దలు
ఎన్నెన్నో పిండి వంటలు జేసి
పూల పూల బతుకమ్మను పేర్చి
ఆడుత ఉంటే సూడ బోయేది -2 "ఎట్లున్నవే"

దసర పండగస్తె మేకను కోసేది
గౌండ్లేల్ల మల్లన్న కల్లు దెచ్చిచ్చేది
పొద్దుగాలనె లేసి పాల పిట్టను జూసి

సొంయంత్రము జమ్మి కాడికి పోయి
అందరం కలిసి అలాయి బలాయి చీసి
జమ్మిపంచుకోని జాగృతిగుండేది -2 "ఎట్లున్నవే"

దీపావలి వస్తె ఊరంత దీపాలె
సిచ్చుబుడ్డి పువ్వుల్ల నాచెల్లి నవ్వుల్లు
కాకర పుల్లావట్టి తమ్ముడాటలుజూడి
హోళి పండుగస్తె గోగుపువ్వులుదెచ్చి
రంగు నీళ్ళు జేసి సీసలపోసి
అందరి మీద పోసి ఆనందపడెది -2 "ఎట్లున్నవే"

సంకురాతిరి పండగస్తె సాలు
బాలక్క మా సారక్కా బాగ్యక్కా మా సామన్న
శోభను గాడు నేను కలిసి
సారక్క జెప్పేటి సాత్రలు వింటు
సాపల నిండా సకినాలు పోసేది
అట్టె కాల్సి మా కందరికిచ్చేది -2 "ఎట్లున్నవే"

ఊగాది పండుక్కు మామిడాకులు దెచ్చి
తోరనాలు గట్టి గుమ్మాలన్నిటికి వేలాడదిసి
మామిడి పిందెలు తెచ్చి బెల్లవేసి యాపపువ్వేసి
చేదు తీపి ఒగరు ముడురుచులా పచ్చడచేసి
కొత్తసాలుకు సాగువాటు చేసేది -2 "ఎట్లున్నవే"

తల్లీ నీ ఒడి ఇడిసిపెట్టినా
కంటికి పుట్టెడు శోకం బెట్టినా
బతుకు దెరువుకై బాటవట్టినా
పొట్ట చేత బట్టి పట్నమొచ్చినా
యాడున్నగాని నిన్ను మరువనమ్మ
ప్రేమ గల్ల పల్లె తల్లీరో మాయమ్మ-2
నీ ఒల్లోకి వస్తాను పల్లే నన్ను సల్లంగా దీవించు తల్లీ -4

# ఎన్నాళ్ళింక ఆరని కన్నీళ్ళు

- పొలిశెట్టి లింగయ్య

ఎన్నాళ్ళింక ఆరని కన్నీళ్ళు ఓసెల్లెమ్మా
ఎన్నేళ్ళింక తీరని కష్టాలు
నోరులేని జీవాల్లు మనవాల్లు నాసెల్లెమ్మా
తెలంగాణకే బానిస సంకెళ్ళు....
గంజీ గటకా మింగి మనము బతుకుతున్నామమ్మా
ఎండమావి సీల్లు తాగి గొంతులెండేనమ్మా
త్యాగాల పుట్టినిల్లు కుమిలి ఏడ్చేనమ్మా
సాహసాల పురిటిగడ్డ చిన్నబోయెనమ్మా ॥ఎన్నాళ్ళింక॥

లక్షల కొలది ఎకరాలున్న
సుట్టుముట్టు నదులెన్నున్న
అందని ద్రాక్ష పులుపె మిగిలిందా ఓసెల్లెమ్మా
భూగర్భంలో గనులెన్నున్నా
ముడి సరుకులు మన ముందే ఉన్నా
పరాయి పక్షే తన్నుకుపోయిందా నాసెల్లెమ్మా
కాలి కుండలు కూలి బతుకులు మనవైనాయమ్మ
అందలమెక్కి ఆంధ్రోల్లందరు దొరలైనారమ్మ ॥ఎన్నాళ్ళింక॥

ఫైనాన్సులు రియలెస్టేటులు
తోటలు కార్లు బంగ్లాలెన్నొ
ఆంధ్రుల కాదిపత్యం మిగిలిందా ఓసెల్లెమ్మ
కంపెనీలు, ఫ్యాక్టరీలు

హోటలు మరి సినిమాహాల్లు
పెత్తందార్ల సొత్తయినాదమ్మ నాసెల్లెమ్మ
రాజకీయ రణ చదరంగంలో
పావులు మనమమ్మా
పాలు బోసిన చేయిని కరిచే
పాములు వాళ్ళమ్మా ॥ఎన్నాళ్ళింక॥

ఉగ్గుపాల రుణమును తీర్చి
తల్లికి సిరుల తిలకం దిద్ది
సౌభాగ్యాన్ని అందించాలమ్మా ఓసెల్లెమ్మా
చెరలో ఉన్న మన సంపదను
పస్తులు పండే నిరుపేదలను
సమరం చేసి రక్షించాలమ్మ నాసెల్లెమ్మా
నాటి వీరుల పోరుపౌరుషం చూపించాలమ్మా
తెంపుగుణముతో తెలంగాణను సాధించాలమ్మా

# ఎన్ని కమిటీ లేస్తరో

- యశ్‌పాల్

తెలంగాణ ఇచ్చేటందుకు
ఎన్ని కమిటీ లేస్తరో
దమ్మామ్మసారి దమ్మన్న
ఎన్ని కమిటీలేస్తరో
దమ్మామ్మసారి దమ్మన్న
తెలంగాణ పాతరపెట్టి
శ్రీకృష్ణ కమిటొచ్చెరో
దమ్మామ్మసారి దమ్మన్న
శ్రీకృష్ణ కమిటొచ్చెరో
దమ్మామ్మసారి దమ్మన్న

తెలంగాణ ఉద్యమం
ఉధృతమైనపుడల్లా
భ్రమలు గొలిపే కమిటీలు
మన ముంగిట పెడుతుండ్రు
నాయకులు ప్రలోభాలతో
లొంగతీసుకుంటుండ్రు...చల్

అరవై తొమ్మిది నుండి
నమ్మించి గొంతు గోసిరో
తెలంగాణ తమ్ముడా
నమ్మించి గొంతుకోసిరో
తెలంగాణ తమ్ముడా

నానాబెట్టి తెలంగాణ
నేతల చీల్చితున్నరో
తెలంగాణ తమ్ముడా
నేతల చీల్చితున్నరో
తెలంగాణ తమ్ముడా

కాంగిరేసు మ్యానీపెస్టులో
తెలంగాణ ఇస్తమనీ
గల్లీ నుండి ఢిల్లీదాక
లొల్లీ పెట్టి చెప్పినారు

గద్దే నెక్కి కాంగీరేసు
తెడ్డు జూపినాది మనకు...చల్

సోనియమ్మ చేతిలుందనీ
మొండి చేయి జూపిరే
తెలంగాణ తమ్ముడా
మొండి చేయి జూపిరో
తెలంగాణ తమ్ముడా

చెట్టు పేరు చెప్పుకోని
కాయలమ్ముతున్నరో
తెలంగాణ తమ్ముడా

కాయలమ్ముతున్నరో
తెలంగాణ తమ్ముడో

ఇచ్చేది మేమనీ
తెచ్చేదీ మేమనీ
ఢిల్లీ కెల్లి పోతున్నాం
తెలంగాణ తెస్తన్నమనీ

ఆంధ్రకొకమాట చెప్పి
తెలంగాణ కొకటి చెప్పి ....చల్

తెలుగుదేశం గోడమీద
పిల్లిలా పొంచివున్నదో
తెలంగాణా తమ్ముడా
పిల్లిలా పొంచివున్నదో
తెలంగాణా తమ్ముడా

పార్లమెంట్‌లో తెలంగాన
పాస్ చేస్తనన్న కమిటీ
ప్రణబ్ ముఖర్జీ కమిటీ
ఏమైందో ఆడగరాయే

ఢిల్లీ అమ్మతో బేరమాడి
భరోసిచ్చి వచ్చినారో...చల్

తెలంగాణ ప్రజలతోనే
నాటక మాడుతున్నరో
తెలంగాణా తమ్ముడా
నాటక మాడుతున్నరో
తెలంగాణా తమ్ముడా
ఎంపీ ఎమ్మెల్యేలకు

సిగ్గు లజ్జా కరువాయే
తెలంగాణా తమ్ముడా
సిగ్గు లజ్జా కరువాయే
తెలంగాణ తమ్ముడా

పెద్ద మనుషుల ఒప్పందాన్ని
తుంగల తొక్కితే చూసినారు
ఆరొందల పది జీవో
మసిపూసి మూసేసిరి

గిరిగ్లానీ కమిటీనీ
చెత్తబుట్టలేసింద్రు...చల్

మాయల శ్రీకృష్ణ కమిటీ
గారడి చేయ వచ్చెరో
తెలంగాణ తమ్ముడా

గారడి చేయ వచ్చెరో
తెలంగాణ తమ్ముడా

విష్ణు చక్రం తిప్పి
మనల ఇరుకున పెడుతున్నరో
తెలంగాణ తమ్ముడా
ఇరుకున పెడుతున్నరో
తెలంగాణ తమ్ముడా

తెలంగాణ నేతలారా
చిత్తశుద్ధి మీలోవుంటే
చావోరేవో తెలుసుకోరా
సమరంలో ఉరికిరారా

ఈ గడ్డ మీద పుట్టి వుంటే
సివంగివై దూకి రా...చల్

పదవుల కేలాడకుండా
ఏడికెదురు ఈదరో
తెలంగాణ తమ్ముడా
తెగించి పోరాడితేనే
తెలంగాణ వచ్చురో
తెలంగాణా తమ్ముడా

# ఏమని పాడాలి

– యాదగిరి

తల్లీ నీ వడి నిండ త్యాగాల మూట
పల్లే నీ బతుకంత ఉద్యమాల బాట
గాయాలే గుండె నిండ ఎత్తేను పోరాట జండ
అలుపన్నదే ఎరుగకుండ కదిలేను నా నల్లగొండ ॥ఏమని॥

విప్లవ పోరాటాలకు పేరుగాంచిన కోట
బరిశలందుకోని బరిలో ముందు నిలిసే సూర్యాపేట
మట్టి ముషుల ఎతలను కథలు వ్రాసే వట్టికోట
భీమిరెడ్డి ఐలమ్మలు రగిలించిన పోరుబాట
యుద్ధగీతి సుద్దలా అడుగుల సవ్వడి ఆట
బండెనుక బండి గర్జించే యాదగిరి పాట ॥ఏమని॥

ఉప్పొంగే కెరటమై ఎగిసింది వెలదండ
తల్లి నీ మెడలనిండ మోదుగు పువ్వుల దండ
సిరికొండ ఉర్లుగొండ అదిగో దేవరకొండ
పేరెల్లిన నల్లికొండ బాధలే దాని మదినిండ
గెరిల్లా యుద్ధానికి నిలిసింది అండదండ
శత్రుమూకలను గడగడలాడించేను రాచకొండ ॥ఏమని॥

# ఎర్రెర్రని తెలంగాణ

- చెరబండరాజు

ఇదేనండి ఇదేనండి ఎర్రెర్రని తెలంగాణ
కమ్యూనిస్టు గుండెకాయ కష్టజీవి కలలకోన ॥ఇదే॥

ఆనాడు నైజామును మెడలుబట్టి విరిచినట్టి
కాంగిరేసు సర్కారును గడగడలాడించినట్టి
పీడుతులను నిద్రలేపి యుద్ధానికి నడిపినట్టి ॥ఇదే॥

లక్షలాది ఎకరాలను హస్తగతం చేసుకొని
మూడువేల గ్రామాల్లో ఎర్రజెండ ఎగురవేసి
రైతుకూలి పేదజనం చీమలవలె కదిలొచ్చిన ॥ఇదే॥

బయటపడ్డ పేగులను పై పంచెతొ అదిమికట్టి
పగతురపై పగపట్టి ప్రాణాలను తీసినట్టి
గొట్టెముక్కల గోపాలరెడ్డి జన్మించిన జీవగడ్డ ॥ఇదే॥

చెయ్యం మేం చెయ్యమని చిన్న పెద్ద ఒక్కటయ్యి
సంఘాన్నే నమ్ముకొని దొరల చావగొట్టినట్టి
చాకిరులను విడిచిపెట్టి, కత్తిపట్టి పోరినట్టి ॥ఇదే॥

ఏ యింట్లో ఏ బిడ్డడు ఎందుకొరకు సచ్చెనని
అడగండి ప్రతి పల్లెను ప్రతి చెట్టును ప్రతి గట్టును
ఆత్మకథలు చెప్పునవి దోపిడింక పోలేదని ॥ఇదే॥

నాటి తెలంగాణ నుండి శ్రీకాకుళం గిరిజనుడు
శ్రీకాకుళం పోరు నుండి తెలంగాణ రైతు నేడు
భూమి భుక్తి విముక్తి కొరకు విప్లవించినాడు చూడు ॥ఇదే॥

కొమరన్నకు వారసులు కోరన్నలు మంగన్నలు
మెలుకొనే ఉన్నారు తెలంగాణ పల్లెల్లో
కో అంటే కో అంటరు సై అంటే సై అంటరు ॥ఇదే॥

చల్లబడదు చల్లబడదు తెలంగాణ విప్లవాగ్ని
మళ్ళీ చెలరేగుతుంది ఆగకుండ పోరుతుంది
నక్సల్బరీ అడుగులోన అడుగువేసి నడుస్తుంది
నాటి తెలంగాణ పోరు బాటలోనే నడుస్తుంది ॥ఇదే॥

# ఎంజెయ్యాలె...

– భీమసేన

ఎం జెయ్యాలె ఇంకేమి జెయ్యాలే
ఎం జెయ్యాలె ఇంకేమి జెయ్యాలే
తెలంగాణకోసము తెలంగాణ ప్రజలము
ఏమిజేయ్యాలే ఇంకేమి జేయ్యాలే ॥ఎం॥

తెలంగాణ ప్రాంతము – తెర్లాయితున్నదని
ప్రత్యేక రాష్ట్రముకై – ప్రజాసమితిని బెట్టి
ఊరూరును కదలించి – పోరుదారి నడిపించి
ఎన్నికయిన చెన్నారెడ్డి – ఎదలమీద తన్నిపాయె ॥ఎం॥

సదువు సంధ్యపక్క బెట్టి – సమరానికి జై కొట్టి
ప్రాంతంపై దోపిడిని – ప్రతిమనిషికి తెలియజేసి
అరవైతొమ్మిదిలోన – ఆంధ్రోళ్ళతో కోట్లాడిన
వందలాది రణధీరుల – బొందలె మిగిలిపాయె ॥ఎం॥

పిలుపునిచ్చి సభలువెడితె – కలుపుకొని కదినాం
ఎండవాన వెదిరించి – జెండాబట్టి నడిచినాం
దీక్షాశిబిరాలు పెడితె – దీక్షబూని కూసున్నం
రస్తారోఖోకు దిగినాం – రైలురోఖోలు జెసినాం ॥ఎం॥

ఆంధ్రపార్టీ గద్దెలను – అడ్రసులేకుండాజేసి
గంటే చేతబట్టుకొని – వంటవార్పు జేసినాం
తల్లి తెలంగాణ బొమ్మ – పల్లెపల్లె నిలబెట్టి
అమరుల స్థూపాలు గట్టి – ఆడితిమి ధూంధాం ॥ఎం॥

సీమాంధ్రుల చెరలోన – సింధ్రమైన తెలంగాణ
విద్యార్థి యువకులలో – విప్లవాగ్నిరగిలిస్తే
ఆత్మలు బలిదానమిచ్చి – అయ్యవ్వకు శోకమిచ్చి
చల్లారిన ఉద్యమాన్ని – ఢిల్లీవరకు తాకిస్తిమి ॥ఎం॥

ఓట్లతోని సీట్లతోని – వొస్తదంటే తెలంగాణ
పార్టీలను పక్కనెట్టి – ప్రజలమంతా ఐక్యమయ్యి
ఎన్నిసార్లు నిలబడితె – అన్నిసార్లు గెలిపిస్తిమి
రాష్ట్రమింక రాకపాయె – రాలుతున్న బతుకులాయె ॥ఎం॥

ఉద్యోగులు మేధావులు – రచయితలు కళాకారులు
సబ్బండ జాతులన్ని – సంఘాలు బెట్టుకొని
చిన్న రాష్ట్రాలలోనే – చిన్న కులం ఎదుగునన్న
అంబేద్కర్ దారిలోన – అలాయ్ బలాయ్ జేస్తిమి ॥ఎం జెయ్యాలె॥

కార్మికులు కర్షకులు – కూలినాలి పేదజనులు
లక్ష్యసాధనకొరకు – లక్షలాది సైనికులై
వేరు తెలంగాణ కొరకు – పోరుబాటను బట్టి
JAC లు బెట్టుకొని – జగడాలు జేస్తిమి ॥ఎం జెయ్యాలె॥

స్వార్థంతో ఉద్యమాన్ని – సాగదీస్తు ఉన్నారు
ప్రజల ప్రాణాలతోని – పరాచకం ఆడుతుండ్రు
త్యాగాల ఉద్యమాన్ని – తాకట్టు బెట్టజూస్తే
నడి ఊరిలో పాతరేసి – నడిపిస్తాం పోరాటాన్ని ॥నడి ఊరిలో॥

# ఎంతని సూత్తావురో

- రడం శ్రీను

ఇస్తామన్న కాంగిరేసు - ఆనాడు తెలంగాణ ఇయ్యలేదు
తెస్తామన్న చెన్నారెడ్డి - తెలంగాణ తేనేలేదు ॥తెస్తామన్న॥
ఎంతని సూత్తావురో తెలంగాణ కొమ్రన్న
ఎదిరించి నువ్వు అడగరో తెలంగాణ మల్లన్న ॥ఎంతని॥

ఓట్లు ఓట్లు ఓట్లంటు - ఓట్లకు ముడి పెడతాండ్రు
సీట్ల మీదికెక్కి మన -తెలంగాణ మరిసింద్రు ॥సీట్లమీది॥
ఎంతకాలం ఈ తంతు -తెలంగాణ కొమ్రన్న
ఎన్నేండ్లు ఈ కప్పగెంతు -తెలంగాణ మల్లన్న ॥ఎంతని॥

అమ్మచేతులున్నదని - అయ్య మనసులున్నదని
అధిష్టానం చూస్తాదాని - అన్ని పార్టీల మద్ధతని ॥అధిష్టానం॥
ఓట్ల ముందు చెప్పలేదు - తెలంగాణ కొమ్రన్న
సీట్లల్ల గెలిచి గద్దెనెక్కె -తెలంగాణ మల్లన్న ॥ఎంతని॥

నెత్తురు ఒడపకుండా - తల్లీ పురుడుబోయలేదు
రక్తం చిందించకుండా - రాష్ట్రమొచ్చేటట్టు లేదు ॥రక్తం॥
ప్రజా తెలంగాణకై -తెలంగాణ కొమ్రన్న
ప్రజలను సిద్ధం జేద్దామా -తెలంగాణ మల్లన్న ॥ఎంతని॥

# ఎందాక జూద్దాంరో .......

- గూడ అంజయ్య

ఎందాక జూద్దాంరో - ఎల్లన్నోరె, మల్లన్నోరె
ఇగ ఎగబడదాముర - ఎల్లన్నోరె, మల్లన్నోరె

సేనువాయే సెలకవాయె - ఇల్లువాయె మల్లువాయె
రంగారెడ్డి భూములన్ని - రామోజీరావు సిటీ ఆయె
హైదరాబాద్ కాలనీలు - ఆంధ్రోళ్ళ సొంతమాయె
డప్పువాయే దరువువాయే - సీమాంధ్రుల ఆటవాయె
తెలంగాణ ఎంపీలు - తెలంగాణ ఎమ్మెల్యేలు
మాటవాయే పాటవాయే - తెలంగాణ యాసవాయే
హైటెక్కు పాలన క్రింద - తెలంగాణ నలుగుతుండె

తెలంగాణ పల్లెలల్ల చెరువుకుంటలెండిపాయె
మోటబాయె ఊటబాయె పెద్దబోరు మొద్దుబారె
సుక్కాసినుకుపడకపాయె - గరికపోస మొలువకపాయె
తెలంగాణ ఎండవట్టె - ఆంధ్రేమో పండవట్టె
గడ్డీగాదం లేక గొడ్డుగోద చస్త వుంటె .... ॥ఎందాక॥

ఆజంజాహి మిల్లువాయె - నిజాం సాగర్ కునుకవట్టె
సిరులు పంచె సింగరేణిలో - అంధ్రవాళ్ళ పాలనాయె
రామగుండం కరెంటంత - ఆంధ్రవాళ్ళ ఫ్యాక్టరీలకాయె
తీగలేమో మనకుమిగిలి - కరెంటేమో ఆంధ్రకాయె
లోవోల్టేజితో మనం జస్తె - బిల్లుమీద బిల్లు పెంచె
పెంచిన బిల్లు దించమంటె - పిట్టలోలె కాల్చిచంపె...... ॥ఎందాక॥

అప్పో సప్పో జేసుకొని – అరెకురం పంటదీస్తే
పండేపంట పట్కపోయి – బీట్లోనా అమ్ముకుంటె
అమ్మబోతే అడివాయే – కొనబోతె కొరివాయే..... ॥ఎందాక॥

అసలు గింజలమ్ముకుంటే – ఉప్పుగాసం రాకపాయె
పెద్ద సదువులెన్ని సదివిన – ఉద్యోగం దొరక్కపాయె
తెలంగాణ ఫ్యాక్టరీలల్ల – ఆంధ్రవాళ్ళే నిండిపోయిరి

ప్రభుత్వ ఉద్యోగమంటే – కత్తిమీద సామాయె
అసలు అసలు కొలువులల్ల – ఆంధ్రవాళ్ళ సుట్టాలైరి
తెలంగాణ నిరుద్యోగి – నోట్లె మన్ను గొడ్తుంటె

తిరగబడి పోరాడకుంటె – తెలంగాణ దక్కపోతే
అవ్వతోడు నీ బతుకు – అంగట్లో అవ్వలెక్క
మర్లబడి గుంజుకుంటె ఎల్లన్నోరె, మల్లన్నోరె
తెలంగాణ మనదైతది ఎల్లన్నోరె, మల్లన్నోరె.... ॥ఎందాక॥

# కదిలింది తెలంగాణ

- పయిలం సంతోష్

కదిలింది తెలంగాణ కదనాన కాలుదువ్వి
ఇగ రాష్ట్రమొచ్చేదాక రణరంగ మాగదంటు
కవులంత కలం పట్టే కళాకార్లు గొంతులెత్తే
పల్లె పల్లె తెలంగాణ ధూంధాం ఆట పాటే
కాలిగజ్జె సప్పుడయితె - నా తల్లి తెలంగాణ
కదిలొచ్చె జనం అంత - నా పల్లె తెలంగాణ ॥కదిలింది॥

జర్నలిస్టులంతా జంగూకు సై అంట్రు
మేధావులంత కలసి భుజం కలుపుతంట్రు
కార్మిక కష్టజీవులు - నా తల్లి తెలంగాణ
రైతు కూలీ లేకమయ్యే - నా పల్లె తెలంగాణ ॥కదిలింది॥

తెలంగాణ ఆడబిడ్డ తెగువతో ముందకొచ్చే
కూలినాలి అక్కలంత కండ్లెర్ర జేసి కదిలే
ఇదే అదను తెలంగాణకు - నాతల్లి తెలంగాణ
పదునెక్కి సాగిరండి - నా పల్లె తెలంగాణ ॥కదిలింది॥

విద్యార్థి యువకులంతా ఇగ పిడికిలెత్తినారూ
రాజుకున్న పోరులోనా రగిలింట్రు జ్వాలలయ్యి
తెలంగాణ పోరుదారిలో - నా తల్లి తెలంగాణ
బరిగీసి నిలిచినారు - నా పల్లె తెలంగాణ ॥కదిలింది॥

ఉద్యోగ ఉపాధ్యాయులు హోరెత్తి సాగుతుంట్రు
పోరాట కెరటమయ్యి పరువల్లు తొక్కుతుంట్రు

తెలంగాణ దండులోనా - నా తల్లి తెలంగాణ
తమవంతుగ నిలిచింద్రు - నా పల్లె తెలంగాణ ॥కదిలింది॥

పల్లె పల్లె మేలుకొని జిల్లా జిల్లా రాజుకొని
పది జిల్లాలేకమయ్యి పదునెక్కి సాగుతున్నయి
ప్రత్యేక రాష్ట్ర పోరులో - నా తల్లి తెలంగాణ
ప్రాణాలు ఇస్తమమ్మ - నా పల్లె తెలంగాణ ॥కదిలింది॥

# కదిలిరండి తెలంగాణ భూమి పుత్రులారా

- సుద్దాల అశోక్ తేజ

కదిలిరండి తెలంగాణ భూమి పుత్రులారా
తరలిరండి తెలంగాణ వీరవనితలారా
అమరవీరులాశయాలు నిజం చేయరండి
తెలంగాణ రాష్ట్ర సింహగర్జన చేయండి
ఆదిలాబాద్ నుండి - హైదరాబాదు దాక
ఖమ్మం జిల్లా నుండి - కరీంనగరు దాకా
పల్లె పల్లె వాడవాడ ఆకాశంనిండా
ఎగురవే ఈ గులాబి తెలంగాణ ఎజెండా ॥ఇది తెలంగాణ॥

వీరతెలంగాణ కొరకు, ధీర తెలంగాణ కొరకు
దారులు వేసిన అమరుల గుండె గొంతుకలు చేసి
నీటిలోన నిధులలోన మన వాటా నోచుకోక
తల్లి తెలంగాణ గడ్డ ఒక ఎడారికాకముందె
కరెంటు ధర మోయలేక వ్యవసాయం సెయ్యలేక
బతకలేక పల్లెజనం వలస వెళ్ళిపోకముందే
జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్ మార్గంలో
తెలంగాణ రాష్ట్రం 10 జిల్లాల జన్మహక్కు ॥ఇది తెలంగాణ॥

గతంలో ఉద్యమం ఒకసారి ఓటమి చెందిందని
ఎన్నేళ్ళనీ చేతకాని పీనుగులైపడి ఉందాం
సిపాయిల తిరుగుబాటు విఫలం అయ్యిందనీ
ఊరుకుంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చేదా?
రాజీలేని పోరాటం విజయం సాధిస్తుంది
ముమ్మాటికీ తెలంగాణ రాష్ట్రం వచ్చి తీరుతుంది ॥కదలిరండి॥

# కొమ్మాలల్ల కోయిలమ్మ...

- గిద్దె రామనర్సయ్య

కొమ్మాలల్లో కోయిలమ్మ పాటబాడుతున్నది జై తెలంగాణ అన్నది
అలిసిపోయిన లేడికూన గంతులేస్తనన్నది కాలిగజ్జెగడుతున్నది
ప్రాణంబోయిన మేకాపిల్ల డప్పునైతనన్నది దండోర వేస్తనన్నది
ఇప్పుడుబుట్టిన లేగదూడ దుంకులాడుతున్నది ధూంధాం జేస్తన్నది
॥కొమ్మాలల్లో॥

గోరుకోళ్ళు బొడువంగ కూత బెడుతనన్నది-కోడి నిదుర లేపుతన్నది
పిడికెడంత లేడి పిచ్చుక పోరు జేస్తనన్నది-పోరుబాటనైతనన్నది
చెట్టు చేమలన్ని ఊగి ఊపిరైతనన్నయి-ఉద్యమాలు జేస్తనన్నది
పొడిసేటి పొద్దుగూడ పొద్దుగూకనన్నది-పోరుకు సైయంటున్నది
॥కొమ్మాలల్లో॥

నక్కబావ జిత్తులాతో చిత్తు జేస్తనన్నది-పెద్ద ప్లాను గీస్తనన్నది
తెలంగాణ సమరానికి సాలువ సైయన్నది-అది సవాల్ జేస్తనన్నది
పావురాలు ఏకమయ్యి కబురు దెస్తమన్నయి-కాపాడుకుంటమన్నయి
జీవారాసులొక్కటయ్యి జెండాబట్టుతున్నయి-జేజేలు పలుకుతున్నయి
॥కొమ్మాలల్లో॥

నారుమడిలో నీరునైత వాటాపంచమన్నయి-వాగు వంకాలడుగుతున్నయి
కృష్ణమ్మ గోదారమ్మ కదలివస్తనన్నయి-కన్నీరు వద్దంటున్నయి
చల్లగాలి వీచి పోరుకు ఊపిరైతనన్నది-అది పురుడుబోస్తనన్నది
పండువెన్నెల గాసి పల్లె పల్లెనడుగుతున్నది-తెలంగాణ గావాలన్నది
॥కొమ్మాలల్లో॥

అడవీలున్న ఆకులన్ని అలికిడి జేస్తన్నయి-అలాయ్‌బలాయ్ దీసుకున్నయి
చీమలన్ని జంటబట్టి ర్యాలి దీస్తమన్నయి-మేం రణం జేస్తనన్నయి
చెట్టుకొమ్మలన్ని లేసి బాకులైతమన్నయి-బంధూకులెత్తమన్నయి
వడ్లపిట్ట ముక్కుతోటి గన్ను జేస్తనన్నది-తెలంగాణను దెస్తనన్నది
॥కొమ్మాలల్లో॥

మోదుగుపూలు అమరులాకు దండాలైతనన్నయి-మెడల దండాలేస్తననన్నయి
ఎర్రటి ఆ మందారాలు ఎదలకద్దుకొమ్మని-వీరుల మదిల తలుచుకున్నయి
వాన చినుకు రాలి స్థూపం కడిగివేస్తనన్నది-అది కండ్లాకద్దుకున్నది
అమరుల త్యాగాల మొలక చిగురు వేస్తనన్నది-తెలంగాణ జూస్తనన్నది
॥కొమ్మాలల్లో॥

# గణగణగణగణ తెలంగాణ

- అంబటి వెంకన్న

గనగనగన తెలంగాణ గర్జనలే జేద్దాము
జనజనజన తెలంగాణ జంగు సైరనూదుదాము
సత్యాగ్రహ సాయుధులై శాంతి యుద్ధమందాము
అరవయేండ్ల బానిస సంకెళ్ళు దెంచి వేద్దాము
కదులుదాము తెలంగాణ వీరపుత్రులారా ॥గనగన॥

అరవైలో ఒరిగిపోయిన వీరుల కథ విన్నాము
అలుపెరుగని పోరాటం జేస్తూనే ఉన్నాము
రెండువేల తొమ్మిదిలో త్యాగాలను జూసినాము
రెండుగ విడిపోయి బతికె బాటనె బయలెల్లుదము
తెలంగాణ తొలిపొద్దు పొడిచేడు బోదాము
తెగువ నింపుకొని పోరులో తెగబడి కొట్లాడుదాము
కదులుదాము తెలంగాణ వీరపుత్రులారా ॥గనగన॥

కడుపురగిలి కదిలొచ్చిన ఖమ్మంమెట్టు బోదాము
ఖణఖణ మండే గుండెల ఆశయాలమవుదాము
కసితో అడుగేసి కదిలె కరీంనగరు బోదాము
కన్నరుణము దీర్చుకున్న వాళ్ళ కాల్లు గడుగుదాము
ప్రాణాలకు తెగించిన మెదకు జిల్ల బోదాము
పాలకుల మెడలొంచిన వాళ్ళ ప్రతిన బూనుదాము
కదులుదాము తెలంగాణ వీరపుత్రులారా ॥గనగన॥

విప్లవాలు విరబూసిన నల్లగొండ బోదము
వీరుల పాదాలు గడిగి నేల రుణము దీర్చుదాము
ఉద్యమాల సెలయేరు పాలమూరు బోదాము
ఊపిరిచ్చి మూగబోయిన గొంతును ముద్దాడుదాము
ఆత్మగల్ల ముద్దుబిడ్డ అదిలబాదు బోదాము
అమరులార మీ త్యాగం వృధాకాదనందాము
కదులుదాము తెలంగాణ వీరపుత్రులారా ॥గనగన॥

ఒడుపుతోని అడుగేసే ఓరుగల్లు బోదాము
వందనాలు మీకంటు చేతులు జోడిద్దాము
నిప్పురవ్వలోలె రగిలె నిజాంబాదు బోదాము
రాజుకున్న రంగారెడ్డి హైద్రాబాదు జేరుదాము
ఆంధ్ర వలస పాలనకు ఎదురు నిలిసి పోరుదాము
సమైక్యాంధ్ర నినాదాన్ని సంపి బొంద బెడదాము
కదులుదాము తెలంగాణ వీరపుత్రులారా ॥గనగన॥

# గూడు నిడిసినం

- గుండమల్ల శ్రీనివాస్

గూడు నిడిసినం మా గుడిసే నిడిసినం
పల్లె నిడిసినం కన్నా తల్లీ నిడిసినం
పాలమురు లేబారంటె ప్రపంచానికే ఎరుక
పల్గుపార పట్టినాము పస్తులతోటి సస్తున్నాము
ఫ్లైవోవరు బ్రిడ్జిలాను పసందుగ గట్టినాము
హైటెక్కు సిటినంత అద్దమోలె దిద్దినాము
అన్నీ దిక్కుల నేనేవున్న కాని దిక్కులేని వాన్ని అయిన ॥గూ॥

ముంబాయి నగరములోన బి.ఎస్.సి.ఎస్. నడిపినాము
కుత్కెల దాకమట్టి దొవ్వి కేబులు గుంతలు దీసినాము
కరెంటు షాకుగొట్టి సచ్చినోల్ల లెక్కేలేదు
కాలీపోయిన శవానికీ కర్మాకాండ జేసే దెవరు
మున్సిపాల్టి బండివచ్చి నీముద్దూ మొకం బూడిదజేసె ॥గూ॥

నూకల బువ్వ కారం ముద్ద జొన్న రొట్టె నంజుకోని
తెల్లా వారెటెల్లక ముందె ఆదర బాదర వురుకుతాము
రూపుల గంపలు మోసేటపుడు కంకర మిల్లు ఆగినపుడు
కాలే కడుపు నింపానీకీ కారం మెతుకులు కరువైపాయె
ఆదర బాదర తిండీమాది ఆగమయిన బ్రతుకుమాది ॥గూ॥

వూరులేదు పేరులేదు వున్నచోటు గ్యారంటీ లేదు
రైయ్యినురికే రైలుపట్ట నట్టు గట్టిగ దిప్పినాము
డ్యాములు మేడలు గట్టినాము డాంబర్రోడ్లు వేశాము

కంపెనీలు నడిసేకాడ బాయిలర్ షెడ్డు వున్నాకాడ
బొగ్గానయ్యి కాలుతున్న బూడిదయ్యి రాలుతున్న ॥గూ॥

రాజ్యాలెన్నో కూలినగాని రాజూలెందరో మారినగాని
రజాకార్లు పోయినగాని రాతాలేమి మారాలేదు
కన్నీళ్లకు కారణమైన ఆంధ్రామంత్రుల ఆటలు కట్ట
ఉద్యామాల పురిటిగడ్డ తెలంగాణ పోరుగడ్డ
తెగించి పోరాడాలన్న తెలంగాణ తెద్దామన్న ॥గూ॥

# గోదారమ్మ

- కొమెరె వెంకన్న

అమ్మా చూడమ్మ బయలెల్లినాదో - గోదారమ్మ
గంగమ్మ తల్లి బయలెల్లినాదో - గోదారమ్మ ||అమ్మా||

అదిగదిగో అటుచూడు బయలెల్లినాదో
అలలల్లె అందెల్ల చప్పుల్లతోటి
గలగల గజ్జెల్ల మోతల్లతోటి
ఆదిలాబాద్‌కొచ్చి అడుగేసినాదో
పరుగుపరుగున వచ్చి పల్లెల్నితాకి - గోదారమ్మ
తెలంగాణను జూసి తల్లడిల్లిందో - గోదారమ్మ ||అమ్మా||

చిటపట చినుకుకు సెలయేరుఅయ్యి
జలజల జల్లుకు జలపాతమైయ్యి
ఆ పల్లె ఈ పల్లె మా పల్లె రేపల్లే
పల్లెపల్లెలన్ని కండ్లార జుసింది
పల్లెల్లో మొలిసిన పల్లేర్లు జూసి - గోదారమ్మ
ఎడారి ఈ బతుకెవ్వలు కారణమంది - గోదారమ్మ ||అమ్మా||

ఏమి చెయ్యలేక ఏడ్వసాగింది
ఎక్కిఎక్కి తల్లీ ఏడ్వసాగింది
ఎనకకు మల్లొక్కసారి జూసింది
మళ్ళి జన్మ ఉంటే తిరిగొస్తన్నది
తెలంగాణకు నేను తల్లైతనంది - గోదారమ్మ
తనివితీరా నేల తడిపేస్తనన్నది - గోదారమ్మ ||అమ్మా||

ఆదిలాబాద్ జిల్లా అగ్గైయ్యి లేసి
కరీమనగర్ జిల్లా కత్తైయ్యి మెరిసి
ఖమ్మం, వరంగల్లు కట్టుగ నడిసి
నల్లగొండను పోరుజెండెత్తమంది
తెలంగాణ ప్రజల తెగువ జూపమంది - గోదారమ్మ
హోరు కెరటాలై పోరు జెయ్యమంది - గోదారమ్మ ॥అమ్మా॥

# గోదారి గోదారి

- యశ్‌పాల్

గోదారి గోదారి ఓహో పారేటి గోదారి
సుట్టు నీళ్ళు ఉన్న సుక్కా దొరకని
ఎడారి ఈ భూమి
మాది తెలంగాణ భూమి ॥గోదారి॥

బాయంత తీసిన నీళ్ళు బుక్కెడు బడవయ్యో
బండా మీద బాయి తీసినట్లుండే
బతుకిట్లా తెల్లారె - మా బాదెట్ల తీరునో ॥గోదారి॥

భూములున్నాయమ్మో దున్నె సత్తువ వున్నాదమ్మా
సాగునీరు లేక సట్టు బండలయి
బీడు బడ్డాయమ్మా - భూములు పాడుబడ్డాయమ్మా ॥గోదారి॥

కల్వకుర్తి నెట్టెంపాడు భీమ రామడుగు గండ్ల వాగు
సాత్నాల వట్టివాగు శ్రీశైలమెడమ
చెలమల ఏమాయె - జూరాల జలాలు ఎటుబాయే ॥గోదారి॥

శ్రీరామ సాగరము వరద కాలువలేమాయె
స్వర్ణ కోటిపల్లీ సరళ ఉసెట్టెవాగు - ఎత్తిపోతలేమాయె
అవి ఉత్త మాటలయినాయా ॥గోదారి॥

ఏండ్లాకేండ్లా నించి అరె ఏలేటి వాళ్ళంత
నీళ్ళా పేరు చెప్పి ఓటుల వేసుకొని

మోసం చేస్తా వుంద్రు
మనల మాయా చేస్తా వుంద్రు ॥గోదారి॥

గోదారికి నీళ్ళకు కలిసి పోరు చేద్దాము
సావైన బతుకైన పోరాట దారిలో
సవాల్ చేద్దాము
నీళ్ళను సాధించుకుందాము ॥గోదారి॥

# ఛలో ధూం-ధాం

– మిత్ర

ఛలో ధూం ... ధాం ... ఛలో ధూం ... ధాం ...
ఛలో ధూం ... ధాం ... తెలంగాణ జాతరొచ్చెరా
మత్తడి దుంకి అలుగు తన్నుకుని పారినట్లు
మెత్తటి గుండెలు సైతం నగారై మోగినట్లు
నెత్తిన బోనమెత్తి శివసత్తులు దుంకినట్లు ॥ఛలో॥

నాటి మున్నూట పానాల మునుమే ఇదిరా
అది ఎగిలివారే పొద్దు ఎరుపేగదరా
సుడిగాలై కరీంనగర్ సుట్టూకొస్తే
రంగూ – రంగులా జెండలన్ని ఎలిసిపాయెరా ॥ఛలో॥

అభివృద్ధి కొంగజపం బైరంగంరా
జలవనరుల తెలంగాణ మనదేగదరా
సవాలన్న రారాజుల గోసులూడగా
మన రోషం జనహోరై జైకొట్టెరా ॥ఛలో॥

కూలిన మన సెరువులకు పానాలొచ్చురా
ఎండిన మన వాగులకు పరుగులొచ్చురా
తల జుట్టేసి మక్కల కంకులూరగా
వలసెల్లిన పచ్చులు తమ గూడు జేరగా ॥ఛలో॥

మబ్బులు తొలిగి సెంద్రుడు నేలను జూసే
నీటి కలువలేమొ రంగులతో సింగిడి వేసే

పల్లె సద్దుల నాడు సిబ్బిలో పువ్వులు పేర్చా
దసరా పండుగ జేసి పాల పిట్టను జూడా ॥ఛలో॥

భావాలకు జీవోలకు కాళ్ళేరాంగా
విశాలాంధ్ర వాదాలకు సావేరాంగా
రెండో ఎస్సార్సీ సన్నాయి నొక్కులపైనా
మన రాష్ట్రం మనదన్న హక్కులనే చాటగా ॥ఛలో॥

నీళ్ళు దోసేటి నీచులతో పందెంగాద్దాం
భూకబ్జాదారులకెదురు లడాయి జేద్దాం
కోతబెట్టే కరెంటు పంట లెండబెడ్తే
ఇండ్లు గూల్చి పేదోళ్ళను తరిమీ కొడితే ॥ఛలో॥

కాముడు సుట్టూ సేతిలో సెయ్యేసి దుంకుదాం
జాజిరకోలలే జంట తాళాలై ఆడుదాం
ఢిల్లీకి మనడోలు దెబ్బ ఉరుములుగా వినిపిద్దాం
డప్పుగొట్టి తెలంగాణ సాటింపు జేసెద్దాం ॥ఛలో॥

ఉడుకు నెత్తుర్లతో ఈ నేల తడ్వొద్దురా
దోపిడీకి, ద్రోహులకు తావొద్దురా
ఎములాడ రాజన్న పబ్బతి పడదామురా
ఎగిరెగిరి తెలంగాణ ఉట్టేగొడ్తామురా ॥ఛలో॥

# జనహోరు

– జయం (పికెఎమ్)

వీర తెలంగాణ నా పోరు తెలంగాణ
ఇక ఆగనంది సూడూ
జన హోరు కదిలే నెడూ ॥వీర॥

రజాకార్లనే తరిమి
నైజాంనెదిరించినా
వీర గడ్డ తెలంగాణరా..... ॥వీర॥

అరే దొరల, దేశ్‌ముఖ్, పటేళ్ళ
జాగీర్‌దార్ల తరిమిన
ఇది పోరు తెలంగాణరా
మా తల్లి తెలంగాణరా ॥మా2॥ ॥వీర॥

భూమి తల్లి విముక్తికై
సాయుధ పోరునే నడిపి
-నెహ్రు సైన్యాల వంచినా..... ॥నె॥
అరే భూస్వాముల కెదురొడ్డి
ప్రాణాలర్పించినా
దొడ్డి కొంరయ్య రా
షేక్ బందగి, ఐలయ్య రా ॥షేక్2। ॥వీర॥

తెలంగాణ సాధనకై
వందాలాది విధ్యార్థుల
-నెత్తురు చిందిన నేలాయిదీ..... ॥నె॥

అరే విధ్యార్ధుల నెత్తురుతో
తడిసినా మట్టిపెళ్ళారా
మొలక లెత్తి నారురా
మును ముందే కదులుతుంఁడురా ॥ము 2॥ ॥వీర॥

గోదావరి కృష్ణమ్మలు
నదులెన్నో పారీనా
-నీళ్ళు లేక భూములెండేరా...॥నీ॥
మా నీళ్ళు దొచి నధులు దొచి
కోట్లకు పడగెత్తిరి
మా రాజ్యమేల బడితిరి ॥మా 2॥ ॥వీర॥

పూట పూట పస్తులుండే
పెద్ద చదువు లెన్నో చదివి
-ఎండ్లా కెండ్లె గడిచి పోయెనా ... ॥ఏ॥
ఏ కొలువు లేక అడ్డమీది
కూలీగ మమ్ము జేస్తిరి
మీరు కలెక్టర్లై ఐయ్యితిరి ॥మీ 2॥ ॥వీర॥

పెద్ద మనుషులొప్పందం
ఫజల్ అలీ కమిషన్ల
-కాటికె మీరు పంపాలెదా.... ॥కా॥

నేడు శ్రీ క్రిష్ణ కమిటి పేర
ఎన్నో ఎత్తులెసిన
మేము తిప్పిగొడుతామురా
ఈడ తీరుగనీయ్య బోమురా ॥ఈ 2॥ ॥వీర॥

# జయ జయహే తెలంగాణ

- అందెశ్రీ

జయ జయహే తెలంగాణ
జననీ జయ కేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పది జిల్లాల నీపిల్లల ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ! జైజై తెలంగాణ!! ॥జయ జయహే॥

పోతనదీ పురిటి గడ్డ - రుద్రమదీ వీరగడ్డ
గండర గండడు కొమురం భీముడే నీబిడ్డ
కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప
గోల్కొండ నవాబుల గొప్ప వెలుగె చార్మినార్
జై తెలంగాణ! జైజై తెలంగాణ!! ॥జయ జయహే॥

జానపద జనజీవన జావళీలు జాలువార
కవిగాయక వైతాళిక కళలా మంజీరాలు
జాతిని జాగృత పరిచే గీతాల జనజాతర
జై తెలంగాణ! జైజై తెలంగాణ!! ॥జయ జయహే॥

సిరి వెలుగులు విరజిమ్మే సింగరేణి బంగారం
అణువణువున ఖనిజాలె నీ తనువుకు సింగారం
సహజమైన వన సంపద సక్కనైన పువ్వుల పొద
సిరులు పండె సారమున్న మాగాణమె కదనీయెద
జై తెలంగాణ! జైజై తెలంగాణ!! ॥జయ జయహే॥

గోదావరి కృష్ణమ్మలు మన బీళ్ళకు మళ్ళాలే
పచ్చని మాగాణాల్లో పసిడి సిరులు పండాలే
సుఖ శాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలే
స్వరాష్ట్రమై తెలంగాణ స్వర్ణయుగం కావాలే
జై తెలంగాణ! జైజై తెలంగాణ!! ॥జయ జయహే॥

# జమిడికె నాదం

- సి. కాశీం

గాయపడ్డ నా తెలంగాణ పాట వింటారా
బక్కచిక్కిన నెత్తుటి బతుకుల బాధలు వింటారా ॥గాయ॥

సమ్మక్క సారక్క ఎత్తిన కత్తి నెత్తుటి తిలకమూ
ఒరిగిన వీరుల జ్ఞాపకము
కొమురం భీంకు పురుడు బోసిన నల్లమద్దిమాను
అది జువ్విచెట్టు కొమ్మ
చెట్టుపుట్ట తిరిగి మనిషి మనిషిని కలిసి పోరు మాట చెప్పి
పోరు బాటలోన నిలిపి
పచ్చని ఆ అడవులల్లో పాలపిట్టకు
పోరు పాటాలు నేర్పిన ॥గాయ॥

సర్వాయి పాపన్న స్వారీ చేసిన గుర్రము పరుగులు
పల్లె పోరుకు గుర్తులు
పండుగోల్ల సాయన్నా పలికిన పల్లె మాటలు
పచ్చని పందిరి ముగ్గులు
ఏకునాదం మోత జమిడికె నాదంలా రేల పాటలయ్యి
చెట్లకు రాగాలు పూయించి
వాగులో నీటి చెలిమెలా ఊరే పల్లె పాటకు
ప్రాణమిచ్చిన వీరులు ॥గాయ॥

పంట కంకిపై వాలిన దొరగాడి గల్లాబట్టింది
ఐలమ్మ లొల్లీ చేసింది

విసునూరు దొరలను వీరంగమాడిన దొడ్డి కొమురయ్య
పల్లెలో పాటలయ్యిండు
వెన్నెల రాత్రుల్లో జానకోపులల్లో పల్లాయయ్యింద్రు
వేగుచుక్కయి వెలిగింద్రు
పుట్టినా ప్రతి బిడ్డకు వాళ్ళు ఉగ్గుపాలతో
పోరు నూరిపోసింద్రు ॥గాయ॥

మట్టి మనిషిని నేను భూమినొదలనని లడాయి చేసిండు
బందగీ ప్రాణమిచ్చిండు
బట్టలు లేకుండా బతుకమ్మనాడిస్తే పల్లే ఏడ్చింది
పల్లు పటపటా కొరికింది
వేపచెట్టు మీద కాకి గూటిలోన కళ్ళు తెరిచిన కోయిలా
పాటకు పదును పెట్టింది
కారిన కన్నీటిని వాళ్ళు కత్తులు చేసి
కానుకనిచ్చిరి ॥గాయ॥

నాగలి పట్టిన రైతు చేతులే గుత్పలుపట్టినవి
నైజాం గుండెను చీల్చినవి
ఖాసీం రజ్వీ కండ్లలో వాళ్ళు కారం చల్లారు
వడిసేల రాళ్ళు కొట్టారు
మల్లెపువ్వు వంటి తెలంగాణ పల్లె మాడిపోవద్దని
బతుకును బాటగా చేసి
పూసినా ప్రతి పువ్వుకు కూడా పోరు పాట నేర్పి
ఒరిగి పోయింద్రు ॥గాయ॥

ఏగుజాము పొద్దు ఎరువు బండిలోన పాట గిట్టిందీ
బండి యాదగిరి గుండే
పరిగె గింజకు పాలబుగ్గలకు పాటను ఇచ్చిండు
సుద్దాల సోపతి కల్పిండు
పోరు పాట విలువ అంతింత కాదని లోకమంత తెల్పి
పాటకు పబ్బతి పట్టించి
ఎత్తిన ముల్లుగర్రా పాట శత్రు ఘోరీ కట్టి
సెలవు తీసుకుంది ॥గాయ॥

పోరు చేసినా మట్టి చరిత్రకు మసీ పూసింద్రు
వాళ్ళు మోసం చేసింద్రు
మోసం చేసిన పొట్టి శ్రీరాములు మొనగాడయ్యిండు
అమరజీవిగా మారిండు
ఆంధ్రకేసరీలు, ఆంధ్ర రత్నాలు అందరు మీవాళ్లె
మాకు వీరులు లేరంటా
పుస్తకం ప్రతి పేజీ నిండా పొరు చరితపై
మట్టి కప్పినారు ॥గాయ॥

తెలుగు రాదని తెలివి లేదని ఎక్కిరించారు
మమ్ముల ఎడ్డోలన్నారు
ఆంధ్ర భాషనే అచ్చమైనదని రాతలు రాసింద్రు
వాళ్ళు రంకే లేసింద్రు
పోతన పలికిన బందిఖాన గొంతు ఏ భాషలున్నాది

నన్నయ ఆది కవెట్లాయే?
తేనెలూరే తెలంగాణ యాసకు విషంపెట్టి
గొంతు పిసికేసింద్రు ॥గాయ॥

తమిళం మాట్లాడే తమ్ముళ్ళంతా ఒక్కటన్నారు
తమిళనాడు అయ్యారు
కన్నడం మాట్లాడే దోస్తులంతా కలిసీ ఉన్నారు
కర్నాటకయ్యారు
భాష పేరిట వాళ్ళు బంధం కట్టి ఏకమయ్యారు
ఎంతో మంచిగున్నారు
తేటని తెలుగు భాష పోయి ఆంధ్ర ప్రదేశాని
పేరెట్ల వచ్చింది ॥గాయ॥

రాళ్ళు రప్పలు ఎత్తి ట్యాంక్ బండ్‌ను కట్టినోళ్ళము
చెమట చిందినోళ్ళము
కట్టపైన మీ బొమ్మలు పెట్టి మురుస్తున్నారు
సంకలెగరేస్తున్నారు
జైలు గోడలపై గేయాలనల్లిన దాశరథి ఏడి
సుద్దాల హన్మంతు లేడాయే
ఆంధ్రా ఆ పెద్దాలంత ట్యాంక్ బండ్‌పై
నిలబడ్డారు ॥గాయ॥

అద్దమరాతిరి నిదుర పొద్దున రోడ్ల ఊడుస్తము
పొద్దుకు అద్దము చేస్తాము

సంజీవయ్య మొదలు వెంగళరావు వరకు పేర్లు మీ వుంటే
ఫుట్‌పాత్‌న మేముంటాం
గడ్డి గాదం పీకి ఇందిరా పార్కును అందంగా చేసిస్తే
మాకు అక్కరకేమొచ్చే
చల్లనీ పార్కులమ్మా ఒడిలో సేదతీరేది
మీబోటి వాళ్ళే ॥గాయ॥

బంతి పూలతోట, గునుగుపూలవనం, పుంటికూరుంటాది
మీరు గోంగూరంటారు
పాల సముద్రాన్ని కవ్వంతోన చిలికి సల్లా చేస్తాము
మీరు మజ్జిగలంటారు
పాలజొన్న కంకి పచ్చ జొన్న రొట్టె రుచి ఎంత కమ్మనా
దానికి అట్టూ సరితూగునా?
పెంకూ మీద మాడ్చిన కారం సాంబార్ పొడి కలిసి
సప్పబడ్డాది ॥గాయ॥

యాభైఏండ్ల నుంచి కలిసి ఉంటే మాకు ఒరిగిందేముంది
మీకు లాభం వచ్చింది
ప్రత్యేక రాష్ట్రం పోరాటంలో ఎందరో ఒరిగారు
గుండెలో కలుక్కుమన్నారు
తెలంగాణ రాష్ట్రం మాకు కావాలని పల్లెలన్నీ అడిగే
పశుల పోరగాళ్ళు కదిలే
పచ్చాని మా తెలంగాణలో పాట పాడుకొని
ఆటలాడుతాం ॥పాట॥

# జిల్లేడమ్మ జిట్టా

- గోరటి వెంకన్న

పరుగు పరుగునొచ్చినారు పట్నములో వాలినారు ॥2॥
వలసొచ్చిందే మరిచి వతందారులయ్యినారు ॥2॥

బర్రె జెనిగోలె వచ్చి జిల్లేడమ్మ జిట్టా
మన బతుకాగం జెయ్యబట్టె జిల్లేడమ్మ జిట్టా ॥2॥

యాడనించి వచ్చినారో ఈడ పీఠమేసినారు ॥2॥
గుమ్మాలకు బొమ్మవోలె గుడ్లు ఎల్లబెట్టుకుంటు ॥2॥ ॥జిల్లేడమ్మ॥

ఏ ఆఫీసుమెట్టెక్కిన జిల్లేడమ్మ జిట్టా
వాళ్ళు ఎదురుంగనె కూసుంటరు జిల్లేడమ్మ జిట్టా ॥2॥
జిల్లేడమ్మ జిట్టా జిల్ జిల్లేడమ్మ జిట్టా
జిల్ జిల్లేడమ్మ జిట్టా జిల్ జిల్లేడమ్మ జిట్టా ॥జిల్లేడమ్మ॥

నిధులు దోసి నీళ్ళు మలిపి నిండుగ మనలను ముంచె ॥2॥
త్యాగమేదో జేసినట్టు తెగపోజులు గొడుతున్నరు ॥2॥

దోసిల బట్టొచ్చినోళ్ళు జిల్లేడమ్మ జిట్టా
మనల దోసుక తినబట్టిరమ్మ జిల్లేడమ్మ జిట్టా ॥2॥ ॥జిల్లేడమ్మ॥
చిందులాడె చీరలమ్మా చందనా బ్రదర్స్‌లమ్మా
చూపులతో గాలమేసె దాపుల ఆంధ్రోళ్ళ జూడు
జూలురు బజారంతా జిల్లేడమ్మ జిట్టా
వాళ్ళు జిల్ల పురుగులై బలిసిరి జిల్లేడమ్మ జిట్టా ॥2॥ ॥జిల్లేడమ్మ॥

పట్నమంత కార్పోరేట్ కాలేజీలు తెరిసేసి ॥2॥
సదువును సరుకుగ జేసి సంపద పెంచుకున్నరు ॥2॥

ఫీజుల భారాలు పెంచి జిల్లేడమ్మ జిట్టా
వాళ్ళు మన పిల్లల ముంచేసిరమ్మ జిల్లేడమ్మ జిట్టా ॥2॥ ॥జిల్లేడమ్మ॥

ఉప్పులేక వచ్చినోని బాధలు వేరుంటాయి
మోసంతో వచ్చినోని మోక తీరె వేరుంటది
ఎన్ని బాధలున్నా జిల్లేడమ్మ జిట్టా ॥2॥ ॥2॥ జిట్టా

వాని ఎనుగు తొక్కినామ మనము జిల్లేడమ్మ జిట్టా ॥2॥ ॥జిల్లేడమ్మ॥

కేంద్రపాలిత ప్రాంతం హైద్రాబాదు జెయ్యమని
గండమేదో వచ్చినట్లు గాబరయ్యిపోతుండ్రు
హైద్రాబాదు నగరానికి జిల్లేడమ్మ జిట్టా
వీళ్ళయ్య సొమ్ము దెచ్చినార జిలేడమ్మ జిట్టా ॥2॥ ॥జిల్లేడమ్మ॥
ఏరుబడెతె నష్టమేంది జిల్లేడమ్మ జిట్టా
వీళ్ళ నెళ్ళగొడుతలేముగదా జిల్లేడమ్మ జిట్టా ॥2॥ ॥ఏరుబడితె॥

# జై జై తెలంగాణ

- యశ్‌పాల్

జై జై బోలో తెలంగాణ
జైబోలో తెలంగాణ
జైత్ర యాత్ర నడుపుతున్న
జై తెలంగాణ బోలో

జైజై బోలో ... బోలో జైజై బోలో
జైజై బోలో ... బోలో జైజై బోలో
వందనం వీరులకొందనం .....
వందనం ధీరులకొందనం ..... ॥జై॥

పంటనెత్తు కెలుతుంటే
కంట నీరు వద్దనీ
ఓరుగల్లు కోటకే
పోరు పాఠం నేర్పమనీ

కత్తులకు పదును పెట్టి
కదన రంగ మందు దూకే
ఓ .... సమ్మక్క సారలమ్మ
రణ భూమికి వందనం
వందనం వీరులకొందనం ...
వందనం ధీరులకొందనం ... ॥జై॥

పరపీడన బంధనాల
తెగనరక తెగువు జూపి

కణ కణ నిప్పుల మండిన
రాణి రుద్రమ దేవి

ఈ మట్టిలోనే దాగున్నది
త్యాగాల చిరునామా
గుండ్లకు గుండెను జూపిన
తుర్రేబాజ్ఖాన్ దాద కొందనం ....
వందనం వీరులకొందనం ...

# జై బోలో తెలంగాణ

- అందెశ్రీ

జనజాతరలో మన గీతం
జయకేతనమై ఎగరాలి
జంఝూ మారుత జన నినాదమై
జే గంటలు మోగించాలి

ఒకటే జననం ఓహో ..!
ఒకటే మరణం ఆహో ..!
జీవితమంతా ఓహో ..!
జనమే మననం ఆహో ..!

కష్టాల్ నష్టాలెన్నెదురైనా
కార్యదీక్షలో తెలంగాణ

జై! బోలో తెలంగాణ
గళగర్జనల జడివాన
జై! బోలో తెలంగాణ
నిలువెల్ల గాయాల వీణా ॥జన జాతరలో॥

దేశముఖులను దొర భూస్వాముల
గడీల నుండి ఉరికించాం
రజాకారులను తరిమికొట్టి
నైజాముకే గోరికట్టేశాం

రోషం గుండెల ఓహో ...!
రోకలి బండలు ఆహో ..!
బిగిసిన పిడికిళ్ళు ఓహో..!
వడిశెల రాళ్ళు ఆహో ...!

వేలకు వేల బలిదానాల
వీరులు చూపిన దారుల్లో
జైబోలో తెలంగాణ
గళగర్జనల జడివాన
జై! బోలో తెలంగాణ
నిలువెల్ల గాయాల వీణా ॥జన జాతరలో॥

ఆత్మగల్ల మా తెలంగాణకు
అరవై తొమ్మిది గ్రహణం
మూడువందల అరవై తొమ్మిది
విద్యార్థుల బలిదానం

వంచన వచ్చి ఓహో ...!
పంచన జేరితే ఆహో ...!
సమరాంగణంలో ఓహో ..!
సైంధవులుంటరు ఆహో ...!

మోసాలను పసిగడుతూ అమరుల
త్యాగాలను నిలబెట్టే దిశల

జై! బోలో తెలంగాణ
గళగర్జనల జడివాన
జై! బోలో తెలంగాణ
నిలువెల్ల గాయాల వీణా ॥జన జాతరలో॥

తెలంగాణకై విద్యార్థులే
మా ఉద్యమాల తొలి పొద్దులురా ..!
ఖాకి జులుం కత్తుల వంతెన
మీద కవాతే చేసిరిరా ....!

ఒడిసిన రక్తం ఓహో ...!
తడిసిన నేల ఆహో ..!
ప్రతినలు బూనిరి ఓహో ..!
ప్రాణాలొడ్డిరి ఆహో ...!

నిర్బంధాలు ఎన్నెదురైనా
నిలబడి కలబడి నిగ్గుదేల్చ
జై! బోలో తెలంగాణ
గళగర్జనల జడివాన
జై! బోలో తెలంగాణ
నిలువెల్ల గాయాల వీణా ॥జన జాతరలో॥

గుప్పిట బట్టి నలిపేస్తాం
నెత్తురు చిందె దారుల్లోన
విత్తనాలమై మొలకేస్తాం

లాఠీలిరిగిన ఓహో ...!
లడాయి మానం ఆహో ..!
పిడుగులు పడ్డా ఓహో ...!
మడమలు తిప్పం ఆహో ...!

సమాజ హితమై సాగే పోరులో
చావో రేవో సాగుదాము

జై! బోలో తెలంగాణ
గళగర్జనల జడివాన
జై! బోలో తెలంగాణ
నిలువెల్ల గాయాల వీణా ॥జన జాతరలో॥

# జై తెలంగాణ

- లోకేందర్

తెలంగాణ తెలంగాణ
జయ జయహో తెలంగాణ !
అక్రమంగా వలసొచ్చి
మా సంపద కొల్లగొట్టె
స్వార్ధపరుల గుండెల్లో
దండోర మ్రోగిస్తాం!
తెలంగాణా సాధిస్తాం !.....2 ॥తెలంగాణ॥

తెలంగాణ పల్లె సీమ
రక్షక భట వర్గంతో
అడుగడుగున నిండిందీ
మా బలం అణగదొక్కే
అధికారుల పని పడతాం!
మా రక్తం చిందిస్తాం !
తెలంగాణ సాధిస్తాం !.....2 ॥తెలంగాణ॥

పాలమూరు పలుగు పార
ఎక్కుపెట్టి కదులుతోంది
అక్రమాల కూలగొట్ట
కదం తొక్కి కదులుతోంది!....2 ॥తెలంగాణ॥

ఓరుగల్లు రుద్రమాంబ
కరవాలం చేతబట్టి

దగాకోరు తల తెంచంగ
రగులుతున్న దదిగో ! ....2 ॥తెలంగాణ॥

నల్లగొండ సూరీడు
చురకత్తిని చేతబట్టి
స్వార్ధపరుల తలలు నరక
ఉరిమురిమి చూస్తున్నడు !!.....2 ॥తెలంగాణ॥

ఇందూరు రైతన్న
పొలం పట్టి, రంకె వేసి
భుగభుగమని భగభగమని
మండుతున్నడల్లదిగో !..........2 ॥తెలంగాణ॥

ఇక సాగదు చాణక్యం
ఇక ఆగదు చైతన్యం
అడుగడుగున ఎదిరించెను
అరుణారుణ మందారం!
ప్రాణాలే అర్పిస్తాం!
తెలంగాణ సాధిస్తాం!..........2 ॥తెలంగాణ॥

# జైత్రయాత్ర

- జూలూరు గౌరీశంకర్

పదండి జైత్రయాత్ర - కదిలింది జైత్రయాత్ర
జైకొట్టి తెలంగాణ - సాగిందీ దండయాత్ర
నిలువెత్తు తెలంగాణ - నిలబెట్టు తెలంగాణ
తెగించి తెలంగాణ - దూకింది ధూంధామై.... ||పదండి||

రగిలి రగిలి పొగులుతున్న - కనలికనలి సాగుతున్న
పగులుతున్న, పెగులుతున్న, ఉరుముతున్న
పల్లె పల్లె పాకె పోరై - పదపదము కడలి హోరై
ఇది తెలంగాణ గోస - జనమందుకున్న శ్వాస.... ||పదండి||

ఇది పగ కాదు, ఒట్టి సెగ కాదు
ఇది కల కాదు, ఒట్టి భ్రమ కాదు
నిలబెట్టి, పొగబెట్టి, తొడగొట్టి, సిగపట్టి
ఆఖరి మోకిదె - ఉగ్రులై లేవరా..... ||పదండి||

జమిందారు, జాగీర్దారు, దేశముఖుల తరిమినోళ్ళు
రజాకారు గుండాలను - మట్టి కరిపించినోళ్ళు
మాట తప్పని వాళ్ళం - నిప్పులు చెరిగేటోళ్ళం.... ||పదండి||

సమ్మక్కను తలిచినాము - సారక్కను కొలిచినాము
బందగిని మదిలో నిలిపి - కొమురయ్యకు సలాం చెప్పి
సర్వాయిపాపడు - వీరుడు కొమురం బీము
బైరాన్‌పల్లి అమరుల స్ఫూర్తితోని సాగుతుంది.... ||పదండి||

# జైకొట్టి తెలంగాణ పాట

- పసునూరి రవీందర్

ఊరువాడ ఒక్కటయ్యి ఉద్యమించిరన్నో జైకొట్టి తెలంగాణ
మెల్లామెల్లంగ పోరు ఢిల్లీ చేరిందన్నో జైకొట్టి తెలంగాణ
ఇయ్యెరమయ్యెర వాళ్ళు... రయ్యిన లేసిండ్రో జైకొట్టి తెలంగాణ

వందలవేలయ్యి జనం బారులు కట్టిన్రో జైకొట్టి తెలంగాణ
ఉసిల్ల పుట్టతీరు ఉప్పెనయ్యిన్రో జైకొట్టి తెలంగాణ
ఊరువాడ టెంటులేసి... పోరునడిపిన్రో జైకొట్టి తెలంగాణ

ఉరుముతున్న ఉద్యమం మెరుపుమెరిసిందో జైకొట్టి తెలంగాణ
చెట్టుమీద కోయిలమ్మ కోరసయ్యిందో జైకొట్టి తెలంగాణ
తూరుపమ్మ ఎర్రబారి...తిలకమయ్యిందో జైకొట్టి తెలంగాణ

పలకరిస్తే గుండెనిండ ప్రశ్నలకొడవండ్లో జైకొట్టి తెలంగాణ
యాభైయేండ్ల సంది రంది ఎందుకంటున్రో జైకొట్టి తెలంగాణ
ఆరోపారో తేల్సూకోను...అందరొక్కటైరో జైకొట్టి తెలంగాణ

సదువుకునే పోరగాళ్ళు గోరుకొయ్యలైరో జైకొట్టి తెలంగాణ
సీకటంత చీల్చనీకి పోరుమంటలైయిరో జైకొట్టి తెలంగాణ
నెత్తురంత మండుతుంటె...కత్తులైతున్రో జైకొట్టి తెలంగాణ

కాకతిరుద్రమ్మపోరు కండ్లకద్దుకున్రో జైకొట్టి తెలంగాణ
కొమురంభీం కొట్లాట మదిలతల్సుకున్రో జైకొట్టి తెలంగాణ
ఆఖరిమోఖకు వాళ్ళు...జబ్బసరిచిన్రో జైకొట్టి తెలంగాణ

సమైక్యనాటకాలు సాగవంటున్రో జైకొట్టి తెలంగాణ
అడ్డమొచ్చెకొడుకులా అంతుచూస్తమన్రో జైకొట్టి తెలంగాణ
రాష్ట్రమొచ్చెదాక పోరు...ఆగమంటున్రో జైకొట్టి తెలంగాణ

# తలాపున పారుతోంది గోదారి

- శివుడు

తలాపున పారుతోంది గోదారి
నీ చేను నీ చెలకా ఎడారి,
రైతన్నా, నీ బతుకు అమాసా
ఎన్టిపీసి చూస్తోంది తమాషా

నీ చుట్టు సిరులు వున్నా - నీకేది దక్కదన్న
నీ చేతిలోని బువ్వే - నీ నోటి కందదన్న
చేతికి మూతికి నడుమ గీత గీసిరన్న
మోసపోతివన్న - అరిగోస పడితివన్న ॥తలాపు॥

కొండ మీది భ్రమరాంబ చిన్న చూపె చూసింది
శ్రీశైలం కుడి కాలువ వెన్నుపోటె పొడిసింది
ఉన్న నీళ్ళ నాంధ్రాకు ఊడ్చుకొని పోయింది
ఎడమ కాలువ ఎలుక తోక దార నీకు మిగిలింది
కృష్ణా నది చిరునామా - కోస్తా కొబ్బరి బొండం
నమ్మి నారుబోసుకుంటె, నీ ఎవుసం దినగండం ॥తలాపు॥

శ్రీ రామ సాగరమూ - నీ ఆశలు తీర్చలేదు
తెలంగాణా నేల తల్లి - గొంతునైన తడుపలేదు
సాలానా పారుకము - చారానాకు పడిపోయె
కొంత నీరు ఎన్టిపీసి కరెంటుకు సరిపాయె
నీ నీరు నీదిగాక - నీ వెలుగు నీదిగాక
వైజాగున వెలుగనీక - తరలిపోయెరన్నా ॥తలాపు॥

ఇచ్చంపల్లి ప్రాజెక్టును వాయిదాలు వేస్తాన్రు
తవ్వుకున్న బావులకు పవరు కోత పెడతాన్రు
వంగిన నీ నడుం మీద సవారీలు చేస్తాన్రు
పన్నుపోటు పొడిచి నిన్ను బిచ్చగాణ్ణి చెస్తాన్రు
పొలాలలో దుర్గన్నల శవాలేమో తేలుతాంటే
జన్మభూమి జాతరల జేగంటలు కొడతాన్రు ॥తలాపు॥

నోరు మూసుకుంటె నిన్ను దేకటోడె కరువాయె
కడుపు మండి కేక వేస్తే నీ ఊరె కాల్తదాయె
బతికున్నా పేరెగాని రోజుకొక్క చావాయె
చిచ్చోలె మండలేని చచ్చు బతుకులైపాయె
ఎన్నాళ్ళీ మూగనోము నాగలి మర్రెయ్యరన్న
కన్నెర్రజేసి నువ్వు పోరుబాట నడువరన్న
వీర తెలంగాణా నీకు హారతులే పట్టురన్నా ॥తలాపు॥

# తల్లి తెలంగాణ

- పి. జగన్ మోహన్‌రావు

తల్లి తెలంగాణరా ! తల్లడిల్లుచుండెరా
నా సంపదనంత! నా బిడ్డల కందకుండా
వలస వాదులంత ! కొల్లగొడ్తున్నందుకూ
తల్లి తెలంగాణ ! తల్లడిల్లుచుండెరా!! ॥తల్లి॥

కొప్పులో మల్లె దండగ, పెనుగంగా పారంగా
వట్టి వాగు, చెలియాగు, కుంటాలా పెదవాగు
లెక్కలేని సెలయేళ్ళు గలగలా పారంగా
గోదారి గంగమ్మ మెడ దండా లాగుచుండగ
మానేరు, మంజీరలు, యెయ తుమ్మెదనదులూ
ఆకేరు, అకిలేరు, మూసి కిన్నెర సానులు ॥తల్లి॥

కృష్ణా, గోదారి నదులు జలజలా పారంగ
పాకాల, రామప్ప శనిగారం పెద చెరువు
పెద్ద చెరువు, ఊరి చెరువు లెక్కలేని కుంటల్లు
చెరువులూ, కుంటల్లూ చుక్కల్లా మెరియుగా
అది యేమి చిత్రమ్మో! నీళ్ళ చప్పుడు లేక
నా నేల నిండా ! నా నేల నిండా
నెరియల్లూ వాయంగా, నెరియల్లు వాయంగా
ఆకలి మంటల్లా బిడ్డల్లు చావంగ ॥తల్లి॥

చదువుల తల్లికి గుడి కట్టితి నిచట
అదియేందో మరిగాని, నా పోరగాండ్లంత

సదువూ సంధ్యల్లేక ఆగమైపోతాంద్రు
సదువూ సంధ్యల్లేక ఆగమైపోతాంద్రు ॥తల్లి॥

బిడ్డా నా గర్భానా బొగ్గు మోగుళ్ళూ
బొగ్గు మొగుళ్ళపై మెరుపు తీగల్లు
ఎన్ని మెరుపులున్నా ! అది యెందో మరిగాని
నా ఊరి వాడంత చిమ్మచీకట్లో చిమ్మచీకట్లో ॥తల్లి॥

తిరుగబడ్డ వీణరా! తెలంగాణ బిడ్డరా
తల్లి తెలంగాణమా! కోటి రత్న వీణమ్మా!
తల్లడిల్లబోకమ్మ! కంటనీరు పెట్టకమ్మ
వీర తెలంగాణరా! తిరగబడ్డ వీణరా ॥తల్లి॥

# త్యాగాలవనమా- తెలంగాణమా

- కోటి (పి.కె.ఎం.)

తెలంగాణమా...తెలంగాణమా...
తెలుగునేలపై మొలిచిన త్యాగాల వనమా
మరువ జాలరే... మరువ జాలరే...
నీత్యాగమెన్నటికి ప్రజలు మరువ జాలరే... ॥తెలంగాణమా॥

ఎన్నెన్నో అందాలు మరువని మకరందాలు
ఈభువిపై విరజిమ్మిన విప్లవ సుమగంధాలు
కళలకు నువ్ కాణాచి కవులకు నువ్ పురుడోసి
విప్లవాన్ని కలబోసిన పోరుకు దిక్సూచి... ॥తెలంగాణమా॥

సింగరేణి బంగారపు సిరులను కురిపించి
నింగినంటె వెలుగులకు నడకను నేర్పించి
గోదావరి క్రిష్ణమ్మల గానాలు వినిపించి
మాగాణి భూముల్ల రాగాలు పండించి ॥తెలంగాణమా॥

దొరలగడీ గుండె మీద దండయాత్ర నడిపి
బరిబాతల బతుకమ్మల యతలను ఎడబాపి
పల్లెలన్ని జిల్లలన్ని పోరులోన కలిపి
కారుచీకటిని చీల్చే కాంతిరేఖలై నిలిపి ॥తెలంగాణమా॥

తెలంగాణ సాయుధ సంగ్రామ భేరిమ్రోగించి
విద్యార్థి ఉద్యమాల పొద్దును పొడిపించి

జగిత్యాల జైత్రయాత్ర జనహోరినిపించి
ఇంద్రవెల్లి కొండల్లో దండును నడిపించి ॥తెలంగాణమా॥

వేలకొలది వీరులు నేలపైన రాలినా
రాజ్యహింసతో రక్తం ఏరులై పారినా
నోళ్ళు తెరిచి జైళ్ళన్ని వెల్లువై మింగినా
ఊళ్ళు ఊళ్ళే ఉద్యమాన్కి ఉరికించినా ॥తెలంగాణమా॥

మా భూములు మాకంటు బరిగీసి నిలిపావు
మా నీళ్ళు మాకంటు బీళ్ళను కదిలించావు
మా కొలువులు మాకంటు కొట్లాటను నేర్పావు
మా పాలన మాకంటు పోరుకు దండెత్తావు ॥తెలంగాణమా॥

# తిరుగబడ్డ తెలంగాణా బిడ్డ

- తోట మల్లేశం

దగాపడ్డ తెలంగాణ కన్నీటి గాధలన్నీ
రాసి చేసి గొంతులెత్తినం, శ్రమజీవులార
వెల్లువెత్తి చెలరేగుదాం, మాయన్నలార
కూడు లేక గూడు లేక గుడ్డ లేక అలమటించి
నైజాముకే గోరి కట్టి నినదించిన వీరులము
తెలంగాణ ముద్దుబిడ్డలం, ఓ అన్నలార
త్యాగాలకు ముందు దూకినం, మా అక్కలార ॥దగా పడ్డ॥

పొట్ట చేత పట్టుకొని కోసుల దూరం నడిచి
కూలి చేసి నాలి చేసి ఫలం లేని శాకిరి చేసి
గంజిల ఈగలవోలే చిన్న చూపుకు బలి అవుతూ
యెట్టి జేసి దెబ్బ దిన్నమూ, ఓ అక్కలారా
నమ్ముకొని మోసపోతిమా!, ఓ ఆన్నలార ॥దగా పడ్డ॥

ఆంధ్రా దొరబాబుల యెత్తుల జిత్తులలోన
పచ్చటి పైరుల గ్రామసీమలన్నీ చెదిరిపాయె
కరువు కన్నీళ్ళ తోటి ఆకలి చావుల తోటి
తల్లడిల్లి సగమవుతుంటే, నా తెలంగాణ
రాజ్యహింస రాజ్యమాయెరా, ఓ బిడ్డలార ॥దగా పడ్డ॥

పంచవర్ష ప్రణాళికలు అడవిల ఆగం చేసె,
కోట్ల కోట్ల నిధులన్నీ ఎండమావుల చందమేరా

“అత్తుండు పోతుండనిరో“, ఆ యాస కొడుకు
నవ్వులాట జెయ్యవట్టెరో ఆ ఆంధ్ర కొడుకు ॥దగా పడ్డ॥

ఆగదు ఆగదు ఆగదు తెలంగాణ విప్లవాగ్ని
అమరులైన వీరుల నెత్తుటి సాక్షిగ సాగి
కపట రాజకీయాల కుట్రలను చెండాడి
పక్షపాత నాయకుల గుండెల్లో నిదురపోయి
ఎదురీది యేలుకుందాము మా అక్కలార - 2 ॥దగా పడ్డ॥

# తెలంగాణ జంగు సైరన్

– మిత్ర

అలయ్ బలయ్ తీసుకో – ఆగకుండ సాగిపో
సేతుల సెయ్యేసుకో – పిడికిళ్ళు బిగుసుకో
అటో ఇటో అర్సుకో – అద్దులునువు గీసుకో
దుంకుర తెలంగాణకై – దూలంటూ ఓలంటూ
సాగర తెలంగాణకై – సై అంటూ జై అంటూ ॥అలయ్॥

పన్నులే గట్టనన్న పగిడిగిద్ద రాజువై
స్వయంపాలనే అన్న కొమురం భీమన్నవై
సమ్మక్క సారక్కలై
సాకలి ఐలమ్మలై
రోషముండి తొడగొట్టి నడుద్దాం ముందుకూ
ఆడమొగలొక్కటైతే ఎదురులేదు మనకూ ॥అలయ్॥

డిల్లెం బల్లెం సప్పుడుతో ఢిల్లీకి నడవాలిరో
బిల్లువెట్టువంటు మనం గట్టిగ అడగాలిరో
పార్లమెంటు ముందటే
పొయ్యిలు పెట్టాలిరో
వలసలతో తెలంగాణ సింపులంగి జేసినోల్ల
దేశమంత సాటిసెప్పి మద్దతుకోరాలిరో ॥అలయ్॥

తొవ్వలన్ని బందువెడ్తె తొవ్వకన్న వత్తురో
పనులన్నీ ఎగవెడ్తె చిన్నగ దిగి వత్తురో
బహుజనులందరితో

దండేగట్టాలిరో
సబ్బండ కులముతోటి సోపతి జెయ్యాలిరో
సామాజిక న్యాయంతో సాగిపోవాలిరో ॥అలయ్॥

బుడి బుడి ముచ్చట్ల తోటి పట్నం మాదన్నరో
ఏకాభిప్రాయమంటు తోకలూపుతున్నరో
బొంద్రాయె పీకేస్తే
ఊరెట్ల పొందురో
భూమినీళ్ళు దోసినోల్ల తలలో పుట్టిందిరో
గ్రేటరైద్రబాదంటే వామనపాదమ్మురో ॥అలయ్॥

సంకలు లేపని సలిలో ఉడుకేబుట్టాలిరో
ఓట్లకు ముందే రాష్ట్రం కదిలిరావాలిరో
తెలుగోల్లు తురుకోల్లు
కలిసే ఉంటారురో
సీమాంధ్ర గరీబోల్ల మనుసులు గెలువాలిరో
జన తెలంగాణకై జై అని లేవాలిరో ॥అలయ్॥

కాముని పండుగోలె కవాతు జెయ్యాలిరో
జంటకోలలే గుత్పయి జాజిరాడాలిరో
పీరీల ఆల్వకాడ
ఊరేదుంకాలిరో
జగుడం బెట్టే కొడుకుల బతుకమ్మాడాలిరో
తెలంగాణకై జంగు సైరనూదాలిరో ॥అలయ్॥

# తెలంగాణ పల్లె గొల్లుమంటుందో

- బోడ చంద్ర ప్రకాశ్

తెలంగాణ పల్లె గొల్లుమంటుందో
తల్లి గోస పడుతుందో
సుక్క నీరు లేక నోరు తెరిచిందో..
తల్లి అల్లాడుతుందో

కృష్ణమ్మ గోదారి నదులెన్నో పారినా
జీవ నదులెన్నున్న జీవి గంజే లేదు
నల్ల రేగడి భూము నెర్రెలు బాసింది
ఎర్రాని దుక్కులు ఎక్కెక్కి ఏడ్చెరా
కరువుతో పల్లె అయ్యయ్యో వలసపోతుందో ॥తెలంగాణ॥

ఎనకటికి తెలంగాణ సెరువు కుంటలతోని
కళకళాలాడుతూ నిండుగా నుండెరా
పచ్చనీ పంటలూ మక్కజొన్న చేలు
పాడి పశువులతోని పచ్చగుండె పల్లె
సెరువు కుంటలేమాయే ఊట సెలమలెటుపోయే ॥తెలంగాణ॥

కందులూ రాగులూ మెట్ట పంటలు గూడ
సినుకమ్మ జాడలే కిత్తు పత్తకు లేదు
కందులా రాశులెబాయె

రియాలు భుముల పేర బీడు భూములు జేసి
పాము హౌజులు కట్టి ఫ్యాక్టరీలు పెట్టి

పచ్చనీ బతుకుల్లో సిచ్చు పెట్టినారు
ఉన్నదంత ఊడ్చి తెగబల్సిపోయిండ్రు
మెతుకున్న నేల నేడు గతిలేక ఉందో

వలస పక్షులొచ్చినట్టు ఒచ్చిండ్రురా
నిల్చున్న భూమిని నిలువునా దోచిండ్రు
మన యాస మాన్పించి తన భాష నేర్పించి
మన యాస బాసను ఎక్కిరిస్తా ఉండ్రు
మన బర్రెపాలను గేదె పాలంటుండ్రు
ఆవునూ గోవంటు పెండనూ పేడంటు
వలసొచ్చినోడే ఏకు మేకయ్యినాడో ॥తెలంగాణ॥

తెలంగాణ బిడ్డలూ దండు కట్టాలిరా
వలస వాదుల పీడ వదిలిపోవాలంటె
వడిసెలలా బట్టి తరిమి కొట్టాలిరా
నడవరా తమ్మి పోరులో గెలవాలి చెల్లీ

# తెలంగాణ ఆటపాట

- అంబటి వెంకన్న

తెలంగాణ ఆట పాట పల్లెలు దరువేసెనంట
వట్టికోట గట్టిమాట సుద్దాల దండుబాట
కాళోజి గొడవజేయ కలెబడి పోరాడుదాం
కలిసి వస్తెరా తెలంగాణ బిడ్డలు
గెలిసి తెద్దమూ మనకన్న తల్లినీ ॥తెలంగాణ॥

రజాకార్లు భూసాములు పీడించిన కాలంలో
బాంచన్ దొర కాల్మొక్తని బతిలాడిన రోజుల్లో
ప్రజాయుద్ధభేరి మోగ గజ్జెగట్టెనీ పాట
దొరఘడీలు కుప్పగూల దద్దరిల్లెననీ ఆట
కలిసి వస్తెరా తెలంగాణ బిడ్డలు
గెలిసీ తెద్దమూ మనకన్న తల్లినీ ॥తెలంగాణ॥

ఉధ్యమాలు కొత్తగాదు పల్లెలొ మన పల్లెలో
విప్లవాలె ఆనవాల్లు నేలలొ తెలంగాణలో
నెత్తుటి పాదాల అడుగు జాడల్ని జూడగా
పదం పదం గలిపి మనం వెనుదీయక సాగుదాం
కలిసి వస్తెరా తెలంగాణ బిడ్డలు
గెలిసి తెద్దమూ మనకన్న తల్లినీ ॥తెలంగాణ॥

కళాకారులంత గలిసి కదందొక్కి సాగంగా
కవి గాయకులెందరో గొంతెత్తీ పాడంగా
పల్లె పల్లెనా ఎగిసె తెలంగాణ నినాదం

కన్నతల్లి రుణందీరె బాటనె బయలెల్లుదాం
కలిసి వస్తెరా తెలంగాణ బిడ్డలు
గెలిసి తెద్దమూ మనకన్న తల్లినీ ॥తెలంగాణ॥

కాలయముల కతంజేయ నడుంగట్టి నడవరో
తెలంగాణ కడ్డొస్తే గోరీ గడదామురో
అటో ఇటో తేల్చుకునే తరుణం వచ్చిందిరా
తెలంగాణ భూమి పుత్రులేకం గావాలెరా
కదలి పోదమూ తెలంగాణ బిడ్డలు
సాధించుకొద్దమూ మనకన్న తల్లినీ
తెలంగాణ తల్లినీ....... ॥తెలంగాణ॥

# తెలంగాణ జెండపట్టు

- కోదారి శ్రీను

ముద్దగటుక బువ్వ మురుసుక తిన్నదా - తెలంగాణ
సింపు గోసితోటి సిగ్గును దాసిందా - నా తెలంగాణ
దోపిడిపాలన లూటీ చేసిందా - నా తెలంగాణ
ఓ.......... ఓ............ ఓ.............. ఓ........... ॥2॥

ఏటిదాపునున్న ఎకురమచ్చుకట్టి
ఏటి మధ్య చేతిబోరు ఏయించి
ఏటిసెట్ల పొంటి పైరు పరిపికించి
మోటారు నీళ్ళతో మొలుక అలికించి ॥మోటారు॥

కలుపు తీసిన సేను పూతకొచ్చింది
పూతకొచ్చిన సేను కోతకొచ్చింది ॥పూత॥

ఏటిబోరు ఎండకెత్తిపాయె
సేను ఎండి రైతు గుండె పగిలే ॥నోరు కొట్టుకున్నం మేము॥

భూమి లేనోళ్ళకు గౌర్నమెంటోడు
పోరంబోకు సొటపొలం చేయించే ॥పోరంబోకు॥

అన్నదమ్ములు కొట్లాట బెట్టుకొని
పంచుకుంటే అర్ధ ఎకురము వచ్చె ॥పంచుకుంటె॥
పచ్చబడ్డ సేను పైరుకొచ్చి దాని
అప్పుదెచ్చి ఎరువు మందు సల్లితె ॥అప్పు దెచ్చి॥

సెర్ల నీళ్ళు సేప పిల్లలకే సాలలే ........
తూములెత్తిపోయి పొలములెండిపాయె ॥నోరు కొట్టుకున్నం మేము॥

సెలుక భూములల్ల సెమట గార దున్ని
కుష్కి పంటలన్ని దట్టంగా పెంచి ॥కుష్కి పంట॥

లద్ది పురుగు సేను బంతి బట్టి మేసే
పచ్చ పురుగు సేను పొట్టు పొట్టు జేసె ॥పచ్చ పురుగు సేను॥

ఆన పాడుగాను అదునుకు రాదాయె
సేను ఆరిపోయి పంటలెత్తిపాయె ॥సేను ఆరిపోయి॥

రైతు బొంద మీద మన్ను బోసిపాయె
తెలంగాణ పల్లె నిండ మునిగిపాయె ॥నోరు కొట్టుకున్నం మేము॥

నదీ జలాల్లో హక్కు మనకుంది
ప్రాజెక్టు నీళ్ళ పాలుమనకుంది
పరాయి కొడుకులు నీళ్లు సాపుకొనే
పదవులల్ల వుండి నిధులు మలుపుకొనే
నిలువు దోపిడైన తెలంగాణ గడ్డ
కరువులల్ల కన్నీళ్ళు కార్చుతుండే
కడుపు మండుతున్నా తెలంగాణ బిడ్డ
కదిలిరారా నీవు కష్టజీవుల బిడ్డా

# తెలంగాణ తల్లేమో

- ఎన్నార్

తెలంగాణ తల్లేమో తల్లడిల్లి పోతుందో రావే రావ చంద్రమ్మ
కోటి బాధలల్ల తల్లి కుమిలిపోతవున్నదో ఒ చెల్లల చంద్రమ్మ
నిలువెల్ల గాయాలతో నిప్పై మండిందో రావేరావ చంద్రమ్మ
దోపిడోల్ల మీదికి దండుగట్టమన్నారో ఓ చెల్లెల చంద్రమ్మ
వందల యేండ్లుగా మోసపోతినన్నాది
నైజాంమోడు వోయినా నల్లదొరలు వచ్చినా
నలభయేండ్లు గడిసిన ఏమొరిగెనన్నాది
పురిటి నొప్పులతో తల్లి కండ్లెర్రజేసిందో - రావే రావ చంద్రమ్మ
॥తెలంగాణ॥

కరువులు కాటకాల ఆకలి రోగాలల్లో
ఆత్మహత్యలల్లో కాలుష్యపు కోరలల్లో
అణిచివేతల మధ్య అడుగంటిపోతినందీ
తెలంగాణ దక్కకుంటే వేరే దారి లేదందో - రావే రావ చంద్రమ్మ
అన్యాయం మీద యుద్ధం సుర్వు జేయమన్నాదో - రావే రావ చంద్రమ్మ
॥తెలంగాణ॥

పచ్చగున్న ప్రతిచోట కన్నేసిరన్నాదో
వేషభాషలన్ని నేడు హేలన జేసెరన్నాదో
పత్రికలు సాహిత్యాలు సిన్మా టీవీ రంగాలు
పనికిమాలిన చెత్తనంత రుద్దిరంది మనపైనా
ఆటపాట భాషలను బతికించుకొమ్మందో - రావే రావ చంద్రమ్మ
॥తెలంగాణ॥

దొంగలు దొంగలూ గలిసి ఊళ్ళు పంచుకున్నతీరు
కోస్తాంధ్ర అగ్రకులం తెలంగాణ అగ్రకులం
దోసుకోని దోసుకోని పిప్పి చేసినారందీ
ఎనకబడ్డ కులపోల్లాను ఏకము గమ్మందీ రావే రావ చంద్రమ్మ
మన హక్కుల పోరులోన కలిసిరమ్మన్నదో ఓ చెల్లెల చంద్రమ్మ
॥తెలంగాణ॥

తెలంగాణ జిల్లాలన్ని జైళ్ళుగా మారెనంది
రాజ్యహింస కలకాలం సాగేది లేదంది
తెలంగాణ అమరుల త్యాగాల సాక్షిగా
పిడికిలెత్తి శపథం జేసి కదము దొక్కాలన్నదో రావే రావ చంద్రమ్మ

# తెలంగాణ కోటి రతనాల వీణ

- సుద్దాల అశోక్ తేజ

ఇది తెలంగాణ కోటి రతనాల వీణ
గుండె రగిలి కదనరాగమాలపించి
పొలికెక పెట్టినది ఇది రుద్రవీణ
వీర తెలంగాణా పేరుకెక్కిన గడ్డ మనపోరుగడ్డ
గొంతెత్తి ఇపుడు గాండ్రించు పులిబిడ్డ ॥ఇది తెలంగాణ॥

హైదరాబాదుకు అటు గోలుకొండ
మహబూబ్‌నగర్‌కు ఇటు నల్లగొండ
ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లా
ఓరుగల్లు ఖిల్లా పక్క ఖమ్మం జిల్లా
మెరుపులైమెరిసే నిజామాబాద్ మెదకు
ఉద్యమాలకు ఉరుము మా కరీంనగరు ॥ఇది తెలంగాణ॥

నల్లరేగడిలోన మిరప పండెరుపు
ఎరుపు మట్టిలోన పుట్టింది పసుపు
పసుపు ముత్యాలోలె మొక్కజొన్నరాశి
రాశిపోసిన తెలుపు పత్తిపంటలు
చేలలో గన్నేరు తంగేడు పూలు
పూలుకావవి పసుపుకుంకాలు ॥ఇది తెలంగాణ॥

గోదావరితోనుకులో వెలుగాడేరాణి
బొగ్గు గనులవేణి మా సింగరేణి
విద్యుత్తు పండించు మా రామగుండం

సున్నపురాళ్ళనిధి మాతెలంగాణం
జిత్తేరు, నలమద్ది, టేకు జిగురు
ఇచ్చింది సంపదలు అడవి తల్లివెదురు ॥ఇది తెలంగాణ॥

బ్రమ్మెరపోతనకు జన్మిచ్చేది అమ్మెరా
పాల్కురికి సోమనాధుని చేసెద్విపద

పోచమ్మ బోనాల శివసత్తులాట
మనసొంతమేకదా బతుకమ్మపాట
ఖండాలుదాటె మనజానపదగీతం
అందాల తెలంగాణ కావాలి రాష్ట్రం ॥ఇది తెలంగాణ॥

# తెలంగాణ లొల్లి....

- డా॥ చెరకు సుధాకర్

మల్ల మొదలయ్యింది లొల్లి
లొల్లి..లొల్లి..లొల్లి
తెలంగాణ లొల్లి
కాలం పొడుగూత.. తెలంగాణల
బువ్వ కోసం లొల్లి
భూమి కోసం లొల్లి
భూమిని, రెక్కల్ని నమ్ముకున్న మనిషి విలువ కోసం లొల్లి
యెవడు నేర్పని లొల్లి
లొల్లికే తల్లి అయిన తెలంగాణ..
తన కోసం మల్ల మొదలుబెట్టిన లొల్లి
లడాయి కొత్తకాని గడ్డ
నమ్మిన బాట కోసం గడప గడపకు
కన్న కొడుకుల పోగొట్టుకున్న నెత్తుటిగడ్డ
ఉగ్గు పాలతో బిడ్డలకు అగ్గిపూల పాటలు నేర్పిన గడ్డ
ఎప్పుడు మరువయిందో తెలియని జంగ్ సైరన్‌ల గొంతు గలిపి
నెమలి పించమిప్పి ఆడి పాడిన గడ్డ ... తెలంగాణ గడ్డ...
లొల్లికే తల్లి అయిన తెలంగాణ గడ్డ...
ఇప్పుడు తన కోసం, తనదైన రేపటి కోసం
మల్లా లొల్లి మొదలుపెట్టింది
సమ్మక్క, సారక్కల ఎంట తోలుకొచ్చిన తెలంగాణ
కొమరం భీము కోరమీసమై దువ్విన తెలంగాణ
దొడ్డి కొమరయ్య రక్తం బరిగీసి, తొడగొట్టి నిలబడ్డ తెలంగాణ

ఇప్పుడూ ... బరి గీసి...ఈ భూమి నాదంటున్నది.
భూమి మీద ఎవడి పెత్తనం ఒద్దంటున్నది.
వెన్నపూస మనసు తెలంగాణ
నేల ఉద్యమాలకు వెన్నుముక అయిన తెలంగాణ
మనసుకు ఎంత కష్టమయ్యిందో....
కనుగుడ్ల నిండా నీళ్ళు సుల్లు తిరిగి,
గుండెలన్నీ అవిసి అవిసి ... గోస తీసిన తెలంగాణ
కొత్త ఊసులు చెప్పమని
కొత్త బాసలు చెప్పమని లొల్లి బెట్టింది
మనసులున్నమాట యెల్లబెట్టింది
ఒక్కరోజు రాజేసిన కుంపటా ఇది?!
ఒక్కరోజు అంటుకున్న కొలిమి మంటనా ఇది?!
ఒక్కరోజు గడ్డ కట్టుకున్న చలినా ఇది?!
ఎట్ల చెప్పతే అర్ధమయితది?!
ఏ మీటర్ల కొలిస్తే లెక్క దొరుకుతది తెలంగాణా బాధ!
మొగులున్నదన్న మాటేగాని
దిగులు మబ్బులు తప్ప ఇంకేమి కనిపించవు
భూమి ఉన్నదన్న మాటేగాని
నెత్తుటి వాసన తప్ప మట్టి వాసన రాదు
దిక్కులున్నాయన్న మాటేగాని
ఎక్కుపెట్టిన తుపాకీ బయోనెట్ తప్ప ఏదీ కానరాదు
భూమీ, ఆకాశం కలిసే చోటున్నదన్న మాటేగాని

అక్కడ చావూ, బ్రతుకు కలగలిసిపోయి బిక్కు బిక్కుమనే
తెలంగాణా పల్లె తప్ప ఇంకేమీ లేదు
మనిషి ఉన్నాడన్న మాటేగానీ
వాడు దిగులుగా మొగులుకేసి చూడడమేగాని
మోసులెత్తింది లేదు, మొలకలెత్తింది లేదు........
భూమి, ఆకాశం రెండూ లేనప్పుడు
మంటిని, మింటిని ఏకం చేసి లడాయి చేయడం కాక ఇంకేం చేయొస్తది?
దొరల గడీల ముందు మోకరిల్లి, మోకరిల్లి
మోకాల్లు పొక్కిలి చేసుకున్న తెలంగాణ
బాంచెన్ దొరా! కాల్మొక్తా అని వంగి వంగి గులాపుగిరి చేసి
గూనిపోయిన తెలంగాణ ... తాడి చెట్టోలిగే నిటారుగ నిలబడి
భూమిని, ఆకాశాన్నీ, అవకాశాన్నీ...
భూమిలున్న నీళ్ళని, బొగ్గు గుట్టల్ని, గనుల్ని,
ఎట్లొచ్చేది ఉండే అట్లనే పంచమని డప్పుకొట్టి లొల్లి పెట్టింది
లోకానికె సోయి గురించి సొదబెట్టి, రొదబెట్టి లొల్లి చేసింది.
ఢం ఢం కే పునం .. పునం..
భాగం పంచేదాక ...ఎవడూ చెప్పినా ఇనం ఇనం...ఇనం??
ఆకలి చావుల పాలమూరు.
విషం గడ్డలే సద్ది బువ్వగకడుపు నింపుకునే ఆదిలాబాదు
నడ్డి నిండా ఫ్లోరిన్ విషంతో వంగిపోయిన నల్లగొండ, ఎల్లారెడ్డి గూడెం
కడుపు నిండా కాలుష్యం విషం నింపుకున్న పఠాన్ చెరు, హుస్సేన్సాగరు
సపుటపత్రల చౌటుప్పల

మురికి గుంటల గిరా గిరా తిరిగి కనుమూసిన సక్కనీ మూసి కాలువ
కల్లోలం కరీం నగరు
ఎన్‌కౌంటరు ఏసుపురము, హంటర్ రోడ్డు
కరెంటు కోత ... కడుపు కోత...
కరువు వాత ... ఎట్టిమోత... పక్షపాతం... పక్షపాతం
దయ గల సర్కారూ!
అన్నీ మాకేనా రిజర్వేషన్...?
దునియలున్న జీవరాసులన్నీ ఎనుకట జలరాసులెనటగా!
అమ్మ కడుపులున్నప్పుడు ఉమ్మి నీళ్ళల తానం జేసినంక
మల్ల మస్తు నీళ్ళల్ల తానం జేసింది........
అమ్మ తోడు ... ఎంత ఎరక తెచ్చుకున్నా గురుతకొస్తలే!
కండ్లల్ల నీళ్ళెగాని ఎండ్ల నీళ్ళులేని రాజ్యం కదా మాది!
నీళ్ళ కోసం గింత లొల్లా?!
భూమ్మీద ఏడనన్న, ఎవడన్నా నీళ్ళ కోసం
ఇన్ని వొందల మైళ్ళు పైదల్ నడిసింద్రా!?
బిడ్డా! ఇది తెలంగాణా
చరిత్రకు చరిత్ర నేర్పిన తెలంగాణా
నీళ్ళ కోసం ఢిల్లీ గద్దె కిందికి, పట్నం గద్దె కిందికి నీళ్ళు తీసుకొస్తున్నది
నీళ్ళకోసం
ఊళ్ళనన్నిటిని పేని పేని
ఒక తాటి మీదకి తీసుకొస్తున్నది.
ఊళ్ళ నోళ్ళ నిండా ఇప్పుడు
జై తెలంగాణా చప్పుడే

# తెలంగాణా చెదిరిపోతుంది

- యాదగిరి

చెదిరిపోతుందన్న - నా తెలంగాణ
అదిరి పోతుందన్న - నా తెలంగాణ
నన్ను గన్న నా తల్లి తెలంగాణ

పాలకుల వైఖరి నను గన్న తల్లిని
పాడు చేసిందన్న - బీడు చూపిందన్న
పారేటి నదులాను తాము మల్చుకుంటె
నదులను గన్నట్టి నా తల్లిని జూడు
నా బిడ్డలకే నేను కరువైతినాని
తల్లడిల్లి తల్లి కంట తడిపెట్టింది-

పచ్చాని పంటల పల్లెల గన్నట్టి
సక్కాని తల్లేమో చిక్కులబడి పాయే
కనకరాసి చూసే తెలంగాణ రైతు
కాలుష్య కోరల్లో చిక్కి సావబట్టె
నాబిడ్డలకే నేను బతుకజూపెట్టని-
నా బతుకు ఎందుకని తల్లడిల్లె తల్లి-

ఆనాడు చెన్నన్న గోసి ఎగజెక్కిండు
తెలంగాణ నేను సాధించుకొస్తనండు-
ఓట్ల కోసం బలె నాటకం ఆడిండు
సీట్ల కోసం బతుకు బాగోతమాడిండు

దుంకిన చెన్నన్న ఓట్లల్ల గెల్వగనే
తెలంగాణంటేనే ఎగేసి తన్నిండు

మరి ఈనాడు మన సారూ
మాజీ పోలీసు మంత్రి
ఇంద్రారెడ్డి సారు బాగ నర్కుతుండు
మంత్రిగా ఉన్నపుడే గీ ఇంద్రన్ననెగాదా!
మన పల్లెల గూల్చి మన పిల్లలను గాల్చి
ఇపుడు పదవి లేని గా ఇంద్రారెడ్డి
ఏమేమో చెప్తుండు, ఎగబడి వస్తుండు
ఓట్ల కోసం రెడ్ల నాటకమె ఓరన్న
ఒరగబెట్టేటోడు పెద్దోడు గాదన్న
పేదోల్లం మనమంత ఏకమయ్యి ఉంటె
ఏకమై పోరుకు ఎగబడి ఉరికితే
తప్పక తెలంగాణ సాధించుకొస్తము
తిప్పలేమిగాదు తెల్సుకో మాయన్న
చెయ్యిరా చెయ్యన్న పోరాటం
తెలంగాణ రాష్ట్రం సాధించుకొనుటకు

# తెలంగాణ పులిబిడ్డల్లారా

- మంతటి కృష్ణవర్మ

అరె అరె అరె దగాపడ్డ నా బిడ్డల్లారా!
ఆకలి పేగుల వీరుల్లారా.....
తెలంగాణ పులిబిడ్డల్లారా

ఎంతకాలం ఓర్సుకుందాం మట్టి బ్రతుకులను ఎట్టి బ్రతుకులను
మాటిమాటికి ప్రజలమీద మరి కమీషన్లు ఎర వేసిందెవడు
అరవై వేల ఉద్యోగాలకు అసలుకు ఎసరు పెట్టిందెవడు
ముల్కి నిబంధనల పేరు తోటి అ మూతబడినవి ఫ్యాక్టరీలురా హ.... ॥అరె అరె॥

ఉద్యమాలకు మారుపేరురా కరీంనగర్ మరి నల్లగొండరా
పలుగురాళ్ళ ఆ నల్లగొండ యుద్ధానికి మేము సిద్ధమన్నరు
ఖమ్మం జిల్లాకదం దొక్కినది నిజామాబాద్ నిప్పులు రేపె
లంబడన్నలు సిద్ధమన్నరు ఆదివాసులు ఏకమైనరు హ......... ॥అరె అరె॥

తూర్పుదిక్కున అడవుల్లోన తుడుం దెబ్బ మ్రోగిస్తున్నరు
కరెంటు చార్జి పెంచినోన్ని ఖథం జేస్తమని కత్తులు నూరిరి
మర్సిపోయిన తెలంగాణకు శాంతి యుద్ధం చేద్దమన్నరు
ఆంధ్రపాలన సాగదని సవాల్ చేసి ముందుకొచ్చినరు హ.... ॥అరె అరె॥

కుమ్మరి కమ్మరి కుర్మ యాదవులు
డిల్లెం పల్లెం దర్వులేసినరు
కలం పట్టిన ఎన్‌జివో లను కదిలిరమ్మనిరి తెలంగాణకు
లంబాడోల్లా తండల్లోన నంగారభేరి మ్రోగిస్తున్నరు
ధర్మయుద్ధములో శాంతి పతాకం ఎగురవేద్దమన్నరు హ...... .॥అరె అరె॥

# తెలంగాణ గీతం

- మిత్ర

పాడరా పాడరా మన పాట
జన తెలంగాణమని ప్రతినోట ॥జన॥ ॥పాడరా॥

కృష్ణ గోదావరులు - కుడి ఎడమపారగా
గోల్కొండ తలపైన -కిరిటమై మెరవగా
త్రిలింగాలనేల తెలంగాణమై
భరతమాతనుదుట సింధూరమై ॥పాడరా॥

సెరువు అలుగు దుంక - సిలుకవన్నెల సిలుక
మంచెనెక్కిరాత్రి - కాసేను నెలవంక
జొన్నపిస్కిల్లు తల్లి పాలోలెరా
పాలపిట్ట వాలి తింటుందిరా ॥పాడరా॥

పోశమ్మ మైసమ్మ-గ్రామపోలేరమ్మ
వాగొస్తె గంగమ్మ-వనంలో సారమ్మ
సిబ్బిపూలనడుమ గౌరమ్మరా
ఆడబిడ్డల జాడ బతుకమ్మరా ॥పాడరా॥

తెలుగు ఉర్దూలు బహుభాషాసంపదలు
కన్నడ మరాఠి - కలగలిసె యాసలు
జానపదులు తేనెలొలికేనురా
జన సంస్కృతీడ నడయాడెరా ॥పాడరా॥

పాట లంకితమివ్వ - ఏ రాజులెందుకని
పాలకుర్తినుండి - ప్రజాకవుల దాకా
సమరాగ్ని కలములో నింపుకోగా
సామాజిక న్యాయమంపు కోగా ॥పాడరా॥

పంబాల జముకులు-సొన్నాయి పలుకులు
సార్తకాండ్ల వీణ-తోలుడప్పు, డోలు
పీరీల బోనాల పండుగలురా
గజల్ బాగోతాలు పండేనురా ॥పాడరా॥

ఆదివాసుల కొలువు - సమ్మక్క సారక్క
బహుజన రాజ్యమే - సర్దార్ పాపన్న
రైతాంగ సాయుధ పోరాటమై
జగతిలో తెలంగాణ పేరొందెరా ॥పాడరా॥

వాగు వంకలు తిరిగె-వయ్యారి నడకలు
కాయకష్టమెరిగె-రైతులు కూలీలు
పల్లెల తండాల పది జిల్లాలూ...
పట్నాలు కార్మికుల నిలయాలురా ॥పాడరా॥

మాదిగలు మాలలు-బహుజనులందరు
సంచార జాతులు - సర్వమానవతలు

పుట్టీ పెరగే ఆత్మగౌరవంరా
ఎలుగెత్తి చాటింది తెలంగాణరా ॥పాడరా॥

శాంతి సమతలు విత్తి - పంటరాశులనెత్తి
ప్రతి ఇంట త్యాగాల్తో-నవకాంతి రాగాల్తో
తెలంగాణ తొలిపొద్దు వర్ణాలురా
ముక్కోటి రతనాల వీణాయెరా ॥పాడరా॥

తెలంగాణ తొలి పొద్దు వర్ణాలురా
ముక్కోటి రతనాల వీణాయెరా
పాడరా పాడరా మన పాట
తెలంగాణ తల్లి బతుకుపాట ॥పాడరా॥

# తెలంగాణకై పోరు చేద్దాం

- ఉప్పెన

జాజిరి.....జాజిరి.....జాజిరి....జాజిరి.....జాజిరి.....జాజిరి...
కబడి......కబడి......కబడి......కబడి......కబడి......కబడి....
ఛల్...వేరు తెలంగాణ కొరకు పోరు చేద్దాము....తమ్ముడా....పోరు చేద్దాం
తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకుందము....చెల్లెలా ....తెచ్చుకుందాం...
తెలంగాణ ప్రాంత అభివృద్ధికి పాలకులు
చేసింది ఏముంది చెప్పమను దమ్ముంటే
మాటలన్ని తేనె కన్నా తియగుంటయి....
తమ్ముడా ... తీయగుంటయి...
చేతలన్ని వేపకన్న చేదుగుంటయి..చెల్లల...చేదుగుంటయి.. ॥వేరు॥

వోలి వోలి రంగ వోలి సెమ్మకేళిల వోలి
వోలి వోలి రంగ వోలి సెమ్మకేళిల.... వోలి...
ఆరు వందల పది జీవోను గొయ్యి తీసి బొంద పెట్టి
పెద్ద మనుషుల ఒప్పందాన్ని తద్దినం పెట్టినారు
ఇచ్చినట్టే మాటలన్ని మూట కట్టిర ...తమ్ముడా ...
మూట కట్టిరి...
ఓట్లు తీసి గెట్ల మీద పాతి పెట్టిర ...చెల్లెలా...
పాతిపెట్టిరా.... ॥వేరు॥

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో...
బంగారు బతుకమ్మ ఉయ్యాలో మా బతుకుల్ని చూడమ్మ ఉయ్యాలో
పోలవరం ప్రాజెక్టు పనులకు అడ్డె లేదు

తెలంగాణ ప్రాజెక్టు పనులకు దిక్కే లేదు
ఇంతకన్నా వివక్ష ఎక్కడున్నది...తమ్ముడా ....ఎక్కడున్నది...
ఏ సాక్ష్యం ఇంక మనం చూపెట్టాలి...చెల్లెల ...చూపెట్టాలి.. ॥వేరు॥

ఆశన్న ఊశన్న ల్లారా... అన్నదమ్ములా...ఆశన్న ఊశన్న ల్లారా...
ఆశన్న ఊశన్న ల్లారా... అన్నదమ్ములా...ఆశన్న ఊశన్న ల్లారా...
మన ఆట పాట మాటలను అవహేళన చేసుకుంటు
కట్టు బొట్టు ఆచారాలను సినిమాల్లో కించ పర్చి
చూపుతున్న వాళ్ళ పైన తిరుగ పడుదము..
తమ్ముడా....తిరుగబడుదమా...
తెలంగాణ గడ్డ నుండి తరిమి కొడుదుమా చెల్లెల ...
తరిమి కొడుదుము ॥వేరు॥

అస్సోయ్ దూల ....అస్సోయ్ దూల ....అస్సోయ్ దూల ....
అస్సోయ్ దూల ....అస్సోయ్ దూల ....అస్సోయ్ దూల ....
తెలంగాణను బొజ్జి గొట్టి ఆంధ్రనంత రెచ్చగొట్టి
ఆ చెయ్యితో ఇచ్చేసి .... ఈ చెయ్యితో అడ్డుకోను
రాయలసీమంత రాజేసింద్రు...తమ్ముడ రాజేసింద్రు....
ఆంధ్ర ప్రాంతానంత అంటించింద్రు .... చెల్లెల ....
అంటించుంద్రు.... ॥వేరు॥

రాముడు కాముడు వలలో ....కట్టెక్కి పొంగ వలలో
కట్ట కింది మైసమ్మ నీలలో ....కళ్ళేర్ర చేయ వలలో....

హైదరాబాదు లేని రాష్ట్రమంటరో తమ్ముడా...రాష్ట్రమంటరో...
తలలేని మొండాన్ని ఇస్తరంటనే ... చెల్లెలా ఇస్తరంటనే.... ॥వేరు॥

ఆశన్న ఊశన్న ల్లారా... అన్నదమ్ములా... ఆశన్న ఊశన్న ల్లారా...
ఆశన్న ఊశన్న ల్లారా... అన్నదమ్ములా... ఆశన్న ఊశన్న ల్లారా...
దగాపడ్డ తెలంగాణా గుండె దరువు వినిపించి
వెనకబడ్డా తెలంగాణ యెదలోని బాదనంత
డప్పు మీద దరువేసి ఆటలాడుదాం తమకు ఆటలాడుదాం....
ప్రత్యేక తెలంగాణ పాట పాడుదాం చెల్లెల పాట పాడుదాం ॥డప్పు॥

# తెలంగాణ మహిళల పోరు

- దేవేంద్ర

తెలంగాణ మహిళల పోరు జూడరే
తెగువతో పోరాడుతున్న హోరు జూడరే ॥తెలంగాణ॥

తెలంగాణ మనదని
తెలుగు భాష మనదని
దండు గట్టి ప్రజలంతా కదిలినారులే
ఆ దండు లో మహిళలు ముందుండిరే ॥తెలంగాణ॥

కాకతీయ రాజులకు
కప్ప మివ్వబోమని
సమ్మక్క సారక్కలు కదం దొక్కిరే
వారు సమరంలో అమరులై నిలిచినారులే ॥తెలంగాణ॥

లచ్చుమమ్మ ఎర్రక్క
ఎంకమ్మ మల్లికాంబ
తెలంగాణ తేజమై వెలిగి నాదిలే
యువశక్తిని మేల్కొల్పి మెరిసిందిలే ॥తెలంగాణ॥

ప్రత్యేక తెలంగాణ
కావాలని నినదిస్తూ
చిన్నారి అనురాధ చిరుదీపమై
నిరహారదీక్షలో నిలిచిందిలే ॥తెలంగాణ॥

తెలంగాణ పాటకు
పల్లవి తానైనాది
పదిహేను ముక్కలై బెల్లి లలితక్కా
ఒక్కటై తెలంగాణ తెమ్మన్నదో ॥తెలంగాణ॥

తెలంగాణ కోసము
అందరము ఏకమై
సమైక్యాంధ్ర వద్దని చాటుదాములే
తెలంగాణ తెద్దామని తెలుపుదాములే ॥తెలంగాణ॥

# తెలంగాణా యువకుడా!

– భూపాల్

తెలంగాణా యువకుడా
తెగువ చూపరా!
నీ రాష్ట్రం నిర్మించగ నడుం గట్టరా.... ॥తెలంగాణా॥

సరిగ యాబయేండ్ల కింద
సాసంత్రం ఒచ్చెనంట
సాసంత్రం ఎవరికొచ్చి
సక్కబడ్డరో – ఎవ్వరు
సావు కయినరో ...... ॥తెలంగాణా॥

పెద్ద పెద్ద పదువులల్ల
ఉన్న బుద్ది మంతులంత
బతుక వొచ్చి సీట్లు ఆళ్ళు
గుత్త గొన్నరా – మననూ
బత్తలుంచిరా..... ॥తెలంగాణా॥

ప్రభుత్వమే ఆంధ్రులదై
ఆ ప్రాంతమే బాగు జేయ
తెలంగాణా లీడర్లూ
మూతి నాకిరీ – ఆళ్ళా
ముక్కు తూడ్చిరీ.... ॥తెలంగాణా॥

ఆంధ్ర ప్రాంతమంతటినీ
ఇంద్రలోక ఇంపుచేసి
తెలంగాణాకేమో వాళ్ళు
తెడ్డు జూపిరీ - ముడ్డి
మీద దన్నిరీ....... ॥తెలంగాణా॥

తెలంగాణా ప్రాంతానికి
తెప్పలు కుప్పలు గొచ్చీ
ఒచ్చినోళ్ళు లక్షలేమో
కూడపెట్టిరీ - మనసూ
మాడపెట్టిరి........... ॥తెలంగాణా॥

పెద్దరకం ఫ్యాక్టరీలు
పెంపుచేసి ఆంధ్రలోన
తెలంగాణ కేమో
పంగనామమన్నారా - ఒంగ
పెట్టి తన్నిరా!....... ॥తెలంగాణా॥

నీ భాషను ఎక్కిరిచ్చె
నీ యాసను ఎక్కిరిచ్చె
ఎక్కిరిచ్చి నోని తెలివి
ఎండ గట్టవా - అన్ని
తరిమి కొట్టవా..... ॥తెలంగాణా॥

ప్రాజెక్టులు ఆంధ్రలుంచి
పంటల భూములు పెంచీ
తెలంగాణాకేమో సవితి
ప్రేమ జూపిరీ – జీవి
గంజి పోసిరీ.... ॥తెలంగాణా॥

ఆంధ్రా రాయల సీమల
అంటురోగం కులంతీట
తెలంగాణా ప్రజల కింక
పూయజూసిరా – కొడుకుల
పునుకు వాపవా....... ॥తెలంగాణా॥

సదువు సంధ్య లోన ముందు
కోస్తె ఆంధ్ర వున్న దన్న
వసతులన్ని ఆంధ్రకేమో
వండిపెట్టిరీ – మనను
ఎండపెట్టిరీ........... ॥తెలంగాణా॥

నలబయొక్క ఏండ్ల సంది
నలుగుతుంది తెలంగాణ
ఉన్న సంపదంత కూడ
సప్పరిచ్చిరీ – మనకూ
చిప్పలిచ్చిరీ ॥తెలంగాణా॥

మన భూమి మన ఇష్టం
తెలంగాణ మన రాష్ట్రం
తెగించి సాధించాలే
అడుగులేయరా - ముందుగా
తుడుం గొట్టరా........... ॥తెలంగాణా॥

# తెలంగాణ లలిత

- రాజ నర్సింహ

తెలంగాణ లలిత పాట ఏదమ్మొ
నాగమల్లెలో తీగమల్లెలో
కోకిలమ్మ గొంతు రాగమెదమ్మొ
నాగమల్లెలో తీగమల్లెలో ॥తె॥

నల్లగొండలో నడుక నేర్చిందమ్మ
మెదక్ జిల్లాలోన మొదలు పెట్టిందమ్మ
గంతులేసుకుంటు గొంతుకలిపెటి
నాగమల్లెలో తీగమల్లెలో
గొల్లసుద్దులు చెప్పె డోలు దెబ్బమ్మ
నాగమల్లెలో తీగమల్లెలో ॥తె॥

ఒగ్గు తాళం డప్పు ఒగ్గు కథలమ్మ
చిందు బాగోతాలు చిరుతలాటలమ్మ
రేలాదూలా బతుకమ్మలాటలు
నాగమల్లెలో తీగమల్లెలో
డప్పులోలు తుడుం ప్రజల దరువమ్మో
నాగమల్లెలో తీగమల్లెలో ॥తె॥

ప్రజాకళలను కాపాడుకొమ్మని
ప్రజల దగ్గరికేమొ పరుగుతీసిందమ్మొ
జన తెలంగాణకు గాన కోకిలయ్యె
నాగమల్లెలో తీగమల్లెలో

తెలంగాణ అంత తిరిగి పాడింది
నాగమల్లెలో తీగమల్లెలో ॥తె॥

దగాపడ్డదంటు దరువు కొట్టిందమ్మ
గాయపడ్డాదంటూ గళం విప్పిందమ్మ
తెపడ్డదంటూ తాళమేసిందమ్మ
నాగమల్లెలో తీగమల్లెలో
తిరుగపడుమని తుడుము కొట్టిందమ్మ
నాగమల్లెలో తీగమల్లెలో ॥తె॥

బతుకమ్మ లాడుతు బతుకు చెప్పిందమ్మ
కోలాట మాడుతూ కొట్లాడమన్నది
ప్రజాస్వామ్యమని పాట పాడింది
నాగమల్లెలో తీగమల్లెలో
ఉద్యమానికి పాట ఊపునిచ్చింది
నాగమల్లెలో తీగమల్లెలో ॥తె॥

ఓడినప్పుడు పాట ఓర్పు నిచ్చిందమ్మ
గెలిచినప్పుడు పాట గెలుపు చెప్పిందమ్మ
పోరు జెయ్యపాట పట్టునిచ్చింది
నాగమల్లెలో తీగమల్లెలో
త్యాగాలను పాట చాటి చెప్పింది
నాగమల్లెలో తీగమల్లెలో ॥తె॥

రాజ్య హింసను పాట ఎత్తి చెప్పిందమ్మ
అందుకే లలితను నరికి సంపిండ్రమ్మ
జోహార్లు లలితక్క నీకు జోహార్లు
నాగమల్లెలో తీగమల్లెలో
ఆట పాటల డప్పు దరువు జోహార్లు
నాగమల్లెలో తీగమల్లెలో ॥తె॥

# తెలంగాణ ముద్దుబిడ్డలారా

- గుడిపల్లి రవి

తెలంగాణ ముద్దుబిడ్డలారా-తేరుకోరేంవిరా
తల్లి తెలంగాణ బంగపడుతున్న - భాదలేదేందిరా

సెర్లు బావులెండి గొర్లు బర్లని గోస దీస్తున్నాయిరా
పాలువోసిన నేల నీళ్ళకొరకు నేడు తల్లడిల్లుతుందిరా
పొలమారిపోయిన పాలమూరు జిల్లా పస్తులుండబట్టెరా ॥తెలంగాణ॥

పోరాటాలకు పురిటి గడ్డయిన పోతుగడ్డ అదిరా
ఫ్లొరైడ్ రోగమొచ్చి నేడది సచ్చుబడె సూడరా
సావు కేకలకు ఖిల అయినాది నల్లగొండ జిల్లారా ॥తెలంగాణ॥

కొండ కోనల్లోన పిట్టగూళ్ళోలే - ఆదివాసిఇండ్లురా
తిండి గింజలేక ఆకు అలముతోనే - పొట్టనింపుతున్నరా
డయ్యేరియా వ్యాధొచ్చి అదిలాబాద్ అంతా-అలమటిస్తు ఉందిరా
॥తెలంగాణ॥

మందు ఫ్యాక్టరీల వ్యర్థ జలముతోన-మట్టిమలిన మాయేరా
సింగూరు మంజీర నీళ్ళుగూడ - దూప దీర్చకపాయెరా
విషపు నీళ్ళుదాగ మెదకు జిల్లా అంతా - మరణమవుతుందిరా ॥తెలంగాణ॥

చిల్లిగవ్వ లేక పొట్టకూటి కొరకు - ఇల్లు వాకిలిడ్సిరా
అరబు దేశాలకే వొలసవోయి వాళ్ళు - శవాలవుతున్నరా
నిజాంబాద్ జిల్లా పల్లె పల్లెలోనా - చీకటలుముకున్నదా ॥తెలంగాణ॥

బొగ్గు బావులలో నుసులు అయ్యి వాళ్ళు - వెలుగులయ్యినొల్లురా
నీళ్ళ పేరు మీద గోండు జనాలకే - గోతి దొవ్వినారురా
ఖమ్మం జిల్లా అంతాకన్నీటి దారతో - ఏర్లు అయి పారేరా ॥తెలంగాణ॥

చార్‌మినారు గోలుకొండల రూపకర్తలాలురా
సొంతగడ్డ మీద పరాయోలయి బతుకులీడుస్తున్నరా
హైద్రాబాద్ నేడు ఆంద్రోలకు అడ్డ ఆయే సూడరా ॥తెలంగాణ॥

మల్టినేషన్ కంపనీలు వొచ్చి కూలి కొలువు గూల్చెరా
అడ్డ మీద గూడ దుడ్డు రాలేక బ్రతుకు భారమాయేరా
రింగు రోడు పేర రంగారెడ్డి అంతా దోపిడయి పాయెరా ॥తెలంగాణ॥

నగ్సల్బరి ఆనాగలేసుకోని దుక్కి దున్నినోల్లురా
గడీలలో వాల్లు గెరిల్లాలై గదిమి తరిమినోల్లురా
ఆంధ్ర పాలనతో కరీంనగరంత అల్లకొల్లమాయేరా ॥తెలంగాణ॥

సమ్మక్క ఆ సారలమ్మల పోరుగడ్డ అదిరా
కాకతీయుల కుతికపైన వాలు కత్తి దూసినొల్లురా
ఓరుగల్లు జిల్లా పోరుజేయమంటు పిలుపునియ్యబట్టెరా ॥తెలంగాణ॥

# తేడా లేనిదెక్కడ?

- సుద్దాల అశోక్ తేజ

ఏమిర పిలగ ఇక్కడ - ఏరా అబ్బాయి అక్కడ
అంగీ అంటరిక్కడ - చొక్కా అంటరక్కడ

గోకరకాయ ఇక్కడ - గోరుచిక్కుడు అక్కడ
ఆలుగడ్డ ఇక్కడ - బంగాళదుంప అక్కడ
తేడా లేనిదెక్కడ లగడపాటి రాజిగ
తేడా లేనిదెక్కడ - మీసంలేని రోశయ్యా

బొగ్గు గనులు ఇక్కడ - కరెంటు వెలుగులు అక్కడ
పులిచింతల ఇక్కడ - మూడవ పంట అక్కడ
పోలేపల్లిలు ఇక్కడ - యిడుపులపాయలు అక్కడ

తేడా లేనిదెక్కడ వైయస్ జగనయ్యా
తేడా లేనిదెక్కడ కొడిదెల చిరంజీవిగా
తేడా లేనిదెక్కడ సిపియం రాఘువా

గద్దరన్న ఇక్కడ - ఘంటసాల అక్కడ
రేలా దూల ఇక్కడ - రింగ రింగ అక్కడ
పురుగుల బువ్వ ఇక్కడ - పెరుగన్నం అక్కడ

తేడా లేనిదెక్కడ నన్నపనేని రాజకుమారి
తేడా లేనిదెక్కడ మంచు మోహన్‌బాబు

నదులు పారేదిక్కడ - పంటలు పండేదక్కడ
ప్రైవేటు కాలేజీలు ఇక్కడ - ఎయిడెడ్ కాలేజీలు అక్కడ
ఆకలి చావులు ఇక్కడ - అన్నపు రాశులు అక్కడ
తెలంగాణ ఇక్కడ - సమైక్యాంధ్ర అక్కడ

తేడా లేనిదెక్కడ దేవునేని ఉమా
తేడా లేనిదెక్కడ మీసంలేని రోశయ్యా

# తేమ లేని తెలంగాణ

- కోదారి శ్రీను

కొ: అమ్మా .......... ఆకలైతుంది
అమ్మా......... బుక్కెడంత బువ్వ పెట్టు

త: కొడుకా నేనెట్ల జెప్పుదు
బిడ్డా - నే ఎట్ల జెప్పుదు
గాసం ఒడిసిపాయె దమ్మిడి లేదాయే ॥2॥
గటుక పోద్దామన్నా మక్కజొన్న లేవాయే ॥బిడ్డా॥

కొ: ఆమ్మా.. అయ్య కానరాడేమే
అమ్మా... యాడికెల్లిండో చెప్పు

త: కొడుకా ...... నే ఎట్ల జెప్పుదు
బిడ్డా ..... నెనెట్లా జెప్పుదు
అప్పుడొచ్చి మెట్ట పంటలు పెట్టితె ॥2॥

అసలేరు కార్తయిన అనసినుకు లేదు
బిడ్డా .... అయ్య పట్నం మేలిండు
కొడుకా రిక్ష తొక్కపోయిండు.

కొ: అమ్మా ..... బర్రె తలుగులేదేమే
అమ్మా గుంజ కాలిగుందేమే

త: బిడ్డా .. నేనెట్ల జెప్పుదు
కొడుకా ... నే ఎట్ల జెప్పుదు

కంచే బీడులన్నీ బండబారిపాయే
నసుక బుట్ట సుక్క నీళ్ళు లేకపాయే ॥2॥

కొడుకా........పాడి ఎట్ల పెంచుదు
బిడ్డా...పాడి ఎట్ల సాదుదు

కొ: అమ్మా....పాలకుడిశె చెట్టు జూడు
తల్లీ .. కొమ్మ లెండి పోతున్నాయి

త: బిడ్డా ..నేనెట్ల జెప్పుదు
కొడుకా ... నే ఎట్ల జెప్పుదు
పూత పూసీ కాత కాసేటి సెట్లన్నీ ॥2॥

ఎండ దగడుకు సెట్టు ఏర్లు ఎండిపాయే
కొడుకా .. సెట్టు వాడ్పు చూపింది
బిడ్డా ...నిలువ నీడ లేదాయే ॥బిడ్డా॥

కొ: అమ్మా....మొలుక పిట్ట పలుకదే
తల్లీ బుడుబుంగా గుంపేది

త: బిడ్డా ..నేనెట్ల జెప్పుదు
కొడుకా ... నే ఎట్ల జెప్పుదు
పచ్చగుండె అడవి కొరివిగా మారింది
సెరువుకుంటాలన్నీ నెర్రె పంటెండితే
ఆంధ్రకు పక్షులు వలస పోయినాయి

బిడ్డా ... ప్రాజెక్టుల నీరంతా
కొడుకా ... ఆంధ్రకందెను కాదా

కొ: ఆమ్మా ....ఎర్రబోళ్ళ మీదా జూడు
తల్లీ........ కొర్రె గుంపులు అరుపులు ॥బిడ్డా॥

త: కొడుకా నీకు ఎట్లని జెప్ప - బిడ్డా నీకు ఏమి జెప్ప
గొర్రె మేసే మేత మచ్చుకు లేదాయే ॥2॥

బలుసు తుప్ప మంగ చెట్టు ఎండిపాయే
బిడ్డా - కరుకు వచ్చింది కదరా
ప్రాజెక్టు కాలువల పంట భూములన్నీ
ఆంధ్రవాల్లు అలుమకున్నారురా
కొడుకా ఏడ పోయిన సూడు - బిడ్డ ఏడికెల్లిన సూడు
ఆంధ్రపాలెగాల్లు గద్దెనెక్కిన నుండి
ఏది గిట్టకుంటా మోసము జేసింద్రు
కొడుకా డోఖా తిన్నాము మనము
ఎరుపు ఎక్కిన గడ్డ పోరాటాల గడ్డ
నేటికి మన గడ్డ నెత్తురారని గడ్డ
తెలంగాణ బిడ్డ ఉద్యమించలేరా!

కొ: అమ్మా అర్థమైంది మోసం
తెద్దాం జన తెలంగాణము ॥2॥

# ధూల అంటు దుంకరో

- ఉప్పెన

ధూల ....అంటు దుంకరో....తమ్ముడా....
ధూం...ధాం....చేయవే...చెల్లెలా నా చెల్లెలా....
గొల్లదోతి కట్టుకోని గొంగడి భుజానేసుకోని
తెలంగాణా పోరు కండ అరుణోదయ జెండలెత్తి.... ॥ధూల॥

తెలంగాణ ఆకలి కేకలనే పాటలుగా
అల్లుకోని పాడుకుంటు చిందేసి ఆడుకుంటు
దప్పు సంక నేసుకోని చిటికె చిర్ర చేతబట్టి
డప్పు మీద నిప్పుల ధరువులను వేసుకుంటు... ॥ధూల॥

మా ఆట పాటలను ఎక్కిరిస్తే వూరుకోము
మా అవ్వే మాకు ముద్దు మా బువ్వే మాకు ఇష్టం
తెలంగాణా ఆటలను తెలంగాణ పాటలను
గంతేసి ఆడుకుంటు గొంతు ఎత్తి పాడుకుంటు ॥ధూల॥

కొమరం భీము తుఢుం దెబ్బలై మోగి
తెలంగాణా సాయుధ పోరు తుపాకులై పేలి
అమరుల ఆశయాల జెండలెత్తి దండుకట్టి
తెలంగాణా సాధనకు త్యాగాలకు సిద్ధపడి.... ॥ధూల॥

ఉద్యమంలో ఒరుగుతున్న వీరులపై ఒట్టేసి
తెలంగాణా వచ్చె దాక లడాయిని ఆపమని
ఉర్ములై ఉర్ముకుంటు మెరుపులై మెర్పుకుంటు
తెలంగాణా ఉద్యమంలో ఉప్పెనోలె ఉరకలేస్తు.... ॥ధూల॥

# నా తల్లి తెలంగాణ

- నలిగంటి శరత్

నా తల్లి తెలంగాణ ఉయ్యాలో ఉయ్యాలో
పుల్లడిల్లి పోతుందమ్మ ,,
తల్లడిల్లి పోతుందమ్మ తాడో పేడో తేల్చమన్నది ॥నా తల్లి॥

ఈ తొవ్వ పొడుగున ,,
రక్తపు మడుగులాయె ,,
పుట్లకొద్దీ బలగాలమ్మ ,,
యుద్ధంతో ఈ నేలంత ,,
దద్దరిల్లి పోయిందమ్మ ,,
లాఠీలు తూటాలతో ,,
రణరంగం జేసిండ్లమ్మ ,,
రాపిడ్ ఫోర్సులు దించిండ్లమ్మ - రావణ కాష్టం జేసిండ్లమ్మ ॥నా తల్లి॥

తెలంగాణ అడిగినందుకు ఉయ్యాలో ఉయ్యాలా
నక్సలైట్లన్నరమ్మ ,,
అసాంఘిక శక్తులని ,,
అన్యాయంగ గొట్టిండ్లమ్మ ,,
ఒకన్ని పదిమందేసి ,,
బంతాట ఆడిండ్లమ్మ ,,
పాములాను సంపినట్లు ,,
పండేసి సంపిండ్లమ్మ ఉయ్యాలో ఉయ్యాలా
మేమున్న క్యాంపసంతా ,,
పోలీసు క్యాంపులాయె ,,

పొద్దున్నేమో ఫైరింగంటండ్లు ,,
రాతిరైతే రైడింగంటండ్లు ,, ॥నా తల్లి॥

ఆంధ్ర అబ్బాయిలంత ఉయ్యాలో ఉయ్యాలా
డాక్టర్లు యాక్టర్లాయే ,,
మా ఊరు పోరగాండ్లు ,,
కూలీలు క్లీనర్లాయే ,,
సావలేక బతుకులేక ,,
పోరురాగమైయిండ్లమ్మ ,,
ఉద్యోగాలు లేక యువత ,,
ఉద్యమం బాటబట్టిండ్లు ,,
నూనూగు మీసాలు మొలవకముందే
నూరు వసంతాల వీరులైపోతుండ్లు ॥నా తల్లి॥

నలభై ఏండ్లు నుండి తల్లి ఉయ్యాలో ఉయ్యాలా
కొడుకులను పోగొట్టుకుంటుంది ,,
కన్నీటి ఊటలన్ని ,,
కడుపులోన దాసుకుంటుంది ,,
కడుపులోన దాసుకుంటుంది ,,
గుండెలోని బాధలన్ని ,,
గొంతులోన దాసుకుంటుంది ,,
సలుపుతున్న గాయాలను – గేయాల్లే పాడుతున్నది ॥నా తల్లి॥

బానిస సంకేళ్ళు ఉయ్యాలో ఉయ్యాలా
తెంచమంటున్నదమ్మ ,,
ఉస్మానియా క్యాంపస్‌లో ,,
ఉద్యమం ఊపందుకుంది ,,
వీరుల త్యాగాలతో ,,
ఉప్పెనై పొంగుతున్నది ,,
విద్యార్థులు మేధావులంత ,,
ఉస్కబోస్తె రాలకుంటచ్చిండ్లు ,,
తెలంగాణ తెచ్చెటందుకు ,,
అగ్గి రాజేస్తున్నారమ్మ బగ్గున మంటయై మండుతున్నరు ॥నా తల్లి॥

కాకతీయ క్యాంపస్‌లో ఉయ్యాలో ఉయ్యాలా
కన్నెర్ర జేస్తున్నారే ,,
ఓరుగల్లు పోరుసంత ,,
ఓరుగల్లు పోరుసంత ,,
దాసుకున్న మాటలన్ని ,,
పోరాట పాటలు జేసి ,,
కత్తుల వంతెన మీద ,,
కవాతు జేస్తుండ్లమ్మ ,,
కవాతు జేస్తుండ్లమ్మా - కత్తులు నూరుతున్నరమ్మా

# నా తల్లి తెలంగాణ

- గద్దర్

నా తల్లి తెలంగాణరా
తిరగబడ్డ వీణ రా

తెలంగాణములో బడులే లేవు
ఉన్న బడులకు భవంతుల్లేవు
వానకాలము  ఎండకాలము
వారం రోజులు సెలవు దినాలే
సెట్టు కింద మా పోరగాల్లురా

నీడ దిరిగినట్లు తిరుగుతుంటరూ
పోరలు వొస్తే పంతులు రాడు
పంతులు వొస్తె పోరలు రారు
పోరలు పంతులు ఇద్దరు వొస్తే
రాయనీకి మా పంతులుగానికి
చాకిపీసులేదో మాయన్నల్లారా ॥నా తల్లి॥

లెక లేక లోకయ్య వొక్కడూ
చదువక చదువక చదివి వెలిగితే
రాక రాక ఒక కొలువే వొస్తే
తెలంగాణ ఆఫిసరోనికి
తెలుగురాదని తెలివి లేదని
పడుతూ, లేస్తూ ప్రమోషనిచ్చి
రెటైర్డు చేసింగ్రో మా యన్నల్లారా ॥నా తల్లి॥

ఐ.ఎ.ఎస్ లు, ఐ.పి.ఎస్ లు
అందని మిఠాయి చందమామలే
మేనేజర్లు డైరెక్టర్లూ
వైస్ ఛాన్సలర్ ప్రిన్స్‌పాల్లు
ఆకరికి ఆ క్లర్కు కొలువులు
తెలంగాణలో పుట్టి నోనికి
వొట్టి సేతులే చూపినాయి
మిగిలిందొక్కటే చీపురు కొలువు
ఆ చీపురు కొలువుకు
తోటి ఆంధ్రుడు పోటి కొచ్చినా
తెలంగాణ మా గాణ మందున

సాగునీరు లేదు తాగు నీరు లేదు
సచ్చే తల్లికి తుల్సి తీర్థముకు
సర్వలో చెంచెడు నీల్లే లేవూ
జీవంబోయె తెలంగాణకు
జీవ గంజీ లేదో మాయన్నల్లారా ॥నా తల్లి॥

గంతులేసే గోదావరి తల్లిని
గొంతు తడ్పుమని బతిమిలాడినం
కిలకిల నవ్వే క్రిష్ణా నదిని
కనికరించుమని కాల్లు మొక్కినాం

నీల్లు లేక మా పంట పొలాలు
పట్టున పలిగి పుట్టె డేడ్చినమ్
గొడ్డురాలు మా బీడు భూములకు
బిడ్డె బుట్టలేదో మాయన్నల్లారా ॥నా తల్లి॥

నందికొండల గుండెలనడుమా
తల్లి క్రిష్ణకు కట్టకట్టితే
లక్షలాది తెలంగాణ పల్లెలు
క్రిష్ణా నదిలో క్రిష్ణార్పనము
నోరులేని కోట్లాది జీవులు
కాల్లు సేతులు గిలగిల గొట్టుక
తల్లికి పిల్లా, పిల్లకు తల్లి
పాసిపోయినాయో మాయన్నల్లారా ॥నా తల్లి॥

పుట్టి పెరిగిన పూరిగుడిసెలు
దేవుని గుల్లు, మసీదు, బల్లు
తాతల నాటి తీపి గుర్తులు
నీటి మట్టములో మునిగి పోయినయ్
ప్రాజెక్టేమో తెలంగాణములో
నీల్లు పారుతయ్ కోస్త ఆంధ్రలో
సాగర్ తల్లి ఎడమ కాలువ
తెలంగాణకు ఏమి ఇచ్చినది

ఎడమ కాలువ తెలంగాణకు
ఎడమ చెయ్యి చూపే మాయన్నాల్లారా ॥నా తల్లి॥

అదిగో సూడూ ఇదిగో సూడూ
తెలంగాణకూ అన్నం బెట్టే
పోచంపాడూ పొంగి వొచ్చెనవి
శంఖుస్థాపనతో శంఖు పాడినరు
ఏడ్సెకన్నును తూడ్సె కన్నులా
ఏడి గొంగడి ఆడనే ఉంది
పోచం పాడు తెలంగాణకు
బీడు భూములిచ్చే మాయన్నల్లారా ॥నా తల్లి॥

సచ్చేముందు బిచ్చమేస్తనని
ఇచ్చింపల్లి ప్రాజెక్టు వచ్చే పోలవరం నీడ పీడనీడయై
ఇచ్చంపల్లి పచ్చులబడ్డది
ఆకలి చావుల పాలమూరుకు
శోకమే మిగిలిందో మాయన్నల్లారా ॥నా తల్లి॥

రాజుల కాలం నాడు గట్టిన
చెఱువులు కుంటలు గండిబడ్డయి
హుస్సేన్ సాగర్, మూసీసాగర్
రామప్ప చెరువు చెరువు కుంటలు
పూడిక తియ్యక పూడిపోయినయ్

కరెంటు లేక బోరు బావుల
నోరు ఎండిపోయే మాయన్నల్లారా ॥నా తల్లి॥

చిన్న పరిశ్రమకు పెద్ద పరిశ్రమకు
కడ్పునిండుగ బొగ్గువున్నది
తాగినంత మరి నీరు ఉంది
సెమట ఒడ్సె శ్రమ జీవులున్నరు
అన్ని ఉన్నమన తెలంగాణలో
కంపినీలు ఎన్నీ మాయన్నల్లారా ॥నా తల్లి॥

పొద్దుగల్లెనె దర్శనమైతది
దిన పత్రిక మన ఇంటి ముంగట
పత్రికలల్లో ఎవ్వరు రాస్తరో
ఎట్ల రాస్తరో ఏమి రాస్తరో
అచ్చుం తెలుగని అందరంటరూ
ఈసమంత మా బాస ఉండదూ
సదువ బోతే మానోరు తిరగదూ
సదువ బోతే మానోరు తిరగదూ
సదివిందన్న బుర్రకెక్కదూ
మా బాస బోయినది బత్కుపోయినది
బాధలె మిగిలినయో మాయన్నల్లారా ॥నా తల్లి॥

పల్లెలో దొరలు కోస్త దొరలను
కల్పుకున్నరు మలుపుకున్నరు
అమెరిక జపాన్ అప్పులు తెచ్చి
తెలంగానములో గుప్పరిచ్చినరు
ఐ.ఎంఎఫ్, వరల్డ్ బ్యాంకు కు
తెలంగాణ తాకట్టు బెట్టినరు
మిల్ట్రీ, పోలీస్ పంజాబ్ కమాండోల
పల్లె పల్లెలో క్యాంపు బెట్టినరు
అందుకోసమె తెలంగాణ
ప్రజలనంత ముందుకు కదిలిస్తం అన్నలారా ॥నా తల్లి॥

# నా తెలంగాణ

- గద్దర్

నన్ను కన్న నాకన్న తల్లిరో తెలంగాణా!
నాకు జన్మనిచ్చిన జన్మభూమిరా తెలంగాణా!
అరె శాతవాహనులు చాణుక్యులు
మొగలు రాజుల నిజాంషాహియా
ఆఖరి వాడునిజాం రాజురా !....

ఎవ్వడేలినా ఎవ్వడేలినా ఎవ్వడేనినా ఎవ్వడు ఉన్న
ఒక్కడొక్కడు మహా హంతకులు ....
అరెరెరెరె ... ఎవ్వడేలనా తెలంగాణకు
బువ్వ దొరకలేదో ! మాయన్నా ॥నన్ను కన్న॥

అరె పోలీసు పటేల్‌గాడు నిజాం దొరగాడు
మాలీస్ పటేల్‌గాడు నిజాం దొరగాడు
కల్తి రాతగాడు కర్ణంగాడు .....
నైజాంవోని సొల్లు తాగిన ముగ్గురు దొంగలురో .... ॥నన్ను కన్న॥

అరెరెరెరెహ! అల్లన అడుముని పోరాటానికి
అంకితమైన సుందరయ్యలు, రాజేశ్వర్లు
ఎఱ్రజెండాను ఏట్లో ముంచినరు
నెహ్రూ కాళ్ళకు దండం బెట్టి....
ఎట్టి జీవి ఈ తెలంగాణకు బుట్టి చూపినారు ॥నన్ను కన్న॥

అరెరెరెరెహ! చింత చిగురు వట్టి చాపలు
ఉల్లిపాయ వేసి వండితే
ఎంత కమ్మగుంటదమ్మో తెలంగాణా ! ॥నన్ను కన్న॥

అరె తెలంగాణ పల్లె లోపల
పోరగాళ్ళకు బడులే లేవు
బడులు వుంటే భవంతి లేదు
ఎండ కాలముచెట్టు కింద
నీడ తిరిగినట్లు తిరుగుతరు.... ॥నన్ను కన్న॥

పోరలు ఉంటే పంతులు రారు
పంతులు ఉంటే పోరలు రారు
పోరలు పంతులు ఇద్దరు వస్తే హ!
రాయనీకి మా పంతులుగానికి చాకుపీసు లేదో! ॥నన్ను కన్న॥

అరెరెరెహ ! అరే తెలంగాణలో నల్లగొండరా
నల్లగొండరా ఎర్రమల్లెరా
రజాకార్లతో రణం చేసిన
నల్లగొండరా ఎర్రగొండరా!రజాకార్లతో రణం చేసి
మూడు వేల మంది రైతులందరు
ప్రాణమిచ్చిన నల్లగొండరా!
ఆ నల్లగొండ మరి నందికొండలో
నాగార్జున సాగరము వుందిరా

అరెరెరెరెహ ! ఎడమకాలువ
నాగార్జున సాగర్ ఎడమ కాలువ

తెలంగాణకు ఎడమచెయ్యి చూపె.... ॥నన్ను కన్న॥
నల్లగొండరా నల్లగొండరా
నల్లగొండ మరి పేరు వింటెరా
నైజాం వోనికి పైజామూడెను
రజాకార్లతో రణం చేసిన నల్లగొండరా ఎర్రగొండరా!
ఎర్రమల్లెల కన్నజిల్లా నల్లగొండమ్మో.... ॥నన్ను కన్న॥

అరె పొద్దుగల్లనే పత్రికలొస్తే
ఏమి రాస్తడో ఎవడు రాస్తడో ఎట్ల రాస్తడో... ॥2॥
అచ్చము తెలుగు అని వాళ్ళు అంటరు
అందులోన మా బాస ఉండదు యాస ఉండదు ॥2॥
చదవబోతె మా నోరు తిరగదు
చదివిందన్న అర్థము కాదు.... ॥2॥
బొమ్మలు ఒక్కటె అర్థమైతవి అమ్మతోడు బాబో... ॥నన్ను కన్న॥

నిజాంబాదురా నిజాంబాదురా
అది నిప్పులున్న మాజిల్లారా
అది అడవులున్న మా జిల్లారా
నిజాం సాగర్ ఉన్న మా జిల్లారా
వీరులగన్న జిల్లారా

మా చెమట సెంటులా పోసిరా!
మేము చెఱకు తీపి చేస్తాముర!
చక్కెర ఫ్యాక్టరీలు ఆగినా
సక్కెర బెల్లమై తాగినా !

నిజాం సాగర్ నిండితె
మా నిజామాబాదుకు పండుగ
పూడిక తియ్యక నిజాంసాగర్ పూడిపోయిందిరో ॥నన్ను కన్న॥

అరెరెరెరెహ! గోదారమ్మ పరుగులు చూడు
గల గల పారు నా శృతిలోన
గోదారమ్మ పుట్టి పెరుగుతూ ఆడుకుంటరా
అడవి లోపల పాడుకుంటరా !
మా తెలంగాణలో పారుతుంటది
వేములాడ రాజన్న కేమొరా వంగి దండం పెట్టుతుంటది
భద్రాద్రి రామన్న కేమొరా బతుకనంత మరి ఇచ్చుకుంటది
ఆపుకోమని దండం బెడితే గోదారమ్మ కాలును చెడితె,
ఆపుకోమని ముందుకొచ్చిన పేరు మాత్రం పోచంపాడు
పోచంపాడు పొల్లులు అయినాది రామసాగర్ పేరు వచ్చినది హ!
పోచంపాడు తెలంగాణకు బీడు భూమి ఇచ్చే.... ॥నన్ను కన్న॥

అరెరెరెరెహ! మమ్ము కన్న నా కన్న తల్లిరా
అరె చిన్ననాడు మేము చిర్రగోనె ఆడుతుంటె మరి చూడలేదా!

గిల్లి దండము కొట్టుతుండె మేము గల్లిలోన మరి క్యాచీపడుతము హ !
క్రికెట్ వచ్చి గిల్లి దండను గెట్ అవుట్ అన్నదో ....
తెలంగాణ మరి తెచ్చేదాకా
నెత్తురు బొట్టు పెట్టుకొన్నడు
మామగాని పేరు పెట్టుకుని
రంగారెడ్డి జిల్ల కొన్నడు
అమరవీరుల బొందల మీద
బాస చేసి మరి ఒట్టులు పెట్టుకుని హ!
తెలంగాణ మరి తెస్తనని
చెన్నారెడ్డి గాడు తెలంగాణకు తెడ్డు చూపించినాడో .... ॥నన్ను కన్న॥

బావులున్నవి చెఱువులున్నవి
కుంటలున్నవి నిజాంసాగర్
హుసేన్‌సాగర్ గండిపేట చెఱువులున్నవి
వేల కొద్ది మరి బావులనున్నవి హ !
కరెంటు లేక బోరుబావుల నోరు ఎండిపాయె...
లేక లేక లోకయ్య ఒక్కడు
సదువక సదువక పెద్దగ సదివితే
రాక రాక వానికి కొలువు వచ్చితే
తెలంగాణ ఆఫీసరు గానికి
తెలుగు రాదని తెలివి లేదని హ!
గెజిటెడ్ ఆఫీసర్ ప్రమోషన్ ఇచ్చి రిటైర్డ్ చేసిండో .... ॥నన్ను కన్న॥

మన్ను తెచ్చి నాన పోసి
పిండి పిసికినట్లు పిసికి
కండలు అన్నీ చించుకుని
కుండలూ కూజాలూ చేసి
వాము పెట్టి కోట్టు పెట్టి
వండుకోనికి కుండ లేదు హ !
ప్లాస్టిక్ బకెటు బువ్వకుండను బూడిదలోకి బందో ... ॥నన్ను కన్న॥

పుల్ల మామిడి వింటేనే
నోటి లోపల నీళ్ళు ఊరతాయి
రోటిలేసి మరి దంచితే మిరపకాయ
వేసి దంచితే పుల్లగ మరి నోరు ఊరదు
మామిడి పచ్చడి మామిడి పచ్చడిని పట్టుకొంటిం ॥నన్ను కన్న॥

జిల్లర ఆది జిల్లరా
కరీంనగర్ కత్తులురా
కత్తులు నూరిన జిల్లరా
అది సింగరేణి బొగ్గురా
సింహాల పిల్లల జిల్లరా
గోదారి వడ్డున పిల్లడు...
గొడ్డలు నూరిన జిల్లరా
అది కరీంనగర్ భలే కరీంనగర్ కత్తుల కోలాటమాడిన జిల్లా
వేముడాల రాజన్నా పుట్టిన జిల్లరో.... ॥నన్ను కన్న॥

ఐ.ఎ.ఎస్‌లు, ఐ.పి.ఎస్‌లు అల్లాగాడుకు దేవుని తెలుసు
ప్రిన్సిపాలు మేనేజర్లు
డైరెక్టర్లు ఎవనికి వచ్చే
అరె రాకరాక మరి రాకరాక చెప్రాసి కొలువు
మరి మావోనికి రానే వస్తే
ఆ చీపురు కొలువుకు తోటి ఆంధ్రుడు పోటీకొచ్చినాడు ॥నన్ను కన్న॥

అరె ఓరుగల్లు పోరుగల్లురా
వేయ్యి స్తంభాల మంటపంలోన
నెత్తురు కొట్టి మంట వేసినాము
దుకుడులు కట్టిన రామప్ప చెఋవులోన
మేము దుముకులాడినం ఈత కొట్టినం
మానేరు ఏరులోన మేము ఆడుకున్నము పాడుకున్నము
అరె దొడ్డి కొమరన్న పుట్టిన ఓరుగల్లురా
ఐలమ్మ సమ్మక్క సారాలమ్మ ఓరుగల్లమ్మో..... ॥నన్ను కన్న॥

ఆ జిల్లా మెదక్ నేను పుట్టినట్టి జిల్లా
నాకుమెతుకులిచ్చే జిల్లా
మాయమ్మ నేను కలువ పోయినాము
నేను నాట్లు వేసినాను
అరె మెతుకు జిల్లరా మెదక్ జిల్లారా....
మెతుకులేని జిల్ల నాది మెదక్ జిల్లమ్మో.... ॥నన్ను కన్న॥

అరె అదిగో చూడు అదిగో చూడు
నెత్తురుగంటను ఎత్తుకున్నది
కొత్తగూడెము కత్తినూరిన ఖమ్మం మెట్టు
భద్రాచలము ఒడ్డుల మేను
సీతమ్మను ఎత్తుకున్నది
అల్లనాడు మన తెలంగాణలో
ఆశ్రయమిచ్చి ఖమ్మం మెట్టు కమ్మం మెట్టు
అమ్మతోడురా ! ఎంత తియ్యగా ఖమ్మం జిల్లా..... ॥నన్ను కన్న॥

నైజాంవోని పేరు నీకు తెలుసుకదమ్మా
ఆడ చార్‌మినార్ ఉంది
ఆడ గండిపేట ఉంది
ఆడ హుసేన్ సాగర్ ఉంది
అలనాడు నైజామోడు
మన రక్తమంత పిండి
ఆ పంచములో నేరా
వాడు డబ్బు ఉన్నవాడు
దేవిడీలు కట్టుకుండు
ఆట ఆడినాడు
మన దేశము ఏలినాడు
భూస్వాములు
వాని సొల్లు తాగినారు

హైద్రాబాద్ సికింద్రాబాదు
ఇప్పుడు చూస్తే చార్‌మినార్
చిన్నబోయినది గండిపేట
గుటుక్కుమన్నది
ఫ్యాక్టరీ నీళ్ళతో హుస్సేన్‌సాగర్ ముక్కు మూసిపాయె ॥నన్ను కన్న॥

అరెరెరెరె హ! అది పాలమూరు జిల్లా
అది నీళ్ళు లేని జిల్లా
అటు సాగునీరు లేదు
అటు తాగు నీరు లేదు
నూటికి తొమ్మిది మంది
వాళ్ళు తట్టలెత్తుతారు
వాళ్ళు మట్టిమోస్తారు
అది పాలమూరి జిల్లా
మహబూబ్‌నగర్ జిల్లా
తమ రక్తమంత పోసి
ప్రాజెక్టు కట్టినారు
వాళ్ళు నీరు తాగినారు హ !
తమ జిల్లా పేరు మీద
కుట్రకి ప్రతి పల్లె నిలిపినారు
సాగర్ డాము కట్టి, వాళ్ళు సచ్చిపోయినారు
అరె దేశదేశములో పల్లె పల్లెలో ప్రపంచంలో

ప్రాజెక్టులను కట్టినవాడు పాలమూరు
మన మహబూబ్‌నగర్ జిల్లా వాడు హ !
తన జిల్లా పేరును నెత్తురుతోనే మార్పు చేసినాడో ... ॥నన్ను కన్న॥

ఆ ఆదిలాబాదు జిల్లా అది అడవులున్న జిల్లా
అది ఆడుకునే జిల్లా అది గోండులున్న జిల్లా
అది గొడ్డల్లు ఎత్తిన జిల్లా గోదారి నదిలో వాళ్ళు
కొమరం భీముని కన్న జిల్లా మా ఆదిలబాదమ్మో ... ॥నన్ను కన్న॥

ఇట్టి జిల్లాలోన అరె అట్టి జిల్లాలోన
ఆ చెన్నారెడ్డిగాడు మరి ఏమి ఇచ్చినాడు
వాడు తెలంగాణ వాడే
వాడు మంత్రి అయినంక
మన జగిత్యాల చూడు
కరీంనగర్ జిల్లా చూడు
పోలీసు క్యాంపు పెట్టి.... ॥2॥

ఒరె సాకలొల్ల సాయన్నఒరె మంగలోల్ల మల్లన్న
ఒరె కురుమొల్ల కొమరన్న ఒరె గొల్లోల్ల రామన్న
అరె గొల్లోడు మా గొల్లోడు మన పేరు వింటే
మీకు గమ్మత్తు ఉంటుంది గోసి కట్టుకొని

గోసి లోపట మల్లెపూవ్వు తీస్తాడు
వాడు అడవి అడవి తిరిగేను
వాడు మందపెట్టేసి చూసి ఏ గొర్రె
ఏది చెప్పుతాడు, వాని తెలివి వింటేరా హ!
టర్రటర్రట అంటే
మొండి గొర్రె కూడా గొల్లోనికి దండం పెడుతుందో..  ॥నన్ను కన్న॥

అరెరెరెహ ! మా సాకలి తిప్పడు చూడు
మా సాకలి లచ్చక్క యేమో
వీపు మీద మూట పెట్టుకొని
నీ బాంచన్ దొర అనుకుంట
మరి ఒట్టు పెట్టినట్టు చెప్పు హ !
సాకిరేవుకి మా సాకలి తల్లికి మమత ప్రేమ ఉందో ...  ॥నన్ను కన్న॥

నిజాంబాదు మరి జిల్లాలో ఏ పల్లెలో
నువ్వు ఎల్లిసూడు అక్కడ
ఆ చెఋకు తీపిలో ఉన్నదంటారు
ఎంత తీపి ఉంటదమ్మో కంపుసెమటమ్మో......  ॥నన్ను కన్న॥

ఈ జిల్లారా నిజాంబాదురా ఈ పల్లెలో
మా సెల్లెలు మా అక్కలు
అరె తునికి ఆకు తెస్తారు
కత్తెర పట్టుకుంటారు

లేతాకు కత్తిరించి వాళ్ళు
అందునా పోవ్వాకు వేసి
దారంతో దాని మరి చుట్టి
దాని మూతి మూయనికి పోతె
ఎమని సిగరేటోడు కన్నుగొట్ట సాగె హ!
అక్కలు చెల్లెలు ఇక్కడ బీడిలో పోవ్వాకై కాలిపోతారో ॥నన్ను కన్న॥

మాకుమ్మరోన్ని గాని సూడు
వాడు గోసి పెట్టుకుంటాడు
వాడు కట్టె పట్టుకుంటాడు
అరె చక్రముతో గిర గిర తిప్పి
దాని మట్టిని తీసుకొచ్చి
దేవున్ని వాడు చేస్తాడు
వినాయకుని వాడు చేసి
గుడిలోన వాడు పెడతాడు
అరె దేవుని సూడవాడు పోతే
మరి గంటకొట్టె ఆ బాపన కొడుకు గెటౌట్ అంటే
కట్టె అందుకొని గంటగానికి గంట కొడతాడు....ఐ ॥నన్ను కన్న॥

అరెరెరెహ ! తెలంగాణ పల్లెలోన
ఓ గ్రామమందు సూడు
అది మాదిగోళ్ళ వాడ

తలుపు ఉంటే తాలమేది
వెయ్యరో దరువెయ్యి
జజ్జనక జన్ అని
ధిమ్‌తక్ ధిమ్‌తక్ అని
ఆకలి పేగుల కత్తితో కోసి
మండే ఎండలో ఎండబెట్టి
డప్పుకేమో తోలుకట్టి
ఆకలి పేగులు కీర్తనలేంది
లోకానికి చెప్పుదాము
వెయ్యరో దరువెయ్యరో.... ॥నన్ను కన్న॥

# నా... తెలంగాణ

- గూడ అంజయ్య

నా తెలంగాణ .. నా తెలంగాణ
నన్నుగన్న నా తల్లి...నా తెలంగాణ
నా తెలంగాణ .. నా తెలంగాణ
నిలువెల్ల గాయాల వీణా ॥నా తెలం॥

సారెడు నీళ్ళ కొరకు
కోసెడు దూరం నడిచి
కడివెడు నీళ్ళ కొరకు
కన్నీరు ధారపోసి
సాగుతాగు నీరు లేక
తల్లడిల్లే తెలంగాణ ॥నా తెలం॥

తైదంబలి తైదరొట్టె
కారం గటుకే కూడు
చింపులంగి అర్ధాకలి
గొంగడి బొంతేతోడు
తరతరాలు తెలంగాణ
దగా పడిన తీరు చూడు ॥నా తెలం॥

మోట బాయి ఊటబోయి
ఏద్దేవుసం మూలబడి
గడ్డీ గాదం లేక
గొడ్డు గోద నమ్ముకొని

బీటలు వారిననేలతో
బీడు పడ్డ తెలంగాణ ॥నా తెలం॥

గోదావరి కృష్ణవేణి
పెనుగంగ ప్రాణహిత
మానేరు మంజీర
నల్లవాగు చలివాగు ॥నా తెలం॥

నదులెన్నోపారుతున్న
మడితడువని తెలంగాణ ॥నా తెలం॥

ఇంటింటా ఒక వీరుడు
ఒరిగిన కథలున్నవి
ఎవడేలిన తెలంగాణకు
ఒరిగిన దేమున్నది
కరువు కాటకాలతోటి
కటకట మంటున్నది ॥నా తెలం॥

కో...అంటే ఓ ...అంటవి
తెలంగాణ పల్లెలు
సై...అంటే సై అంటవి
అణగారిన గుండెలు
తెలంగాణ సాధనకై
పదపద పద పదమన్నవి ॥నా తెలం॥

# నాగేటి చాల్లల్లో నా తెలంగాణ

- నందిని సిధారెడ్డి

నాగేటి చాల్లల్లో నా తెలంగాణ నా తెలంగాణ
నవ్వేటి బతుకులు నా తెలంగాణ నా తెలంగాణ ॥పూసేటి॥
పారేటి నీళ్ళల్ల పానాదులల్ల
పూసేటి పువ్వుల పూనాసలల్ల

కొంగు జాపిన నేల నా తెలంగాణ నా తెలంగాణ
పాలు తాపిన తల్లి నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

తంగేటి పువ్వుల తంబాలమంత
తీరొక్క రంగుల్లు తీరిచిన పువ్వు ॥తీరొక్క॥
తీరొక్క రంగుల్లు తీరిచిన పువ్వు
బంగారు రంగులు బజారులన్ని ॥బంగారు॥

బతుకమ్మ పండుగ నా తెలంగాణ నా తెలంగాణ
బంతిపూల తోట నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

వరద గూడు గడితే వానొచ్చెనంట
బురద పొలము దున్ని మురిసున్నరంత ॥బురద॥
శివుని గుళ్ళో నీల్ల చీమలకు చెక్కరి
వాన కొరకు భజన జడకొప్పు లేసి ॥వాన॥

వాగుల్లో వంకల్లో నా తెలంగాణ నా తెలంగాణ
చూపు రాలిన కండ్లు నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

కొత్త బట్టల కట్టి కోటి ముచ్చట్లు
పాల పిట్టలు జూసి పడుచు చప్పట్లు ॥పాల॥
పాల పిట్టలు జూసి పడుచు చప్పట్లు
జొన్న కర్రల జెండా జోరున్నదేమి ॥జొన్న॥

అలాయి బలాయి తీసి నా తెలంగాణ నా తెలంగాణ
జంబి పంచిన ఆర్తి నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

మోట కొట్టిన రాత్రి మోగీన పాట
తాడు పేనిన తండ్రి తలుపులున్నప్పు ॥తాడు॥
తాడు పేనిన తండ్రి తలుపులున్నప్పు
కల్లమూడ్చిన అవ్వ కలలోని గింజ ॥కల్ల॥

ఆరుగాలం చెమట నా తెలంగాణ నా తెలంగాణ
ఆకలి దప్పుల మంట నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

ఊరుగాచె తల్లీ ఉరిమి సూడంగ
బువ్వలేని తల్లీ బోణ మొండింది ॥బువ్వ॥
బువ్వలేని తల్లీ బోణ మొండింది
సేనుకొచ్చిన పురుగు సెరిగిపోసింది ॥సేను॥

బోణాల పండుగ నా తెలంగాణ నా తెలంగాణ
శివసత్తులాట నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

దట్టి గట్టిన రోజు డప్పు సప్పుళ్ళు
పీరీల గుండంలో పిలగాండ్ల ఆట ॥పీరీల॥
పీరీల గుండంలో పలగాండ్ల ఆట

కుడక పేర్ల మొక్కు కూలీ బతుకూలు ॥కుడక॥
ఆలువాడిన పాట నా తెలంగాణ నా తెలంగాణ
ఆత్మగల్ల చెయ్యి నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

కలిసేటి సేతుల్ల కన్నీటి పాట
సింధోళ్ళ సింధుల్ల చిగురించే నాట్యం ॥సింధోళ్ళ॥
సింధోళ్ళ సింధుల్ల చిగురించే నాట్యం
ఒగ్గు మద్దెల దప్పువాద్య సంగీతం ॥ఒగ్గు॥

కళలకే పుట్టుక నా తెలంగాణ నా తెలంగాణ
పాట గాచిన పట్టు నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

తాడు పేనిన బతుకు తండ్లాట చూడు
మంటలేని కొలిమి బతుకుల్ల మంట ॥మంట॥

నీళ్ళు లేని చెఱువు నిను చూసి నవ్వే
బతికి సెడ్డా బిడ్డ నా తెలంగాణ నా తెలంగాణ
తల్లడిల్లె తల్లీ నా తెలంగాణ నా తెలంగాణ ॥నాగేటి॥

# నా చిన్ని తమ్ముడా......

– జయరాజు

నాచిన్ని తమ్ముడా
నాచిన్ని చెల్లెలా
చదువు సంధ్యలేని సాకిరేవు బండ గాకుర
చిగురు టాకులోనే మోడులాగ మారిపోకురా ॥నా చిన్ని॥

పొద్దు పొడవంగ ముళ్ళుగర్ర చేతబడతు
సద్దిగిన్నేమో సంకలోన దాచుకుంటవు
నీ అన్న తమ్ముడు అక్కచెల్లెలు ఆవులమందేనా
నీ ఆటపాట మాట మంచి చెట్టుపుట్టేనా ॥నా చిన్ని॥

ఎద్దు పొడవంగ వెన్నుపూస తొలిగి పోయెను
ఎనుగు దాటంగ వల్లంత చినిగి పోయెను
నీకాళ్ళలోన ముళ్ళు రాళ్ళు ఎన్నో.....
నీ కడుపుల్లోన ఆకలి మడుగులెన్నో ॥నా చిన్ని॥

పొద్దుమాపేమొ పాలు పెరుగు పిసుకుతుంటవు
సద్దిగిన్నెలోకి సల్లబొట్టు దొరక దంటవు
నీవు కుములుతుంటే కుక్కపిల్ల బావుమన్నది
నీ గోస చూసి పిల్లికూన మ్యావ్ మన్నది ॥నా చిన్ని॥

ఊల్లో పిల్లలంత బల్లోకి వెల్లుతుంటెరా
వాళ్ళ అడుగుచూసి గుడ్లనీళ్ళు కుంకుతుంటివా
నీబాద చూసి బండరాళ్ళె మూగవాయెను
ఆ బారెడున్న ముళ్ళుగర్ర జానెడాయెను ॥నా చిన్ని॥

నాలుగక్షరాలె బతుకులోన వెలుగునింపును
బడికి పోతానంటె చదువులమ్మ వల్లో దాచును
నీకాయలు కాసిన చేతుల్లోనే పలకను పట్టు
నీబతుకున వెలుగులు దిద్దిన తల్లికి దండంబెట్టు ॥నా చిన్ని॥

# నిన్ను విడిచి వుండలేనమ్మా

– భిక్షపతి

నిన్ను వీడి వుండలేనమ్మా .......ఓ పాటమ్మ
ఎన్నడూ మరిచిపోనమ్మో .........నా పాటమ్మ
ప్రతి మదిలోన మెదులుతు వుంటవో పాటమ్మ
నా ఎదలోన పదిలంగుంటవో పాటమ్మ ॥నిన్ను॥

ఉద్యమానికి ఊపిరూదుకుంట గద్దరన్న వెంట ఉరుకుతంటవు
గూడ అంజన్నకు తోడు నీడగుంటు ఊరువాడ మనదంటావు
అందెశ్రీ వొంటినిండ అలుముకొని ఓ పాటమ్మ
వరంగల్లు శ్రీనన్న వెంటబెట్టుకోని ఊరువాడ తిరిగివస్తావు ఓ పాటమ్మ॥నిన్ను॥

ప్రేమ ప్రేమకు మధ్య పెద్దమనిషివై ఇద్దరినీ కలుపుతుంటవు
యుద్ధంలో ఒరిగిన వీరుల్ని ముద్దాడే దాక నిద్దుర పోవమ్మ
అమరవీరుల అమ్మ నాన్నలకు నువ్వు ఓ పాటమ్మ
కన్నబిడ్డలకు కండ్ల ముందు చూపిస్తావు వెన్నెలైనా మళ్ళీ ఉరికిస్తు ఉంటావు ॥నిన్ను॥

దండు నడిపేటోళ్ళతోని అండగా ఉంటావు
ఒరిగిన అమరుల ఆశయాల ఒక్కొక్కటీ గుర్తు చేస్తావో
దండిగా పోరు జేయమని గుండె ధైర్యాన్ని నూరిపోస్తవో ॥నిన్ను॥

నీతోడు ఉంటే ఏ బాధ ఉండదని తెలువనోళ్ళూ కొందరు అసలు
కళాకారులై పుట్టనందుకు కుమిలి పోయేవాళ్ళు ఎందరో
ఎంత కాటకుడైనా బాతురూముల
నిన్ను బతిమిలాడుకుంటాడోయమ్మ
నువ్వులేకపోతే ఈ లోకానికి నేనెవరో తెలియదోయమ్మా ॥నిన్ను॥

తొలకరొచ్చి రైతు అరక దున్నే కాడ చేరదీసి చెలిమి చేస్తావో
పంటరాసి పోసి కుండకొలిచే కాడ రైతు నోట నువ్వురాగమైతావు
పంటనంత బండిమీద కెత్తినంక ఎడ్లమెడలో గంటవైతావో
గిట్టుబాటు ధరకు కొట్లాడమని కోటి గొంతులల్ల ఒక్కటైతవో ॥నిన్ను॥

సత్యం గల్ల మా సమ్మక్క సారక్క తల్లులని అంటావు మహిమగల్ల
మా దేవుడు వేములవాడ రాజన్నంటావు
అల్లా, ఏసు, కొమిరెల్లి మల్లన్న కోటి దేవతలెందరో
నీకూత చెవున పడకపోతే బయటకు రానని మొండికేస్తరో ॥నిన్ను॥

# నేలమ్మ నేలమ్మ నేలమ్మా

- సుద్దాల అశోక్ తేజ

నేలమ్మ నేలమ్మ నేలమ్మా .... నీకు వేల వేల వందనాలమ్మా
నేలమ్మ నేలమ్మ నేలమ్మా .... నీకు వేల వేల వందనాలమ్మా ॥2॥

సాలేటి వానకే తుల్లింతా - సాలు సాలుకు నువు బాలింత
గాలినే ఉయ్యాలగా - నీటినే చనుబాలుగా
రెక్కల్ల బొక్కల, పక్కల్లా - నీవు సక్కంగా మోసేవు మొక్కల్లా ॥2॥

పరువమొచ్చిన చేలు వంగే - పైరు కాపు మేను పొంగే
పంట బిడ్డ పండి మీది కెక్కినంక - పగిలి పోతుందమ్మా
నీకన్న కడుపింక నేలమ్మా...... ॥2॥ ॥నేలమ్మా॥

తల్లి నువ్వు నవ్వితే మాగాణి - యెద తలుపు తీశావంటే సింగరేణి
తనువునే త్రవ్వి తీసినా - మనసునే తొలిచేసినా
పొట్ట తిప్పలకు బిడ్డలూ - నీ పొట్టలో పడుతున్న తిప్పలు ॥2॥

ఏ రోజు కారోజు తిరిగి - నూరేళ్ళ వయస్సు కోరి ॥2॥

కడుపులో తిరిగేటి కొడుకులకై నువ్వు తిరుగుతున్నావేమో
సూర్యుని గుడి చుట్టూ నేలమ్మా ॥నేలమ్మా॥

తైలాలు పూసింది నైలు నది - నీకు తలస్నానమయ్యింది గంగానది
గంధమే పూసిందహో - పొందుగా హోయాంగ్‌హో
ఖండాలలో రంగు రంగు పూలు - గండు కోయిలల
కొలువైనదా వెండి కొండా - నీ జాలి గుండెల నిండా ॥2॥

ఇన్ని ఉన్న మనిషి కన్నీళ్ళ రక్తాలు - కన్నులు కనలేక
కంపించి పోతాడు నేలమ్మా..... ॥2॥ ॥నేలమ్మా॥

మా తల్లి నీ మట్టి బంగారం - అది మానవాళికి నుదుటి సింధూరం
అమ్మనీ అనురాగమే - కమ్మనీ సమభావమే
గొప్పలు తప్పులు సూడక - నీ వెప్పుడు మమ్మొడ బాయకా
జన్మించినారా రాజులై - పేరొందిరా నిరుపేదలై
నీవంటిపై సుతులు - చితులు కాల్చుచున్నా
నీవంటి తల్లింక దేవుళ్ళకే లేదు నేలమ్మా..... ॥2॥ ॥నేలమ్మా॥

# పల్లె అందాలు

- గోరటి వెంకన్న

నా పల్లె అందాలు సూసితే కనువిందురో
ఎత్తు వంపుల తోని డొంకదారుల సూడు
యేపుగా పెరిగినట్టి యాపలు ఈదులు సూడు
అల్లుకున& అడవి తీగెలా దొండ పొదలురో! ॥నా పల్లె అందాలు॥

సారము లేని భూముల్ల - ఊరుసుట్టంతమొల్సి
బారెడు మండల కొనలకు బంగారపు వన్నె కల్గి
వంగిన పొదలల్ల - తంగెడు పూలన్నయో ॥నా పల్లె అందాలు॥

బోనం పటువలకు పసుపుబొట్లు వెట్టుకోని
జోరుగా సిగమూగె సోర ఆడోళ్ళ తీరు
రేళా పూత కొమ్మలు సిరిమాన మొలుకు తున్నయో ॥నా పల్లె అందాలు॥

గాలికి ఊగి ఆటాడుతూ నేలకు తలలొంచి
సెరవు నీళ్ళను ముద్దాడి మురిసె
నల్లతుమ్మ చెట్లు పల్లె పొలిమేరకెంతందమో ॥నా పల్లె అందాలు॥

సిత్రాంగి వేషమేసి సిందు రాముడెగిరినట్లు
సల్లగాలికి ఊగే సద్దసేను వలపు సూడు
పాలు పట్టిన కంకి మీద పక్షి నాల నియ్యదు ॥నా పల్లె అందాలు॥

కల్ల కపట మెరుగని గొల్ల కురువ వనితవోలే
ముత్యాల గింజ వోసి ముసి ముసిగ నవ్వుతున్న

తెల్లజొన్న సేను రైతు తల్లి పంట రన్నయో ॥నా పల్లె అందాలు॥

తాటిచెట్టు తలలవుట్టి పూటకింత కల్లు తాగి
పిల్ల ఊడలేసి చెట్టు వొల్లునంత అల్లుకొని
కల్లు గీయకుండ తల్లి ఋణం తీర్చెనంట మ్రతి ॥నా పల్లె అందాలు॥

సెట్లల పుట్లల్ల పలుగురాళ్ళ గడ్డలల్ల
సిక్కని ఆకుల మధ్య ఫక్కున నవ్వి పిలిసె
సీతాఫలంబు పేదల ఆపిల్ పండన్నయో ॥నా పల్లె అందాలు॥

పసరు నిండిన ఆకులతో పైకిలేవక వొదిగి వుంటు
వాడువట్టకుండ గడ్డి బీడు భూములల్ల పెరిగె
నల్లళముపూలు భూతల్లి సంటి పిల్లలో ॥నా పల్లె అందాలు॥

ఎండిన మోడైన యేనుకోని యిగురేస్తది
ఎరువు తిండి నీళ్ళడగదు కరువులైన వాడిపోదు
వుత్త ఎండగాలికి పూసే ఎర్రగన్నేరన్నయో ॥నా పల్లె అందాలు॥

పరుల కంట్ల బడితే పల్సదనమయితమని
వొంటిగతోపుల కొచ్చిన మనసు కల్సిన జంటను
నెత్తిన అక్షింతలేసి ముచ్చటాడు సింతసెట్లు ॥నా పల్లె అందాలు॥

తల్లిపాలు తాగెనంటె గొల్ల కాపరికి దొరకక
పులిసింత సెట్లల్ల పుల్జరి పొదలల్ల ఈగి

నల్లమేక ఇల్లల అల్లరి అరుపు సూడురో ॥నా పల్లె అందాలు॥

ముంగలి కాళ్ళను లేపి మంగ పొదల కానిచ్చి
మండ్ల గుచ్చుకుండాకుల పండ్లతో సిట సిట కొరికే
మేకల గుంపులకెప్పుడు ఆకలి పోరాటమే ॥నా పల్లె అందాలు॥

కుందేలు బయటకొస్తే కండ్లల్ల పొడవనీకే
ఆకసాన ఎగురుతూ అదునుకై కాపు గాసే
సారువ డేగ రెక్కలు సప్పుడు జెయ్యదురో ॥నా పల్లె అందాలు॥

మీసం రోషంగ దువ్వే నాసులుండె నారజెల్ల
బురుద తిని అరిగిచ్చుకున్న బురుదమట్ట బలుపు సూడు
ఊకోక పరుక శాప తోక గిల్లె టుల్సెరో ॥నా పల్లె అందాలు॥

మడికట్ల గుడ్డి కొంగ మాటు గాసు కొనుంటది
వాగుల తెల్లకొంగ దొంగ జపం జేస్తుంటది
సంగతెరుగని చేపలు కొంగ నోట జిక్కురో ॥నా పల్లె అందాలు॥

దేవుని గోపురం మీద రామ సిలుకల కిల కిల
సూఫీల ధర్గా ముందు శాంతి కపోతాల కదును
పాడువడ్డ దొరగడికి పగిడి కంటె కాపలా! ॥నా పల్లె అందాలు॥

# పల్లె జూడు

- కొమిరె వెంకన్న

పల్లె జూడు ప్రతి పల్లె జూడు
ఏ పల్లె జూసినా...నా తెలంగానలోన
అన్నం బెట్టిన రైతు
ఆత్మ హత్యల పాతాతుండే - నా తెలంగాణలోన ॥పల్లెజూడు॥

అరె! పచ్చ పచ్చని పంట చేలతో
పాడి పంటలు పసిడి రాసులతో
కలకలలాడే పల్లే తల్లీకీ
కన్న కొడుకై బతికిన రైతు
కరువు కోరల చిక్కుకున్నడు
పరువుకే ఉరి తాడేక్కుతున్నడు
ఏమి గోరము ఏమి గోరమాయే
మన అన్నదాత రైతన్న యదనిండకుంపటాయే

॥పల్లెజూడు॥

ఆకాశాన్నే నమ్ముకొని
అరకగట్టి మడి సెలకనుదున్ని
అప్పులు దెచ్చి విత్తనమేసి
నెత్తురు ఎరువుగ జల్లిన రైతు
పంటబోయి పాతప్పుల బడ్డడు
విషం గులికలు మింగుతున్నడు
ఏమి గోరము ఎమి గోరమాయే

చుక్కంత శోకమాయే
మన అన్నదాత రైతు బతుకంత శోకమాయే ॥పల్లెజూడు॥

తాళిపుస్తెలు అమ్మిన గాని
తెచ్చిన అప్పులు తీరవాయేననీ
అసలు సంగతి దేవుడెరుగును
వడిగట్టుటకే వణికిన రైతు
అప్పుల భారం తలుచుకున్నడు
ఆత్మ హత్యలకు ఒడిగడుతున్నడు
ఏమి గోరము ఏమి గోరమాయే
మన అన్నదాత రైతన్న ఎదనిమడ కుంపటాయే ॥పల్లెజూడు॥

అన్నలారా ఓ అన్నలారా
ఆత్మగల్ల ఓ రైతుల్లారా
తెలంగాణ మా బిడ్డల్లారా
ఆత్మ హత్యలు ఇక వద్దండి
భారతమాత ముద్దు బిడ్డలై
బతుకు పోరును జేద్దాంరండి
రైతన్న బతుకుపోరును చేద్దాం రారండి
రైతన్న బతుకుపోరును చేద్దాం రారండి

# పల్లె తెలంగాణ

- భూపాల్

పల్లె తెలంగాణ - నా
ఇల్లు తెలంగాణ
పోరు తెలంగాణ
పట్నమడవి తెలంగాణా
రారో! మల్లన్న
రాష్ట్రం తెద్దాము మనం ॥పల్లె॥

అన్నా ఇగ ఓపికొద్దు
చిన్న రాష్ట్రముంటేబాగు
అందుకే మన మందరమిగ
అలాయి బలాయి దీసుకొని
తెలంగాణ తెస్తమనీ
చేతుల చెయ్యేసుకొని
బందగి కొమరయ్యలా
బాటనందుకుందామూ... ॥పల్లె॥

తెలంగాణ బతుకులల్ల
సిమ్మ సీకటున్నదన్న
బానిసలై బతుకుడేంది
బిచ్చగాళ్ళ పోకడేంది?
ఈడ పుట్టి ఈడ పెరిగి
ఈడ మాడి సచ్చుడేంది?

తెలంగాణ ఓస్తేగాని
బతుకుదెరువు లేదన్నా... ॥పల్లె॥

సోరసోర పోరగాళ్ళు సదువులన్ని మల్లేసీ
ఉన్న సోట కొలువు లేక
కన్న ఊళ్ళె నిలువలేక
గతి మల్లే బతుకులయ్యి
మతి చెడినా మనుషులయ్యి
ఏటికయ్యి కాటికయ్యి
ఎందులకాకుంట పోయిరి ॥పల్లె॥

గల గల పారేటి నదులు
వెలవెల పోయి కదులుతుంటె
నీళ్ళు లేని పట్నాలు
పల్లె పోలాలెండి పోంగ
మెదకు జిల్ల మెతుకు లేదు
పాలమూరు గతుకుతుంది
నిండ నదుల తెలంగాణ
కుండకు పొక్కొందుకన్న... ॥పల్లె॥

బండైన బతుకునీడ్వ
ఉండి ఫాయిదేముందీ
నిమ్మకు నీరెత్తినట్టు
అమ్మా! ఈ బతుకొద్దు
ఆరో పారో దేల్చుకొని
అంతు జూసుకుందామూ
కార్యం కొన ఎల్లె దాక
కంటికి నిద్రుండొద్దూ ॥పల్లె॥

# పల్లే కన్నీరు పెడుతోంది....

- గోరటి వెంకన్న

పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రలో
తల్లి బందీయై పోతుందో కనిపించని కుట్రల ॥ఓరబ్బో॥

కుమ్మరి వాముల తుమ్మలు మొలిసెను
కమ్మరి కొలిమిల దుమ్ము పేరెను
పెద్ద బారిస మొద్దు వారినది
సాలెల మగ్గం సడుగులిరిగినవి

చేతివృత్తుల చేతులిరిగినాయో నా పల్లెలోనా
గ్రామ స్వరాజ్యం గంగలోన పాయే నా పల్లెల్లోనా ॥పల్లె కన్నీరు॥

మడుగులన్ని అడుగంటి పోయినవి
బావులు సావుకు దగ్గరయినవి
వాగులు వంకలు ఎండిపోయినవి
సాకలి పొయ్యిలు కూలి పోయినవి
పొద్దంత నడిచే పెద్ద బోరు మూతబడినది
పేద రైతుల బావులెండిపాయె నా పల్లెల్లోనా
గుక్కెడు నీళ్ళకు నోచుకోలే నా పల్లెల్లోనా ........... ॥ఓ రబ్బో॥

ఈదులన్ని వొట్టి మొద్దులయినవి
ఈత కల్లు బంగారమైనది
మందు కలిపిన కల్లును తాగితె
మంది కండ్లు నిండూసులయ్యినవి

చల్లని బీరు విస్కీ ఎందుకొచ్చే మా పల్లెలోకి
సామ్రాజ్యవాదుల విషం గ్రక్కుతుండే నా పల్లెల్లోనా .............॥పల్లె కన్నీరు॥

పరుక శాపలకు గాలాలేసే
తురుకల పోరలు యాడికోయిరి
లారీలల్లా క్లీనర్లయ్యిరా
పెట్రోలు మురికిల మురికయ్యింద్ర
తల్లీ దూద్ సేమ్యాకు దూరమైనారా సాహెబ్‌ల పోరలు
ఆ బేకరి కేఫ్‌లో ఆకలి తీరిందా ఆ పట్టణాలలో ॥పల్లె కన్నీరు॥

అరుకల పనికి ఆకలి దీరక
గడెం నొగల పని గాసమెళ్ళక
ఫర్నీచర్ పనులెతుక్కుంట
ఆ పట్నం పోయిరి విశ్వకర్మలు
ఆసాములంత కూసునేటి వడ్రంగుల వాకిలి
పొక్కిలి లేసి దుఃఖిస్తున్నదిరో నా పల్లెల్లోనా ॥ఓ రబ్బో॥

మేరోల్ల చేతుల కత్తెర
మూలకొయ్య సిలుమెక్కి పోయినది
కుట్టుడు రెట్టల బనీను లేవి
సోటి లాగులు జాగకే లేవు
రెడిమేడ్ ఫ్యాషన్ దుస్తులొచ్చినవిరో నా పల్లె పొలిమేరకు
కుట్టుమిషన్‌ల సప్పుడాగినదిరో నా పల్లెలోన ॥పల్లే కన్నీరు॥

సారకెంపు తెల్లలు జెల్లలు
పరులకు తెలియని మరుగు భాషతో
బేరం జేసీ బానలి వీథులు
వన్నె తగ్గినయి సిన్న బోయినవి
చెన్నై బాంబే కంపెని నగలొచ్చి మన స్వర్ణకారుల
చెర్నకోలలై తరుముతున్నయిరో నా పల్లెల్లోన ॥పల్లే కన్నీరు॥

మాదిగ లొద్ది నోరు తెర్చినది
తంగెడు చెక్క బంగపడినది
ఆరె రంపె పదు నారిపోయినవి
పాత రేకు వలె మోతలు మ్రోగేటి ప్లాస్టిక్ డప్పులు
నా మ్యాతరి డప్పును పాతరేసె గదరా నా పల్లెల్లోనా ॥పల్లే కన్నీరు॥

ఇల్లు గట్టుకునే ఇటుకకు రాయిలకో
సెలుకల చల్లే ఎరువు కుల్లుకో
ఎద్దుబండి వున్నోనికి సేతుల
యాడాదంత పని దొరికేది
టాటా ట్రాక్టర్ టక్కరిచ్చినాదో నా డొంక దారిని
ఎద్దుబండి గిల్లెగిరి పడ్డదమ్మో నా పల్లెల్లోనా ॥పల్లే కన్నీరు॥

కుంకుమ దాసెన బుక్క మీద కూడ
కంపెని రక్కసి కన్ను పడ్డది
పూసలోళ్ళ తాళం కప్పలు

కాసిల కలిసి ఖతమైపోయెను
బొట్టు బిళ్ళలు నొసటికొచ్చినవిరో నా పల్లెల్లోన

మా బుట్టి దాసరి బతుకులాగమాయే మా పల్లెల్లోనా ॥పల్లే కన్నీరు॥
తొలకరి జల్లుకు తడిసిన నేల
మట్టి పరిమళాలు ఏమై పాయెరా

వానపాములు నత్తగుల్లలు
భూమిల ఎందుకు బతుకతలేవురా
పత్తి మందుల గత్తర వాసనరో మా పంట పొలాల్లో
ఆ మిత్తికి తెచ్చిన అప్పే కత్తాయే నా రైతు కుత్తుకపై ॥పల్లే కన్నీరు॥

వందల దట్టీలు కట్టె పీర్లకు
ఒకటి రెండే నామోషైనవి
అలావు గుంతల మొద్దులు తగ్గెను
పొలావు కందుర్లెగిరి పోయెను
కానీ ఇంటికొకడు స్వామి వేషం వెయ్యపట్టె నా పల్లెల్లోనా
ఇడుపు దేవరలు ఇగులపట్టినవిరో నా పల్లెల్లోనా ॥పల్లే కన్నీరు॥

హరిశ్చంద్ర పద్య నాటకాల పంతులు
హార్మోనియం చెదలు పట్టినది
యక్షగానం నేర్పే పంతులు
ఉప్పరి పనిలో తట్ట పట్టినడు

యాచకులు ఆ బుడగా జంగాలూ నా పల్లెల్లోనా
గల్లీలల్లో గోలీలమ్ముతుండ్రో ఆ పట్టణాలలో ॥పల్లే కన్నీరు॥

పిండోలె ఎన్నెల రాలుచుండగా
రచ్చబండపై కూసొని రైతులు
ఎనకటి సుద్దులు ఎతలు కతలు

యాది చేసుకొని బాధలే మరిచిరి

బుక్క నోటిలో పడ్డదంటే నేడు మా పల్లెల్లోనా
ఒక్కడు రాతిరి బయటికెళ్ళడమ్మో ఇది ఏమి చిత్రమో ॥పల్లే కన్నీరు॥

బతుకమ్మ కోలాట పాటలు
భజన కీర్తనల మద్దెల మోతలు
బైరాగుల కిన్నెర తత్త్వంబులు
కనుమరుగాయెరా భక్తి పాటలు
పల్లె సుద్దులు పాతవయ్యినాయో పల్లెల్లోనా

# పల్లె పల్లెనా

- శ్రీను

పల్లె పల్లెనా పల్లేరు మొలిసే
పాలమూరులోనా మన తెలంగాణలోన
పాతగోడలు పందిరి గుంజలు
చిన్నబోయినాయి ఇండ్లు దుమ్మురేగినాయి ॥పల్లె॥

చెట్టుమీద ఆ పిట్టలెగరవూ
చేతబావిలో ఊటలూరవూ
పచ్చాపచ్చానూర్లు పలుగురాళ్ళుదేలినాయి
పనీపాటలేక ప్రజలు తల్లడిల్లినారు ॥పల్లె॥

దండెకడాలు ఎండిపోగులు
మొలతాడులు కనక పోగులు
ఉన్నదంత అమ్మి కనిపెంచినూరునిడెచే
పొట్టచేతబట్టీ బతుక బైలెల్లినారు ॥పల్లె॥

గెర్రెగడ్డలు మొరం భూములు
బండరాళ్ళనూ పగులచీరుతూ
కాలుచేయిలె పలుగై పంటాకాల్వ దొవ్వినారు
చెమట ఏరులైనా తాగానీళ్ళకేడ్చినారు ॥పల్లె॥

రాళ్ళు ఎత్తినరు మిద్దెగట్టినరు
రకుతాలతో రంగులద్దినరు
ఉండగూడులేక సలివానలోన తడిసీ
ఎండలోన కాగీ నల్లబొగ్గులైనారా ॥పల్లె॥

పండుగేడిది పబ్బమేడిది
ఆటలేడివి పాటలేడివి
తల్లిపిల్లలనకా అయ్యో పొద్దు మాపుకష్టం
ఆకలైన కడుపు అలిసి సొమ్మసిల్లె నిదుర ॥పల్లె॥

జొన్నకంకి పిస్కిల్ల తీపిలా
మక్కబెల్లం మాలీదముద్దలా
గుండె గొంతు పాడే ఆ పల్లె పాటలేవీ
మండి బూడిదయ్యో ఈ వలస బతుకులయ్యో ॥పల్లె॥

రాళ్ళు ఎత్తినా రత్నమయ్యేటి
వాన చినుకుకీ ప్రాణమిచ్చేటి
పల్లె యాదికొచ్చే గుండే జల్లుమన్నదయ్యో
మన్ను రూపమున్నా ఆ మనిషి పిలిచెనయ్యో ॥పల్లె॥

చెర్లు కుంటలు పడగొట్టుతూ
పంటభూములు ఎండబెట్టుతూ
నదినీల్లు మింగినోల్ల అరెగాలమేసిపడతాం
బీడులన్ని తడుపసాగునీల్ల నడుగబోతం ॥పల్లె॥

పల్లె పల్లెన పచ్చదనముకై
పాలమూరు కెలుదాం ఆ పోరుబాట పడతాం
దగాబడ్డ మా తెలంగాణకై సంఘమొకటి కడతం
సావో రేవొ తేల్చుకుంటం ॥పల్లె॥

# పండు వెన్నెల్లలోన

- నిస్సార్

నన్నారె - నన్నారె - నన్నారె - నన్నారె
నన్నారె నన్నారె నారె
నారె నన్న నార - నారె నన్నారె నాన నారే ...!

పండు వెన్నెల్లలోన - వెన్నెల్లలోన
పాడేటి పాటలేమాయె?
మన పల్లెటూరిలోన ఆడేటి ఆటలేమాయె ...?
బాలనాగమ్మ భక్త శిరియాల హరిశ్చంద్ర
అల్లిరాణి ఆటలు ఏవి?
మన పల్లెటూరి లాడె బాగోతాల జోరేది?

రాజు : ఎవ్వరే ఈ వనములోనా .. ఏర్వరించావే లలనా ...? ॥ఎవ్వరే॥
రాణి : ఎవ్వరైతేనేమి పొమ్మి - ఏల సరసాలోయ్‌రాజా? ॥ఎవ్వరైతే॥

స్టేజి కరెంటు మైకు ఏదీ లేకున్నగాని
తెల్లార్లు ఆడిపాడేది
మన పల్లెగుండెలోన మోగేటి కంచుగొంతులేవి?
భీముండర వొరె ద్వారకా!
భీముండరిపుజర కారుండ
కౌరవ నామంబు గలనే శూరుండరా - చల్
చిందేస్తూ చిత్రంగి వూరంత తిరిగేటి
చిందోల్ల వేషాలేవి?
మన పల్లెలు ముద్దుబిడ్డలు పిట్టల దొరలు ఎటుపోయిరి?

జోరర్ : తుర్ర్ర్ర్! తుర్, తుర్ర్ర్ర్!
బుర్ర్ర్ర్! బుర్, బుర్ర్ర్ర్!
మేరేనామ్ గిర్కోంటి
ఇదివర్దాక పొయిలపంటి ॥మేరే॥
నాకి పెళ్ళాంకి లేదు. దానికి మొగుడికి లేదు ॥మేరే॥
భార్యాబిడ్డలతోటి ఉగ్రూతలూపుకుంటు
బుర్రకతలెన్నో చెప్పేటోల్లు
మన శారద కాన్ల గుండెల బుర్రల చప్పుడేలేదు,
జోడుగ వంతలు ... జోరుగా పాడంగా
తందాన, తందానె, తందానా
ఆదితాళములు, శబ్దరాగములు-తందానా, తందాన, తందానా!,
తాంబూర కత వినుడీ..
తందానా .... తందానాదేవనందనానా....తరికిట జమ్ తరితా...!

ఢిముకు ఢిముకు డోలు దరువు, ఘల్లు గజ్జెల్లు
ఒగ్గోల్ల కతలెటుబాయె?
మన ఢిల్లెంకల్లెం-చిల్లం, కల్లం అయే
నాయినా ...ఓ ....!శరణు శరణు మా యమ్మరాణీ
శాంభవీ రాణీ...శాంభవీ రాణీ....కరుణ జూపు మా యమ్మదేవీ
గంగాభవానీ! దేవీ భవానీ!
పోరగాల్లు పెద్దోల్లు ఊరంత గుమ్మగూడి
దుమ్మురేగ దూల ఆడేది

మన పీర్ల పండగొస్తే సవార్లు ఎత్తెటోల్లేరి ?
ఏమేమి గావాలె సామికి – పెద్దగుట్ట మౌలాలికి
దట్టీలు గావాలె సామికి – మట్కీలు గావాలె
మట్కీలు గావాలె సామికి – మలీద ముద్దలు సామికి
దులా! దూలా! దూలా! దూలో....!
సుట్టు కాముడాడేటోల్లు
మన పల్లెటూరినంత ఉయ్యాలలూపేటోల్లు
ఇద్దరక్క చెల్లెల్ల ఉయ్యాలో – వొక్కూరికిచ్చిరి ఉయ్యాలో
వొక్కూరికిచ్చిరి ఉయ్యాలో – వొక్కింటికిచ్చిరి ఉయ్యాలో
వొక్కింటికిచ్చిరి ఉయ్యాలో – వక్కనికే ఇచ్చిరి ఉయ్యాలో
వొక్కడే మాయన్న ఉయ్యాలో – వొచ్చన్న పోడాయె ఉయ్యాలో
సక్కని మాయన్న ఉయ్యాలో – సూసన్న పోడాయే ఉయ్యాలో
చిన్నారి చెల్లెండ్లు, చెంగు చెంగు నెగురకుంట
చెమ్మచెక్కలాటలాడేది – మన వాకిల్లలోన ఆడపిల్లల లొల్లేది?

ఆడేటి ఆటలేదు పాడేటి పాట లేదు
పల్లె సంబరాలె లేవమ్మో
నేడు టీవీలు, సినిమాలు పల్లె కళలను మింగెనమ్మ!

# పాలమూరు వలస బతుకు

– మిత్ర

పల్లె పల్లెనా పల్లేర్లు మొల్సె
పాలమూరులోన మన తెలంగాణలోన
పాత గోడలు పందిరి గుంజలు
సిన్నా బోయినాయి ఇండ్లు దుమ్మురేగినాయి ॥పల్లె॥

చెట్టూ మీద ఆ పిట్టా లెగురవు
చేదబాయిలో ఊటలూరవు
పచ్చాపచ్చా నార్లు పలుగురాల్లు దేలినాయి
పనీపాట లేక ప్రజలు తల్లాడిల్లినారు ॥పల్లె॥

దండగడాలు ఎండిపోగులు
మొలతాడులు ముండ గాజులు
ఉన్నాదంత అమ్మి కనిపెంచి నూరు నిడ్సి
పొట్టా చేతబట్టి బతుకబైలెల్లినారు ॥పల్లె॥

గెర్రె గడ్డలు మొరంభూములు
బండరాల్లను పలుగజీరుతూ
కాల్లూ చేయిలె పలుగై పమటకాల్ల దవ్వినారు
చెమట ఏరులై తాగనీల్ల కేడ్చినారు ॥పల్లె॥

రాల్లు ఎత్తినరు మిద్దే గట్టినరు
రవుతాలతో రంగులద్దినరు
ఉండా గూడులేక సలివానలోన తడ్సి
ఎండాలోన కాలినల్ల బొగ్గులయ్యినారా ॥పల్లె॥

పండుగేడిది పబ్బామేడిది
ఆటలేడివి పాటలేడివి
తల్లీ పల్లనక అయ్యో పొద్దు మాపు కష్టం
ఆకలై కడుపు అల్సి సొమ్మసిల్లి నిదురా ॥పల్లె॥

జొన్నాకంకి పిస్కిల్లతీపిలా
మక్కబెల్లము మలీదముద్దలా
గుండె గొంతుపాడె ఆ పల్లె పాటలేవి
మండి బూడిదయ్యే ఈ మసిబతుకులేమి ॥పల్లె॥

రాల్లు ముట్టినా రత్నమయ్యేటి
వాన చినుకుకే పాణొచ్చేటి
పల్లెయాదికొచ్చి గుండె జల్లు మన్నదయ్యో
మన్ను రూపమున్న మనిషి నిన్న పిలిచేనయ్యా ॥పల్లె॥

చెఱువు కుంటలు పోగొట్టుతూ
పంటాభూములు ఎండాబెట్టుతూ
నదినీల్ల మింగినోల్ల తడుపసాగునీల్ల నడ్గుతాము
పల్లే పల్లెన పచ్చాదనముకై
పాలమూరు కెల్తం ఇగ పోరుబాట పడ్తం
దగాబడ్డ మా తెలంగాణపై
సంఘమోటి గడ్తం సావో రేవో తేల్చుకుంటం

# పొడిసేటి పొద్దోలె ఎలమందా

- నెర్నాల కిషోర్

పొడిసేటి పొద్దోలె ఎలమందా
పోరుదారెంట పోతుండె ఎలమందా
సూత్తె చిన్నపోరగాడె ఎలమందా
తెలంగాణ జెండ బట్టె ఎలమందా "పొడిసేటి"

సెరువెందు కెండిందొ సెప్పమంటున్నాడు
వాగువంకలు తీరిగి ఊసురుమన్నాడు
బీడు భూములజూసి ఎదనుబాదుకుండు -2
బక్కగొడ్లజూసి ఎలమందా
వాడు ఎక్కెక్కి ఏడిసిండు ఎలమందా
దిక్కుతోసక బిడ్డ ఎలమందా
వాడు దిగులుతో కుసుండు ఎలమందా "పొడిసేటి"

కొడుక తిందువురార బుక్కేడు బువ్వంటె
తెలంగాణ రానిదె ముద్ద ముట్టానండు
తల్లి తెలంగాణ పాట పాడుమండు -2
తెలంగాణ పోరుకు ఎలమందా
నాకు మాటివ్వమన్నాడు ఎలమందా
వాడు మంకు పట్టుబట్టె ఎలమందా
అమ్మ మాట తీసుకుండు ఎలమందా "పొడిసేటి"

తెలంగాణ ఉద్యమం దండుల్లెకస్తుంటె
జెండెత్తుకొని వీడు ముందురుకుతున్నాడు

మీటింగు కాడుండి ఎంతపిలిసిన రాడు -2
ఆ ముచ్చట్లు విన్నడు ఎలమందా
ఇల్లు జాడలె మరిచిండు ఎలమందా
ఇగ ఏడ జుసిన వీడె ఎలమందా
ఊరంత పోరు జెస్తుండు ఎలమందా "పొడిసేటి"

యాడికెల్లిన గాని రికాములేకుండా
తెలంగాణ ముచ్చట్లె మాట్లాడుతున్నాడు
తొడగొట్టి తెలంగాణ తెద్దామంటున్నాడు -2
తెలంగాణతో మనకు ఎలమందా
పేగు బంధముందన్నాడు ఎలమందా
తోటి వాల్లతొ కుడి ఎలమందా
దండు గట్టి జెండెత్తిండు ఎలమందా "పొడిసేటి"

కలుపూలు తీసేటి కూలి అక్కాలాకు
నాగండ్లు దున్నేటి రైతు బిడ్డాలాకు
తన నోట తెలంగాణ పాట నేర్పుతుండు -2
వారందరు కూడి ఎలమందా
తెలంగాణకు జై అంటె ఎలమందా
వాని ఒల్లంత పులకింత ఎలమందా
గుండె గులాబీల పూత ఎలమందా "పొడిసేటి"

తల్లి తన ఒడిలోన నిద్రపొమ్మంటుంటె
పండు ఎన్నెలతోని బాసలాడుతుండు
తెల్లారె సరికి తెలంగాణ రావాలంటుండు -2
వాని సంబురంబు జుసి ఎలమందా
తల్లి ఎగిరేసి ముద్దాడె ఎలమందా
తెలంగాణ సాదనకె ఎలమందా
పల్లె తల్లి ప్రతిన బూనె ఎలమందా "పాడిసేటి"

# పొద్దు తిరుగుడు పువ్వు

- గద్దర్

పొద్దు తిరుగుడు పువ్వు
పొద్దు తిరుగుడు పువ్వు
పొద్దును ముద్దాడే - తొలి పొద్దును ముద్దాడే
అడవిలోన వెన్నెలమ్మా
ఆకుల ముద్దాడే - చిగురాకుల ముద్దాడే ॥పొద్దు॥

పిల్లయేరు పారుతున్న
తల్లిని ముద్దాడే - తల్లి యేరును ముద్దాడే
సంద్రమమ్మ పొంగీ పొంగీ
నింగిని ముద్దాడే - నీటి చుక్కల ముద్దాడే ॥పొద్దు॥

ఆడి పాడి అలసిపోయిన
నెమలిని ముద్దాడే - ఆడ నెమలిని ముద్దాడే
పాడి పాడి మూగబోయిన
గొంతును ముద్దాడే - కోకిల గొంతును ముద్దాడే ॥పొద్దు॥

పురిటి నొప్పుల్లో గుడ్డును
తల్లి ముద్దాడే - కన్నతల్లే ముద్దాడే
తల్లిపాల పొదుగును
పాపలు ముద్దాడే - పసి పాపలు ముద్దాడే ॥పొద్దు॥

తెలంగాణ వీరులను త్యాగం పోరు ముద్దాడే
త్యాగాలు ముద్దాడే
ఒరిగినా వీరులను తల్లి ముద్దాడే
తెలంగాణ తల్లి ముద్దాడే ॥పొద్దు॥

# పోరాడరా....

- ననుమాస స్వామి

పోరాడరా నీవు పోరాడరా
దగా పడ్డ గడ్డ కోసం వెనకబడ్డ బిడ్డ కోసం ॥పోరాడరా॥

తీగ తెగిన వీణ కోసం చితికిన మన బతుకు కోసం ॥పోరాడరా॥

ముల్కి నడ్డి లిరిసినారు కమిటి మాటలు మరసినారు
ఆరు సూత్రాలరగదీసి ఆగమాగం చేసినారు ॥పోరాడరా॥

ల్యాండ్ సీలింగ్ తెస్తామని లంగవేశాలేసినారు
తెలంగాణా ముఖ్యమంత్రిని జైయ్యాంధ్రని దించినారు ॥పోరాడరా॥

రెడ్ల కాలం అంతరించే కమ్మకాలం కుమ్ముకొచ్చే
భూములన్నీ బీటలారే కరువులేమో తరుముకొచ్చే ॥పోరాడరా॥

గద్దెలెక్కి తెలంగాణాను యుద్ధభూమిని సేసినారు
పల్లెలల్లకోలమాయే ఎందరో ఎన్‌కౌంటరాయే ॥పోరాడరా॥

ప్రతీ పనికి పైరవాయే వారిచేయే పైకాయే
చదువలన్నీ చంకనాకి నిరుద్యోగం నిండిపోయే ॥పోరాడరా॥

భాష యాస వేరాయే ఇడ్లీ సాంబర్ గొడవాయె
ఎందుకంట మనకు తంట విడిపోదాం సంతసంగా ॥పోరాడరా॥

జండ ఒకటే ఎగురుతొంది తెలంగాణే జండయ్యి
అలగజనము ఒక్కటయ్యి అధికారమందుకోగా
పోరాడరా నీవు పోరాడరా

దగాపడ్డ గడ్డ కోసం వెనకపడ్డ బిడ్డకోసం
పోరాడరా నీవు పోరాడరా
తీగ తెగిన వీణ కోసం చితికిన మన బతుకు కోసం
పోరాడరా నీవు పోరాడరా......

# పోరు పుట్టిందిరా!

- జక్క గోపాల్

పుట్టిందిరా పోరు పుట్టిందిరా
తెలంగాణకొరకు సాగిపోతుందిరా
సాగేటి పోరులో సకల జనులదరు
సాగిపోయి తెలగాణ తేవాలిరా ॥పుట్టి॥

సమ్మక్క సారక్క ఎత్తిన కత్తి
సాకాలి ఐలమ్మ నడిపిన పోరు
బందగి కొమరయ్య బాట పట్టింద్రురా
బందనాలు తెంప కదిలిపోతున్నారు
నాటి నైజామోన్ని తరమిన గడ్డరా
నేటి ఆంధ్రోన్ని తరుమబోతున్నారు

ఆకలి పేగులే ఏకమయ్యి నేడు
అందుకున్నరు తెలంగాణ జెండా ॥పుట్టి॥

భాష పేర మన భాగమడుతుంద్రు
బతుకు మీద గొట్టి భాషనే మార్చింద్రు
అడ్డమీది కూలి పని మాకు జూపించి
అడ్డమొచ్చిన జాగ ఆక్రమించుకుంద్రు
గోడు గోడున మనం గోడారి చస్తుంటడె
గోదారి నీళ్ళను కాజేసుకా పోయిరి

చేతగాదని నీవు చూసుకుంటుండకు
గోదారికడ్డొస్తె గోరి కట్టాలన్న ॥పుట్టి॥

రాజులు దొరలు రాజకీయాలు
రాకాసులోలె పీక్కతిన్నారు
రౌడీలు దొంగాలు రాజధాని నిండ
రాజులోలె మమ్ము ఏలుతా ఉన్నారు
భూమి దందా జేసె దొంగాలు వాళ్ళె
నీళ్ళు మలుపుకున్న రాజులు వాళ్ళె

లంగాల దొంగాల రంగు బయటవెట్ట
రాజెయ్యరా తెలంగాణ పోరు ॥పుట్టి॥

అగ్గి పుట్టించేటి బొగ్గు బావులున్న
బోరుకింది పంట ఎందుకెండిందిరా
బొగ్గు దొవ్వి బొందలాగడ్డలు చేస్తే
బొంబాయి దుబాయి దారె మనకు మిగిలె
పోయినోళ్ళ కొరకు ఇంటికాడి వాళ్ళ
ఎదురు చూపె గాని కబురు లేకపాయె

కర్మ రాతని నీవు కన్నీళ్ళు పెట్టకు
బొగ్గు మనదె అగ్గి పుట్టించి వదలరా ॥పుట్టి॥

జాగ మార్పు కొరకు జీవోలు దెచ్చినా
అలుకువిడుసోలె అంటుకొని ఉంటారు
చట్టాలు జీవోలు చేతిరాతలేరా

మార్చుకుంటె జీవో మారిపోతుంటది
అధికార మార్పిడి జరుగందె నీకీడ
అంగుళమైనా అవతలికెళ్ళడు

మారితె రాష్ట్రము పేరు మారాలన్న
మారె వరకు మన పోరు ఆపకన్న ॥పుట్టి॥

# పోరు సాగుతుంది

- ఎపూరి సోమన్న

పోరు సాగుతుంది కొడుకా
తెలంగాణ హోరు సాగుతుంది బిడ్డా
జనహోరు సంద్రమై ఎగిసేటి కెరటమై
త్యాగాల వీణపై రాగాల రాసులై
మూడున్నర కోట్ల గొంతులొక్కటై
ప్రజా తెలంగాణ పల్లవందుకోని
నావ సాగుతుంది కొడుకా
పోరాట తోవ జూపుతుంది బిడ్డా.. ॥పోరు॥

రైతు వేశం ఏసి పాదయాత్రలు జేసి
ఇందిరమ్మ రాజ్యమంటే
ఇక ఏ బాధ ఉండదనుకుంటి
ఏ కష్టము ఉన్న నేరుగా జెప్పమని
రాజీవు పల్లె బాటంటే
మాకు ఏ రంధీ ఉండదనుకుంటి
గాంధీ మార్గం మాది హింస ఉండోద్దని
శాంతి చర్చలు జేస్తమంటే
పల్లెలు సల్లగుంటాయనుకుంటి
వల్లకాడయ్యింది కొడుకా పల్లెంతా
వలపోత మిగిలింది బిడ్డా తల్లులకు ॥॥పోరు॥

అరయేండ్ల నుండి అభివృద్ధి జపముతో
పదవులను భావించినారు
ఓటుకై తెలంగాణ జపము జేస్తుండ్రు
ప్రాజెక్టులన్ని మీ ప్రాంతానికేనండ్రు
ప్యాకేజిలిస్తమంటుండ్రు పందికొక్కులై మెక్కుతుండ్రు
దుమ్ముగూడెంరాదు దేవాదుల తీరు
పోలవరము పులిచింతలకోసం
ఊర్లకూర్లే ముంచుతుండ్రు
ముంపు ఆగాలంటె కొడుకా ॥పోరు॥

ఆరొందల పది జీవో ఊసేలేదు
ఏ కొలువైన ఇస్తమంటుండ్రు
హైద్రబాదు రంగారెడ్డి భూములన్ని
ఆంధ్రోళ్ళే ఆక్రమించిండ్రు
అవుటరు రింగురోడ్లయి కూసుండ్రు
భూమిదోసినారు బువ్వదోసినారు
సింగరేని సిరుల మూట దోసినారు
రాష్ట్ర మొచ్చే దాకా కొడుకా నువ్వు ।పోరు॥

# ప్రజా తెలంగాణకై

- పయిలం సంతోష్

ప్రజా తెలంగాణకై - రండన్న మీరు రండన్నో
ప్రాణమైన ఇద్దాము - లెండక్క మీరు లెండక్కో

నీరులేక నోరెండి - బోరు బావులడుగంటి
సినుకు లేని పల్లెలన్ని
సావుమీది కొచ్చిపడి
తెలంగాణ తొవ్వతొక్క - రండన్న మీరు రండన్నో
తొడగొట్టి లడాయికి - లెండక్క మీరు లెండక్కో ॥ప్రజా॥

ఇచ్చంపల్లి ముచ్చట లేదు
శ్రీరాంసాగర్ సంగతె మరిచె
శ్రీశైలం ఊసేలేదు
దేవాదులని దునకబట్టే
పాతిన రాళ్ళకు మోక్షం లేదు - రండన్న మీరు రండన్నో
ప్రగతి నగర్ ఫలక మేడ్చే - లెండక్క మీరు లెండక్కో ॥ప్రజా॥

మానేరు మంజీర
జూరాల జోరుతగ్గే
మూసినది బోసి బోయే
డిండి చెరువు గుండె బగిలే
పశులకు పచ్చిమేత లేదు - రండన్న మీరు రండన్నో
ఆవుదూడ అలమటించే - లెండక్క మీరు లెండక్కో ॥ప్రజా॥

మధ్య కోస్త ఆంధ్ర దొరలు
మనగడ్డన అడుగుబెట్టి

పరాయోల్ల మనలజేసి
పట్టాదారు వాడాయే
ఈ ప్రాంతంగాని ప్రాంతపోన్ని - రండన్న మీరు రండన్నో
పెత్తనాన్ని ప్రతిఘటిద్దాం - లెండక్క మీరు లెండక్కో ||ప్రజా||

నీళ్ళను మళ్ళించు కొనిరి
నిధులన్ని గుంజుకొనిరి
ఊద్యోగాలు విద్యవైద్యం
ఉన్నకాడికి ఊడ్చుకెళ్ళి
వాళ్ళు తిన్నదంత కక్కిద్దాం - రండన్న మీరు రండన్నో
తోలు తీసి డప్పు కొడదాం - లెండక్క మీరు లెండక్కో ||ప్రజా||

మన భూమిని ఆక్రమించి
కొంపలు గూల్చి కంపెని గట్టి
అరవై వేల ఊద్యోగాలు
ఆంద్రోల్లే కాజేసిరి
తెలివి జూపి ఆంధ్ర దొరలు - రండన్న మీరు రండన్నో
మన తెలంగాణను తొక్కిపట్టె - లెండక్క మీరు లెండక్కో ||ప్రజా||

విశాలాంధ్ర విద్రోహం
పెద్దమనుషులొప్పందం
ఆరొందల పది జీవో
అంతా వట్టి భూటకమే
ఈ సమైక్యాంధ్ర కుట్రలు కూల్చ - రండన్న మీరు రండన్నో
మన ప్రజా తెలంగాణ తెద్దాం - లెండక్క మీరు లెండక్కో ||ప్రజా||

# బంగారు భూమన్న

– అన్వేషి

బంగారు భూమున్న – నా తెలంగాణలో
జిల్లేల్లు మొలిసెరోరన్నా
పల్లేర్లు కాసెరోరన్నా ॥బంగారు॥

నెత్తిన గోదారి పారేటి గడ్డన
నేల బీటలు బారె గొంతులెండిపాయే
పొట్ట చేత బట్టి పట్నాలు బోయేటి
ఖర్మెందుకొచ్చిందిరన్నా
కష్టకాలమెందుకొచ్చెరన్నా ॥బంగారు॥

గలగల గోదారి కిలకిలా క్రిష్ణమ్మ
మంజీర మీటిన రతనాల వీణ
శబరి, కిన్నెరసాని శుభగీతి పాడేటి
రాగాలు ఎటుపాయెరన్నా
తల్లి మూగబోయెనెందుకన్నా ॥బంగారు॥

ప్రాజెక్టు కట్టాలె పంటలే పండాలి
కంట తడి పెట్టేటి రైతన్న నవ్వాలి గోదారి నీటితో నా తెలంగాణా
భూములే తడవాలిరన్నా
పేద బతుకులే మారాలిరన్నా ॥బంగారు॥

# బిడ్డల్ని ఎడబాసీ

- కోదారి శ్రీను

తల్లి: ఏడు గడిసిపాయె ఏండ్లు గడిసిపాయె
ఎట్ల ఉన్నారో బిడ్డలో తల్లులు తొవ్వ మరిసిపోయిరో నా ఇల్లు
బతుకమ్మ పండుగ దగ్గరికి వచ్చింది

తీసుకరమ్మని జెప్పుదు కొడుకుల
తోలికరమ్మని జెప్పుడు బిడ్డల
పత్తిసేండ్ల వున్నపెద్ద కొడుకా రారా
పయినమైపోరో సెల్లెల్ని
తోలుకొనిరారో మా అయ్యా
కరీంనగరు సెల్లె ఎదురు చూస్తుందేమో
బాటకెళ్ళి జూసెనో నాబిడ్డ
ఏ రాకకు జూసేనో నా అమ్మ

కొడుకు: పత్తి సేను ఎండి పరిశాండ్ల నేనుంటి
ఎట్ల తోలుకొద్దునే సెల్లెల్ని
ఏమి పెట్టి పంపుదె సెల్లెల్ని
సేసినసేనంత ఎట్లే కలిసిపాయె
ఏమి జేసి బతుకుదే ఏడాదీ
ఎట్ల పొద్దు గడ్సునే మా యమ్మ

తల్లి: నాటు పెట్టిన మడిల ఎడ్లమేపుతన్నా
మల్లయ్యా ఏమాయెరో నువ్వున్నా
పయనమై ఎల్లరో మా అయ్యా
వరంగల్ సెల్లె నిరుడన్న రాదాయె

తోలుకొని రారో సెల్లెల్ని
తీసుకొనిరారో మా అయ్యా

కొడుకు: కౌలు జేసిన పొలము కండ్ల ముందు ఎండె
పండుగెట్ల చేద్దునే నేను పరిశాండ్ల నే వుంటినె మా యమ్మా
చేసిన సేనంత మన్నులో కలిసింది
ఎట్ల పొట్ట గడుసునే ఏడాదీ సెల్లెకేమి పెడుదునె మా యమ్మ

తల్లి: అరే సెట్టు కింద నార సీరుతున్న నడిపికొడుకినరో
నీవన్న పైనమై ఎల్లరో మా అయ్యా
నల్లగొండ అక్క కండ్లల్ల మెదిలేను తోలుకొనిరారో
మా అయ్యా తీసుకొని రారో అక్కాను

కొడుకు: ఎగుసాయం మిడిసేసీ ఏడెంది నెల్లాయె
ఏమి పని వున్నదే బుడ్డ పైసన్న లేదాయెనే సేతుల
పండుగెల్లదీయ అత్తగారింటికి ముందుగాల పోదునే
అక్కను ఎట్ల తోలుకొద్దునే మా యమ్మా

తల్లి: సైకిలెక్కి పోయో సిన్న కొడుకా జెరా సెవున మాట పెట్టరో
నేను ఎట్ల చేయబిడ్డరో మా అయ్యా
పండుగ పొద్దు పది రోజులన్న లేదు
బిడ్డలెట్ల పిల్దునో నా యింటా పండుగెట్ల చేద్దునో దేవుడా

కొడుకు: బావులెండిపోయి సెర్లు ఎండిపోయి
కరెంటు రాదాయెనే మా యమ్మ

కరువు మయమైపోయెనే పల్లెలు
పుట్టెడప్పులకు మిత్తీలు కట్టకా
రైతులు చస్తున్నరే రోజుకో ఇల్లు మునుగుతున్నదే పల్లెలో
కంటి ధారలు తప్ప కడుపునిండా కూడు
ఏ ఇల్లు తింటున్నదే పల్లెలో
రోటికాడ నడుగవే మాయమ్మ
నీలాంటి తల్లులు బిడ్డల్ని ఎంత దూరమున్నరో
వాళ్ళ ఏడ్పు ఎవ్వరింటిరే మా యమ్మ

తల్లి: పాపిష్టి పాలనలో పేద రైతులు సచ్చె
ఎంత పాపమాయెరో ఓ బిడ్డా
నీళ్ళు ఇయ్యరాయెరో ప్రాజెక్టుల
గడ్డిమోపులు లేక ఎడ్లు బక్కపడే, కోత కమ్ముతుండ్రురో
గొడ్లగోస సూడలేమురో మా అయ్య

కొడుకు: ఇన్ని ఏండ్లు మనల సంపుక తిన్నోళ్ల
సీటు దించుదామురో వాన్ని గుంజి తన్నుదామురో రారన్న
గుండు కొట్టించి తెలంగాణ నుండి
గెదిమి కొట్టుదామురో ఓరన్నా
తరిమి కొట్టుదామురో రారన్న

# ముద్దుల రాజాలో

- కోదాటి శ్రీను

ముద్దుల రాజాలో కొడుక - ఉత్తరమేస్తున్నా బిడ్డ
సల్లంగుండు రాజాలూ నువ్ సక్కంగుమడు రాజాలూ
ఎక్కాడున్నా రాజాలు నువ్ సుఖంగుండు రాజాలు ॥ముద్దుల॥

చేసుకొని బతుకుతమని చెలకాలల్ల బోర్లేస్తే
అప్పులోతు ఎక్కువాయె సుక్కా నీళ్ళు ఎల్లకపాయే ॥అ॥

కాలము కరకరమని కడుపూ మీద కొట్టిపాయే
అప్పులొడ్డీ తాళలేక అయ్యా ఆత్మ సచ్చిపాయే ॥2॥ ॥అ॥

ఏడు తిరుగక ముందే ఊరు ఇడిసినవుర కొడుక
పట్నంలో పనిజేసీ పైసా పైసా పంపిస్తివి ॥2॥
చిన్నానాడురో కొడుక సీతా కష్టంరో బిడ్డా ॥2॥
చింతా జెందకురో కొడుకో చిక్కిపోతవ్‌రో బిడ్డ ॥2॥ ॥సల్లంగుండు॥

ఇల్లిడిసి నువుబోయి యాడాది నర్దామాయె ॥2॥
ఉన్నకూలికన్నా కూలి చేసీ కాలం బొలిపిస్తి ॥2॥
పైస పైస పోగు చేసీ అయ్యా సావు బాకీ తీర్చినవు ॥2॥
బియ్యమూ నూకలూ లేక తొప్పాలొచ్చినాయి కొడుక ॥2॥
కంటికి పుట్టెడురో కొడుక కష్టాలున్నాయిరో బిడ్డా ॥2॥
ఎప్పుడొస్తవో కొడుక ఎట్లా చెప్పుదురో బిడ్డా ॥2॥ ॥సల్లంగుండు॥

నెత్తిన అక్షింతలేస్తె పచ్చని సంసారమగును ॥2॥
మనవళ్ళనెత్తుకోని ముద్దాడ నోచుకోలే ॥2॥

గూడు చెదిరిన పక్షులోలె చెట్లకొకరమైనాము
దేవునింట్ల మన్నా బొయ్య వీసమంత సాయంగాలె ॥2॥
ఏమీ రాతలురో కొడుక ఏట్లో ఈతలురో బిడ్డా ॥2॥
బాటా దొరకనీ కొడక బోయిల మైతిమో బిడ్డా ॥2॥ ॥సల్లంగుండు॥

ఎండల్ల కూలిజెయ్యా వరికోతకు నేనుబోతే ॥2॥
చేతగాని పానమాయె అలిపిరొచ్చి కూసుంటి ॥2॥
నెత్తురు సచ్చీ ఒంట్లో సత్తువ కరువై పాయె ॥2॥
దమ్మారం నీళ్ళు తాగి వరిమోపు నెత్తూకుంటే ॥2॥
కన్నులకు చీకటొచ్చి పానమంత సోలబట్టే ॥2॥

విరిసిపడితె ఒరం మీద కాళ్ళు రెక్కలిరిగిపాయె ॥2॥
లేసేదెట్లరో కొడుక చేసేదెట్లరో బిడ్డా ॥2॥
ఎట్లా చెప్పుదో కొడుక ఎప్పొడొస్తవో బిడ్డా ॥2॥ ॥సల్లంగుండు॥

దూరాన ఉన్న నీవు దుమారంగ రాకు కొడుకా ॥2॥
సావుకూ దగ్గరైన చేతకాదు నాకు కొడుకా ॥2॥
కానీ రాజ్యమెల్లీపోతివి కండ్లా నిండా నీవే కొడుకా ॥2॥
కడుపు నిండ సూచీనంక కన్ను మూసుకుంటా బిడ్డా ॥2॥
గంజీబోసి సాదుకున్నా దగ్గారుండి కర్మా జెయ్యా ॥2॥
చేతులెత్తి మొక్కాతున్న సెలవు తీసుకుంటా బిడ్డా ॥2॥
ఆఖరి ఉత్తరమో కొడక అందీనంకరా బిడ్డా ॥2॥
అవ్వనుంటనురో బిడ్డా ముట్టీనంకరా కొడుకా ॥2॥

# యలమంద

- గోరటి వెంకన్న

మందెంట పోతుండు యలమంద
వాడు ఎవ్వరి కొడుకమ్మ యలమంద
చూస్తే చిన్నపోరగాడే యలమంద
వన్నె రూమాలే కట్టిండు యలమంద

అంగిలేని ఒంటిపై గొంగడేసుకుండు
అడ్డపంచెను బుడ్డగోసిన పెట్టిండు
కిర్రుతోలు జోళ్ళు కాళ్ళకు తొడిగిండు
కందిజొన్న కొయ్యలల్ల యలమంద
కంజు పిట్లోలె పోతుండు యలమంద
ఏలెడంతాలేడు యలమంద
వెయ్యి మందకే వస్తాదు యలమంద

కర్సేటి పామైనా కన్న తల్లంటాడు
కొట్టేటి దొంగయిన కన్న తండ్రంటాడు
చెట్టు-గుట్టలునాకు చుట్టాలు అంటాడు
ఊరి దొరలా జూస్తె యలమంద
వాని నోరుకే మొక్కాలి యలమంద
గోర్లమీద వెట్టి  యలమంద
మరుగు మాటలే అంటాడు యలమంద

ఎక్కరాని తుమ్మ లెక్కి నరుకుతాడు
ఎత్తయిన గుట్టలు ఎల్ల తిరుగుతాడు

వాగుల్ల ఒంకల్ల రాగాలు తీస్తాడు
చెఱువు గట్టున నిలిచి యలమంద
సందమామోలే నవుతాడు యలమంద
తుమ్మ నీడ వుంటే యలమంద
అమ్మ ఒడినే మర్చిపోతాడే యలమంద

తుంపరొచ్చి గొర్రె తుమ్మినా దగ్గినా
ముల్లు గొట్టి గొర్రె కాలు ఈడ్సిన గాని
తట్టుకోడు వాడు తల్లడిల్లుతాడు
గొట్టాకు లొట్టాకు యలమంద
చెట్టు నూరి కట్టుతాడు యలమంద
ఏడ నేర్చిన విద్య యలమంద
కుర్వ (గొల్ల) వాడ నేర్పిన విద్య యలమంద

మూతికి జానెడు మోదుగు సుట్టను
చేతుల సందున గుప్పున గుంజేటి
తాత చెప్పిన మాట గీత దాటిపోడు
చేతి జాన కట్టె యలమంద
వీని చేదోడు వాదోడు యలమంద
వీడు కూత పెట్టంగానే యలమంద
వేట తోడేళ్ళే పరారు యలమంద

నర్రెంగ పొదకింద దుత్తలంబలి కొరకు
పరుగులు పెడతాడు గురిగెడు తాగుతాడు
పచ్చి మిరుప తోడు కొరుక్కొని తింటాడు
మేక పచ్చిపాలు యలమంద
తాగి ఆకలే మర్చెను యలమంద
లోకమెటు పోతున్నా యలమంద
మందలోకమే వీనిది యలమంద

ఏడాదికోసరి మందెల్లి పోతుంటె
తోడుగున్న గొర్లు యాడికోతున్నవని
తల్లి నడుగుతాడు తండ్రి నడుగుతాడు
మంద లారి లెక్కుతుంటె యలమంద
కండ్ల నీళ్ళు రాల్చుతాడు యలమంద
గొర్లు తరలిపోతావుంటే యలమంద
వీడు గొల్లు మంటాడమ్మ యలమంద

# రాజన్న ఓ రాజన్న

- గూడ అంజయ్య

రాజన్న ఓ రాజన్న
ఎనకముందు సూసుడేంది రాజన్న ఓ రాజన్న
ఎత్తుకో తెలంగాణ జెండ రాజన్న ఓ రాజన్న
మాయదారి కాంగిరెస్సు రాజన్న ఓ రాజన్న
ఆడితప్పిన కాంగ్రేసును రాజన్న ఓ రాజన్న
ఓడించి తీరుదాము రాజన్న ఓ రాజన్న
రాజన్న మా రాజన్న మా ఎముడాల రాజన్న
సిరసిల్ల రాజన్న మా కోరుట్ల రాజన్న మా మెట్టు పల్లి రాజన్న చల్....
పుడితె ఒకటి, సస్తె రెండు రాజన్న ఓ రాజన్న
ఎత్తుకొ తెలంగాణ జెండ రాజన్న ఓ రాజన్న ॥పుడితె॥

గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న
చేను ఎండె చెల్క ఎండె గజ్జెలో రాజన్న

గొడ్డు గోద కోతకాయె గజ్జెలో రాజన్న
దూల వాగు నీళ్ళు వాయె గజ్జెలో రాజన్న
మోట వాయె ఐట వాయె గజ్జెలో రాజన్న
బతుకు బాయె మెతుకు బాయె గజ్జెలో రాజన్న
వలసవోయి బతుకుడాయె గజ్జెలో రాజన్న
ఈ ఆంధ్ర వలస పాలనలోన రాజన్న ఓ రాజన్న
మన తెలంగాణ ఆగమాయె రాజన్న ఓ రాజన్న
రాజన్న ఓ రాజన్న మా ధర్మపురి రాజన్న

మా బుద్దారం రాజన్న మా ధర్మపురి రాజన్న
మా బుద్దారం రాజన్న మా ధర్మపురి రాజన్న
మా మేడిపల్లి రాజన్న భల్ .... ॥పుడితె॥

గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న
యాస బాయె బాష బాయె గజ్జెలో రాజన్న
పండుగ పబ్బాలు బాయె గజ్జెలో రాజన్న
సింగరేణి సిరులు బాయే గజ్జెలో రాజన్న
రామగుండమెలుగు బాయే గజ్జెలో రాజన్న
సదువుకున్న కొలువులేదు గజ్జెలో రాజన్న
ప్రమోషన్‌లు మనకియ్యరు గజ్జెలో రాజన్న
వాడు నిండముంచి రాజ్యమేలే రాజన్న ఓ రాజన్న
రాజన్న ఓ రాజన్న మా చొప్పదండి రాజన్న
రాజన్న ఓ రాజన్న మా చొప్పదండి రాజన్న

మాకొడిమాల రాజన్న మా మల్యాల రాజన్న
మా పెగడపల్లి రాజన్న ॥పుడితె॥

గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న
గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న
నమిలికొండ కొండ మీద గజ్జెలో రాజన్న
నెమలి నాట్య మాడినట్లు గజ్జెలో రాజన్న
ఎలిగెత్తెను తెలంగాణ గజ్జెలో రాజన్న

ఎలిగందుల ఖిల్ల గూడ గజ్జెలో రాజన్న
ఎలిగెత్తెను తెలంగాణ గజ్జెలో రాజన్న
తెలంగాణ ముందుబాట రాజన్న మా రాజన్న
రాజన్న మా రాజన్న మా గంగాధర రాజన్న
మా చందుర్తి రాజన్న మా సారంగపూరు రాజన్న
మా మేడిపల్లి రాజన్న చల్..... ॥పుడితె॥

గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న
గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న
ఆంధ్రవాళ్ళ మోసాలు గజ్జెలో రాజన్న
అన్ని తెలిసిపాయె మనకు గజ్జెలో రాజన్న
కత్తి ఆంధ్ర వాడిస్తడు గజ్జెలో రాజన్న
పొడిసెటోడు మనోడేరా గజ్జెలో రాజన్న
ఈ ఇంటి దొంగలా పంతం గజ్జెలో రాజన్న
పట్టాలే మనమంతా గజ్జెలో రాజన్న
ఎలక్షన్ల సంచులొచ్చు రాజన్న ఓ రాజన్న
మన కంచంలా మెతుకులేదు రాజన్న ఓ రాజన్న
రాజన్న ఓ రాజన్న మా పెగడపెల్లి
రాజన్న మా కోనరావుపేట రాజన్న
మా ఇల్లంతకుంట రాజన్నమా ఇబ్రహీంపట్నం రాజన్న ॥పుడితె॥

గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న
గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న
ఊరువాడ తిరిగి నువ్వు గజ్జెలో రాజన్న
ఉడుం పట్టు పట్టునువ్వు గజ్జెలో రాజన్న
జైకొట్టు జైకొట్టు రాజన్న ఓ రజన్న
తెలంగాణ రాకపోతే ఒట్టు రాజన్న
రాజన్న మా రాజన్న ఎముడాల రాజన్న
సిరసిల్ల రాజన్న మా కోరుట్ల రాజన్న
మా జగిత్యాల రాజన్న చల్

# రాజిగ ... ఓరి.... రాజిగ.....

- గూడ అంజయ్య

రాజిగ....ఓరి, రాజిగ...ఓరి రాజిగ...ఓరి రాజిగ
ఓరయిల పురపురాజిగ.. ఓరే...తెలంగాణ రాజిగా
పుడితొక్కటి, సత్తె రెండు ... రాజిగ ... ఓరె, రాజిగా
ఎత్తుర తెలంగాణ జెండ.. రాజిగ .... ఓరె, రాజిగా
ఎత్తుర తెలంగాణ జెండ.. రాజిగ .... ఓరె, రాజిగా
ఎత్తుర తెలంగాణ జెండ.. రాజిగ .... ఓరె, రాజిగా ॥రాజిగ ఓరె రాజిగ॥

గజ్జెలు, గజ్జెలు రెండు - గజ్జెలో రాజన్న
శెనువాయె, శెలుకవాయె " ॥కోరస్॥
బతుకువాయె, మెతుకువాయె " ॥కోరస్॥
మోతుకు మూడులాకులాయె " ॥కోరస్॥
మోటబాయి ఊటవాయె " ॥కోరస్॥
గొడ్డువాయె, గోదవాయె " ॥కోరస్॥
వలసవోయి బతుకుడాయె " ॥కోరస్॥
యీ ఆంధ్ర వలస పాలనలో - రాజిగ ఓరె రాజిగా
మన తెలంగాణ ఆగమాయె - రాజిగ ఓరె రాజిగా ॥రాజిగ ఓరె రాజిగ॥

గజ్జెలు గజ్జెలు రెండు గజ్జెలో రాజన్న
మనయాశవాయె భాషవాయె " ॥కోరస్॥
పండుగ, పబ్బాలు వోయె " ॥కోరస్॥
సింగరేణి సిరుల వాయె " ॥కోరస్॥
రామగుండ మెలుగువాయె " ॥కోరస్॥

చదువుకున్న కొలువు లేదు ” ॥కోరస్॥
ప్రమోషన్ల పేరు లేదు ” ॥కోరస్॥
మన నీళ్ళు దోసి నిధులు దోసి –రాజిగ ఓరే రాజిగా ॥కోరస్॥
వాడు నిండ ముంచి ముండమోపే – రాజిగ ఓరే రాజిగా ॥రాజిగ ఓరె రాజిగ॥

గజ్జెలు గజ్జెలు రెండు గజ్జెలో రాజన్న
సచ్చినోని లగ్గానికి ” ॥కోరస్॥
వచ్చిందే కట్నమని ” ॥కోరస్॥
శివాయి జమా భూముల్లో ” ॥కోరస్॥

రియల్ ఎస్టేట్ వ్యాపారం ” ॥కోరస్॥
కాకులను కొడుతుండ్రు ” ॥కోరస్॥
గద్దలకు పంచుతుండ్రు ” ॥కోరస్॥
అందరు శాఖహారులే – రాజిగ ఒరే రాజిగా ॥కోరస్॥
మరి రొయ్యల ముల్లేడవాయె – రాజిగ ఒరే రాజిగా ॥రాజిగ ఓరె రాజిగ॥

గజ్జెలు గజ్జెలు రెండు గజ్జెలో రాజన్న
ఉభయ కమ్యూనిస్టులది ” ॥కోరస్॥
గోడమీది వాటమాయె ” ॥కోరస్॥
తెలుగుదేశ పోల్లుజూడు ” ॥కోరస్॥
తోక తెగిన కోతులైరి ” ॥కోరస్॥
భారతీయ జనతపార్టీ ” ॥కోరస్॥

పాసువండ్ల దాసరాయె ,, ॥కోరస్॥
యీా దొంగ కాంగిరేసు జూడు – రాజిగ ఓరే రాజిగ ॥కోరస్॥

వాడు నేడు హీరో, రేపు జీరో – రాజిగ ఓరే రాజిగ ॥రాజిగ ఓరె రాజిగ॥
గజ్జెలు గజ్జెలు రెండు గజ్జెలో రాజన్న
సుక్క పొద్దు పొడిసి రాంగ ,, ॥కోరస్॥
సూర్యుడు ఎదురుంగ రాగ ,, ॥కోరస్॥
పట్టు, పట్టు ఉడుం పట్టు ,, ॥కోరస్॥
అరె ... తెలంగాణ జెండపట్టు ,, ॥కోరస్॥
అరె ... పల్లె, పల్లెలొల్లిపెట్టు – రాజిగ ఒరె రాజిగ ॥కోరస్॥
తెలంగాణ రాకపోతే ఒట్టు – రాజిగ ఓరె రాజిగ ॥కోరస్॥
॥రాజిగ ఓరె రాజిగ॥

# రాతి బొమ్మల్లోన....

- మిట్టపల్లి సురేందర్

రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా
రక్తబంధం విలువ నీకు తెలియదురా
తెలంగాణలో అమరవీరులను గన్న
అమ్మ ఆవేదన నీవు ఎరుగవురా
తెలిసుంటె చెట్టంత మా బిడ్డలను
తిరిగి తెచ్చీయ గలవా నీ మహిమలు ॥రాతి॥

పువ్వులో పువ్వునై నీపూజ చేశాను
ఆకునై నీ అడుగు పాదాలు కడిగాను
ఒక్కపొద్దులు ఉంటు ముడుపు చెల్లించాను
దిక్కు నువ్వని మొక్కి ధీమాగా ఉన్నాను
నాకన్న బిడ్డపై ఈశ్వరా
నీ కరుణ ఏమైందిరా శంకరా
నీసతికి గణపతిని ఇచ్చావురా
ఈ తల్లిపై నీమతి ఏమైందిరా.... ॥రాతి॥

శివరాత్రి నీశిలకు నైవైద్యమైనాను
దీపమారకుండా పడిగాపులున్నాను
నీ కళ్ళలో వేకువ దీవెననుకున్నాను
కడుపులో పేగును కోస్తవనుకోలేదు
నీ ఆజ్ఞ లేనిదే ఈశ్వరా..
చిన్న చీమైన కుట్టదట శంకరా

ఎందుకని రాశావు మా రాతను
పూలు రాలినా చెట్టులా ఈ జన్మను ॥రాతి॥

ఆడజన్మల ఉన్న అర్థాన్ని వెతికింది
అమ్మ అనె పిలుపుకై అల్లాడి పోయింది
చిననోట అమ్మ అని తొలిసారి పలికితే
ఆడజన్మను నేను గెలిచాననుకున్నది
పురిటి నొప్పుల బాధ ఈశ్వరా
నీ పార్వతిని అడగరా శంకరా
తల్లిగా పార్వతికి ఒక నీతినా
ఈ తల్లి గుండెల్లోన చితిమంటనా ॥రాతి॥

మా బిడ్డవంటి బిడ్డలెందరో ఒరిగినా
కడుపు కోతతో తల్లు లెందరల్లాడినా
పేగు బంధాలన్ని కాలుతున్నాగాని
తెలంగాణ వేదన నీకు కనరాదేమి
ఇకనైన మౌనాన్ని వీడరా...ఆ
మా మనవి ఆలకించయ్య పరమేశ్వరా
మా బిడ్డ తీరుగా ఇంకెవ్వరూ
కాలిపోకుండానువ్వే కాపాడరా..... ॥రాతి॥

# రేలా రేలా రేలా రేలారే

- వరవరరావు

రేలా రేలా రేలా రెలా రేలారే
రేలా రేలారే తెలంగాణ తేవాలె

బీడుపడ్డ భూముల్లో జీవనదులు పారేలా ॥బీడు॥

ఆకలి దప్పులు తీర్చే
ఆకలి దప్పులు తీర్చే తెలంగాణ కావాలె

అడివి గాచిన వెన్నెల బతుకులోన పరుచుకుని
ఆదివాసి ఆడేలా
ఆదివాసి ఆడేలా తెలంగాణ తేవాలె

సింగరేణి గనుల్లోన చిందిన చెమటే సింగరేణి ॥సింగరేణి॥

రంగుల బతుకై వెలుగగ
రంగుల బతుకై వెలుగగ తెలంగాణ తేవాలే

చదువులు కొలువులు స్థానిక అర్హులకే దక్కాలని ॥చదువులు॥

ప్రజల ఆత్మ గౌరవం నిలిపే
ప్రజల ఆత్మ గౌరవం నిలిపే తెలంగాణ తేవాలే

మన సద్దులు మన సుద్దులు మన వనర్లు మన బతుకులు
మనం తీర్చి దిద్దుకునే
మనం తీర్చి దిద్దుకునే తెలంగాణ తేవాలే

మన కళలు మన సంస్కృతి మన భాష మన వనరులు
మన రాజ్యం మనమేలే
మన రాజ్యం మనమేలే తెలంగాణ తేవాలే

సమ్మక్క సారక్క బందగీ కొమురం భీముల
పోరుబాట అందుకుని
పోరుబాట అందుకుని  తెలంగాణ తేవాలేం

పాలకుర్తి కడివెండి జగిత్యాల ఇంద్రవెల్లి
మైలురాళ్ళ జైత్రయాత్ర
మైలురాళ్ళ జైత్రయాత్ర తెలంగాణ తేవాలే

# రేలా దూల తాలెల్లాడె తెలంగాణ నేల

- గోరేటి వెంకన్న

రేలా దూల తాలెల్లేలాడేనేలో నా తెలంగాణా

సుడిగాలికి సెదిరిన పక్షులు గూడోలాయెనా తెలంగాణా॥
కొట్టమెక్కి కోడిపుంజు - కొక్కొరొకో అని కూతలు పెడ్తది ॥రేలా॥

కొమ్మలసివర కూసొని కోయిల - కమ్మటిరాగాలిన్పిస్తుంటది
గంట నూపుతు బాల సంతులు - ఇంట ముంగిట దీవెనియ్యగ
సెంగు సెంగున లేగదూడలు - అంబా అంటూ పరుగులు పెట్టగ
పక్షుల కిలకిల రావాలతో పల్లె - తెల్లారేనమ్మో
కక్ష్య గట్టిన హంసలతోన పల్లె అల్లాడెనమ్మ ॥రేలా॥

గొరుకొయ్యలు పొడువంగ లేసి - అరుకటెద్దుల మోటలు గట్టి
తేనె లొలికె గొంతులనెత్తి - జానపాటలు పాడుతుంటే
పాటకు ఎన్నెల పరవశించి - మోట దోనను ముద్దాడేది
సుట్టు ఆమడ దూరం దాక - సెట్టు సేమలు ఊగి ఆడేవి
పక్షులు అడవి జీవరాశులు - పరుగులు పెడ్తయి పిలక బావికి
ఆ ఊట బావి మోట గిలక ఏది - నా పల్లెల్లోన
ఆ దాపటి వలుపటెద్దుల తల్లేరేది నా పల్లెల్లోన ॥రేలా॥

సారంగధరు సెంచులక్ష్మి - వాలీ, అల్లీరాణి ఆటలకు
రాత్రిపూట రచ్చబండ - యక్షగానం వేదికయితే
భుజకిరీటాలు దగ దగ మెరియగ గజవదనుని తెర కదిలి ఆడగ
తాళం మద్దెల నాదం మోతకు - కాళ్ళు గాలిలో తేలాడుతవి

తెల్లవార్లూ మేల్కొని పల్లె - ఉల్లాసంగా తిలకించేది
ఆ గొల్ల మాలసింధు బాగోతులేరి - నా పల్లెల్లోన
ఆ కాలి గజ్జెల సవ్వడి ఏమయిపాయె నా పల్లెలోనా ॥రేలా॥

పీర్ల పండుగల వారం రోజులు అల్లాయి సుట్టు ధూళధర్వులురె
దసర పండుగ సంధ్య పొద్దున - జమ్మివైపు జనం దారి
పాలపిట్టను సూడనీకే - పంటసేల, వైపు పరుగులు
బోనాల బత్కమ్మ పండుగలాడబిడ్డల వైభోగాలు
ఆ పండుగ పబ్బం సందడి ఏమయిపాయె - నాపల్లెలోన
పది మంది కూడుతే భాగ్యమయిపాయె - నా పల్లెలోన

# వందనాలు వందనాలమ్మో

- అంబటి వెంకన్న

వందనాలు వందనాలు వందనాలమ్మో
తెలంగాణ తల్లీ నీకు దండాలోయమ్మో ॥వంద॥

జింకపిల్లలోలె గంతులేసే కృష్ణ గోదారమ్మలున్నా
పీకతుమ్మలు బెరిగి బోళ్ళు గుట్టలతోని బీల్లువారుడేంది
చెంగనాలుదోలె వాగువంక చెరువు అలుగు దునుకుతున్నా
శెల్కపంటలతోని సేతకూలి లేక సెమట బిండుడేంది
నిండు గర్భినోలె సాగరు కుండలు మోసి మందికిచ్చుడేంది
దూప దీరక నువ్వు అస్కులాడుకుంట ప్రాన త్యాగమేందీ ॥వంద॥

కుంకుమోలె దుక్కి పాతము జేసుకోని భూతల్లి వొడిలోనా
సినుకు కోసం జూసి తనుకులాడుతు నువ్వు తల్లడిల్లుడేంది
ఎవడెక్కి దిగలేని ఏడాకులా మర్రి నీడ నీకున్నా
పత్తి పురుగుల మందు గత్తరొచ్చి రైతు రాలిపోవుడేంది
పారే ముత్తెమంత దున్నుకుంటే సాలు రాజనాలు బండు
మన పాలుకొచ్చేనీల్లు మలుపుకుంటె ఇంక ఎన్ని సిరులు నిండు ॥వంద॥

వీరులోలె నీ కన్న కొడుకూలంత నీకు దాపుగున్నా
విధిరాత అనుకుంట సంకెళ్ళతో నువ్వు బంధీగున్నవేంది
యాబయ్యారుకు ముందే ఎన్నోతీర్ల బతుకుదెరువు నీకున్నా
యాబయ్యారేండ్లుగ వలసబాటలు బట్టి వంగి నడుసుడేంది
కట్టుబట్టలతోని కడుపుగట్టుకోని ఈడికొచ్చినోల్లు
కన్నశెరలా బెట్టి నిలువునా నినుముంచి రాజ్యమేలుడేంది ॥వంద॥

వనరులెన్నో ఉండి ఒంటిసేతా బతికే దమ్ము నీకున్నా
దమ్మిడ్కి గోరగాని దగాకోరుల ముందు సెయ్యి జాపుడేందీ
కాయకష్టము జేసి గంజి గట్కలు దాపి ఇల్లు గడుపుడేందీ
కుటిల నీతితోని కుట్రజేసినోల్ల పంచ జేరుడేందీ
ఆదినిష్ఠూరాన్ని వదిలిపెట్టుకోని పోరుజేసుడేందీ
మోసగించినోల్ల మెడలు వంచకుంట ఇడిసి పెట్టుడేందీ ॥వంద॥

మురిసి మెరిసే రంగు బట్టలెన్నో నేసె పట్టుదనము ఉన్నా
ముతక చీరలు గట్టి గోషిబెట్టుకోని అలిసి పండుడేందీ
వెండి బంగారాలు వెలలేని ఖనిజ సంపదెంత ఉన్నా
జనుము గజ్జెలు గట్టి దుశిరేరు తీగల కడియాలేసుడేందీ
ఈరోగోలలు బట్టి శివమెత్తి ఆడంగ సిందు దొక్కవేందీ
మనవాన్నో మందోన్నో ఆంధ్రభూతం బట్టె తరిమి కొట్టవేందీ ॥వంద॥

# వానమ్మ వానమ్మ వానమ్మో.....

- జయరాజు

వానమ్మా వానమ్మా వానమ్మో
ఒక్కసారన్న ఒచ్చిపోవే వానమ్మా ॥వానమ్మ॥

చేలల్లో నీళ్ళులేవు
చెలకల్లో నీళ్ళులేవు
వాగుల్లో నీళ్ళులేవు
వంపుల్లో నీళ్ళులేవు
నిన్నే నమ్మిన రైతు
కళ్ళల్లో నీళ్ళులేవు ॥వానమ్మ॥

ఎదిగేటి మిరపచేను
ఎండల్లో ఎండిపాయె
సక్కాని మొక్కజొన్న
ఎక్కెక్కి ఏడ్వసాగె
పాలుపోసుకున్న కంకి
పాలన్ని ఉడిగిపాయె
నీలు పోసుకున్న చేను
నీళ్ళాడలేకపాయె ॥వానమ్మ॥

కొంగున నీళ్ళు తెచ్చే
నింగిలో మబ్బులేవి
చెంగు చెంగున ఎగిరే
చెరువుల్లో చేపలేవి

తెల్లాని కొంగబావ
కళ్ళల్లో ఊపిరేది ॥వానమ్మ॥

సల్లాని గౌడిబర్రె
తెల్లాని ఎల్లానావు
సైదన్న మేకపోతు
సక్కాని లేగదూడ
కరువింట్లె పీనుగెల్ల
కటికోని కమ్ముకునిరి ॥వానమ్మ॥

గెత్తిన పిడికిళ్ళ బాటకొందనం
వందనం వీరులకొందనం .....
వందనం ధీరులకొందనం ..... ॥జై॥

# వీరులారా వందనం

- దరువు ఎల్లన్న

వీరులారా వందనం .. విద్యార్థీ
అమరులారా వందనం ... పాదాలకు
మా త్యాగధనులారా మరచిపోము మేము
గుండెల్లో గుడికడతాం ... పోరు దండం పెడుతాం ॥వీరు॥

కాకతీయులనుంచీ నిజాం రాజుల దాకా
తెలంగాణ ఘనత తెలుసుకున్నరు చరిత ॥2॥

ఆంధ్రా దోపిడి జూసీ అగ్గీ పిడుగులైన ॥వీరు॥

కాలేజీలో మండే నిప్పుకణికలు మీరు
విద్యార్థి సంఘాల వీరయోధులు మీరు ॥2॥

నెత్తుటి మడుగుల్లో ఎత్తింద్రు పిడికిల్లు ॥వీరు॥

చదువుకో కొడుకాని సాగనంపిన తండ్రి
సదువుల్లో సారాన్ని విప్పి చెప్పిన సారు ॥2॥

చావువార్త వింటూ గుండె పగిలిన తల్లి ॥వీరు॥

ప్రపంచ చరిత్రలో పరిశోధించిన గానీ
మీలాంటి త్యాగమూ యాడా గానారాదు ॥2॥

పాలబుగ్గల పసిడి మొగ్గలు యాడ వున్నరో మీరు ॥వీరు॥

మల్లెపువ్వుల్లారా మట్టివాసనలారా
చేను సెలకల్లారా గోరువంకల్లారా ॥2॥

మీరన్న జూసింద్రా బాలకిశోరాల ॥వీరు॥

పొద్దు పొడుపులో మీరూపు జూసుకుంటాం
పుస్తకాలల్లో మీపేరు దాసుకుంటాం ॥2॥

కన్నీళ్ళతో పదును కథలు జెప్పుకుంటాం ॥వీరు॥

# సావొద్దు నా ముద్దు బిడ్డ

- వడ్డెబోయిన శ్రీనివాస్

సావొద్దు సావొద్దు నాముద్దు బిడ్డ
పోరి సాధించాలి ఈ వీరగడ్డ ॥సావద్దు॥

సక్కని సదువులు సదివేటి బిడ్డ
సైసైర పోరాటయోధుడా కొడుకా ॥2॥

బతకాలి బతకాలి తెలంగాణ కొడుకా ॥2॥
భవిష్యత్తు రాయాలి తెలంగాణ బతుకు ॥సావద్దు॥

రాజకీయగాండ్లు రాబందులు వాళ్ళు
పూటకోమాటతో పొక్కిలి జేస్తారు ॥2॥

మనవాడో మందోడో మనకు అర్థంకాదు ॥2॥
టీవీలో వాడు వీడు జోకులాడుతారు ॥సావద్దు॥

సమ్మక్క సారక్క పోరాటసమరం
చాకలి అయిలమ్మ పోరు జెండా ఎత్తి ॥2॥
ఉరిబెట్టుకోలేదు కాలి సావలేదు ॥2॥
దొడ్డి కొంరయ్య గడికెదురు నిలిచిండు ॥సావద్దు॥

చచ్చేటి ధైర్యము మనకే ఉన్నాది
సమరాన చెలరేగె బలము ఉన్నాది ॥2॥
ఉత్తగా జావొద్దు ఊపిరొదులొద్దు ॥2॥
తెగబడి పోరాడి తెలంగాణ తెద్దాము ॥సావద్దు॥

ఊరూర వీరులు స్థూపాలుగున్నారు
ఉద్యమాల దారి దీపమైయున్నారు ॥2॥
ప్రజలను చదువుకొని ప్రజల దారి బట్ట ॥2॥
యవ్వనాన్ని పోరుదారికి కైగట్టు ॥సావద్దు॥

# సాగదింక అన్యాయం

- జనసాగర్

తెలంగాణా వీరుడా
రగులుతున్న సూర్యుడా
కలిసి ముందు కదులుదాం
తెలంగాణా సాధిద్దాం! ॥తెలంగాణా॥

విశాలాంధ్ర పేరుతో
దగా చేసిరిన్నాళ్ళు
రెడ్డి కమ్మ, కూడబలికి
కోట్లకు పడగెత్తినారు! ॥తెలంగాణా॥

ప్రాజెక్టులు కడతమని
గంపెడంత ఆశజూపి
ఆంధ్రాకు మళ్ళించినారు
అవులగాండ్ల చేసినారు! ॥తెలంగాణా॥

బడి కట్టి చదువు చెప్పి
కొలువులన్ని ఇస్తమనిరి
తెలంగాణా వాడకెమో
తెడ్లు చూపి పొమ్మనిరి! ॥తెలంగాణా॥

హరిజనులను గిరిజనులను
బి.సి.లతో కలుపకుండ
ఓట్లు గుంజి గద్దెనెక్కి
మస్తెక్కి మసలుతుండ్రు ॥తెలంగాణా॥

ఫ్లోరిన్ నీళ్ళతోటి
కోట్ల జనం చస్తుంటే
జన్మభూమి జపం చేస్తూ
సానుభూతి తెలుపుతుండ్రు!! ॥తెలంగాణా॥

గుడిసె గుడిసె లైటనిరి
గుడ్డి దీపమొద్దనిరి
గడియ గడియ లైటు పోయె
దినదినము గండమాయె! ॥తెలంగాణా॥

తాగు నీరు లేక జనం
తల్లడిల్లె రోజంతా
సాగునీరు లేక రైతు
సావుకాయే సంసారం ॥తెలంగాణా॥

మంజీరల మన్ను చేరే
మూసీలో మురుగు చేరె
పోచంపాడు పూర్తికాక
ఎండిపోయె తెలంగాణ! ॥తెలంగాణా॥

సాగదింక అన్యాయం
సాధిద్దాం తెలంగాణా!
పేద బిక్కి జనమంతా
కలిసి రాజ్యమేలుదాం! ॥తెలంగాణా॥

# సింగూర నిర్వాసితుడు

- లింగన్న

సింగూర నిర్వాసితుడా - చితికిన బ్రతుకోడా
ఇకనైనా మేలుకోరా రైతన్న - పోరుబాటలో నడిచిరారా రైతన్న ॥సిం॥

ప్రాజెక్టు కట్టింది - పట్నపోళ్ళకేనంట
సింగూరు గ్రామాలకు కాదని రైతన్న - నీటిని సిటీకి
సప్లై చేస్తుంది రైతన్న ॥సిం॥

ఎన్నెన్నో గ్రామాలు - ఏటిలో మునిగాయి
బంగారు భూములన్ని - ప్రాజెక్టులో కలిసినాయి ॥సిం॥

కోట్లు పోసి కట్టగడితే - కొందరికి మేలాయెరా
భూములిండ్లు మునిగినోల్లు - ఎక్కడికి పోవాలి ॥సిం॥

కట్టుబట్టలతో వాల్లు రైతన్న - కూటికి పరుగెత్తినారు రైతన్న
చదువురాని వాళ్ళు చవటలై పోతుంటే - చదువు నేర్చిన
యువత బికారిగా మారె ॥సిం॥

సారవంతమైన భూములకు రైతన్న - సర్కారు సగం
సగం ధరన కట్టిందిర రైతన్న
దళారులు, పైరవికార్లు రైతన్న - పర్సంటేజ్‌లు గుంజినారు రైతన్న ॥సిం॥

అన్ని పార్టీలు, అన్ని సంఘాలు కలిసి
జలసాధన సంఘం బెట్టి రైతన్న
సింగూరు జలము సాధించుకుందాం కూలన్న
పంటలు పండించుకుందాం రైతన్న ॥సిం॥

# సూడు తెలంగాణ

- అందెశ్రీ

సూడు తెలంగాణ సుక్క నీళ్ళు లేని దాన
నాగోడు తెలంగాణ బతుకు పాడైన వీణ
ఇది దగాపడిన దరువు-నాకేది బతుకుదెరువు
అరె! నినాదాలు కాదు-దేశ పునాదులె కదలాల ॥సూడు॥

ఉత్తరాన గోదావరి ఉప్పొంగి ఉరకలేమో
దక్షిణాన కృష్ణమ్మ దర్జాగా పారనేని
నీళ్ళు లేక నోళ్ళు తెరిచే బీళ్ళను చూడు
మా పల్లెలన్నీ బోసిపోగా తల్లడిల్లుతున్న తల్లి ॥సూడు॥

రెండు జీవ నదులుగలిసి నిండుగ ఇల పారినా
సమైక్యాంధ్ర సాకులతో తెలంగాణ మారెనా
కంచె సేను మేసినట్టు పంచ చేరి వంచించగా
గుండె పగిలి కన్నీళ్ళతో మండే ఆకలి కేకలు ॥సూడు॥

అరే! మండే ప్రతి గుండె జూడు తిరుబాటు జండలెత్తే
పదం పదం కలసి జనం కదనానికి కాలు దువ్వి
పోరు దారిలోన ప్రతు ఊరు కూడా కదులుతోంది
ప్రజా తెలంగాణ కొరకు ప్రాణాలను ఒడ్డుతోంది ॥సూడు॥

# సెలుక - సేను

- గోరటి వెంకన్న

సూడాలిరా సేను ఓరన్నా సూడాలిరా సెలుక
సాళ్ళు దున్నిన ఎర్రని దుక్కిల సంధ్య పొద్దు వాలి వొదిగి నప్పుడు
తేమగల ఆ రేగడి నేలను ప్రేమతో మేఘం తాకినప్పుడు
పలుగురాళ్ళ ఇసుక మెట్టపై పండు వెన్నెల కొలువైనప్పుడు
పొంగుతు పారె వాగులు వొంకలు నింగి వోలె కన్పించినప్పుడు
॥సూడాలిరా॥

గుత్తులు గుత్తులు కాసిన పత్తి మత్తుగ నవ్వి పిలిసినపుడు
గాలికూగుతు ఎర్రని దుక్కిలో వేరుసెనగ సేనాడినప్పుడు
మురిపాలలొలుకుతూ మిరుప సేలు ఆ రేగడి నేలలో మెరిసినప్పుడు
వెన్ను విరుచుకొని జొన్న సేను ఆ మన్ను గుడ్డంలో వన్నె లొలికితే
॥సూడాలిరా॥

తువ్వల గడ్డన జువ్వికొమ్మన గువ్వలు రాగాలెత్తినప్పుడు
సవ్వడితోనా బురక పిట్టలు పరికి పొదలపోటిరుకినప్పుడు
మేఘం వలె మెత్తని పాటతో తీతువా తిరుగుతు ఎగిరినప్పుడు
పంచవన్నెల రామచిలుకలు పంట సేలపై ఎగిరినప్పుడు
॥సూడాలిరా॥

# హైదరాబాద్ హమారాహై

- గుడిపల్లి రవి

భోలో భాయి, బోలోరే
హైదరాబాద్ కి కహానీ....
ఎవడబ్బ సొత్తో ఈ నగరం
సోంచాయించి బోలోరే.... ॥భోలో॥

ప్రేమ కొరకె షాజహాను
కట్టెనంట తాజమహల్
ప్రియురాలు బాగమతి
పేరు నెలసె భాగ్యనగరు
ప్రేమ కొరకె కట్టిన సిటీ
దునియ లోనె లేనె లేదు ॥భోలో॥

దునియాలోనె పేరుగన్న
చార్మీనార్ చూడరా భాయి
నాలుగొందలేండ్ల సంధి
చెదిరి పోక నిలిచింది
ప్లేగు వచ్చినా, వరదలొచ్చినా
చేతులు చాచి దాచుకుంది... ॥భోలో॥

నంగారా మోగిన కొండలు
నాట్యమాడె పూల జంగల్
లంబాడోల్ల గుట్టలన్నీ
బంజారాహిల్సులాయె

బలిసినోళ్ళ కండ్లు బడి
బంజారోళ్ళను గెదిమినారు ॥భోలో॥

మీర్ ఉస్మాన్ అలీఖాన్
కట్టించిన ట్యాంకుబండు
ప్రజలకు జీవరాసులకు
తరగని జల ఊటలుండే
కుళ్ళిపోయిన శవాలకు
గణేశలకు నెలవాయె... ॥భోలో॥

ఉద్యమాల పోరుగడ్డ
ఉస్మానియా క్యాంపస్‌లో
మూడు వందల అరవై మంది
తెలంగాణకు ప్రాణమిస్తె
ప్రత్యేక రాష్ట్రం రాలె
నిరుద్యోగుల అడ్డాయె.... ॥భోలో॥

నిజాం కాలం నాటి
నూటొక్క చెరువులుండె
అడవులన్ని ఆగమాయె
కొండ చిలువలా పెరగబట్టె
పాతాళంలో బోరు ఏసినా
గంగమ్మ కనికరించలే... ॥భోలో॥

దున్నపోతుల ఆటలు జూడు
పీర్ల పండగ దూల చూడు
బతుకమ్మ పూలను జూడు
బోనాల బొట్లను జూడు
పోతురాజుల వేషం వేసినా
పొట్ట కూడు తిప్పలు జూడు... ॥భోలో॥

ఒకవైపు బంజారాహిల్స్
మరొకవైపు జూబిలిహిల్స్
అటు జూస్తే హైటెక్కు సిటీ
ఇటు జూస్తే ఫిలింనగర్
మధ్యలో ఓల్డ్ సిటీ
వందల బస్తీల్ కనుమరుగాయె ॥భోలో॥

గడ్డి బండ్లు, గుర్రపుబగ్గీల్
అందమైన హైదరాబాదు
లక్షలాది పడవ కార్లతో
ట్రాఫిక్కు జాములాయె
అంబులెన్స్ ట్రాఫిక్కులోన
రోగుల ప్రాణాల్ గాలిలోన... ॥భోలో॥

నిజాము కాలములోనే
ఫ్యాక్టరీలు ఎన్నో వుండే

అభివృద్ధి జేసినమంటూ
వున్న వాటిని మూసేసింౘ్రు
బలసిన దొరలంతకలసి
కబ్జా చేసి మాదంట్రుండ్రు... ॥భోలో॥

ఒక్కొక్క ఇటుక పేర్చి
నగరాన్ని నిర్మించినాము
మాదేనంటు కూతలుకూసే
బడా దొరలాగల్లా బట్టి
హైదరాబాదు హమారా అని
హంటర్ బట్టి తరుముదాము
సునో భాయి సునోరే
హైదరాబాద్ హమారా.... ॥సునో॥

# పొడుస్తున్న పొద్దుమీద

- గద్దర్

అదిగో ఆ కొండలనడుమ తొంగి చూసే ఎర్రని శక్తి ఎవరు సూర్యుడు.
ఉదయించే సూర్యునితో పొడుస్తున్న పొద్దుతో పోటీపడి నడుస్తుంది కాలం.
అలా కాలంతో నడిచినవాడే కదలిపోతాడు. ఓ పొడుస్తున్న పొద్దు!
వందనం! వందనం!

హా! పొడుస్తున్న భళె భళె భళె భళె భళె హాఁ హాఁ హాఁ హాఁ .....
పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా
భలె భళె భళె భళె భళె హాఁ హాఁ హాఁ హాఁ .....
పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా

ఓ! భూతల్లి సూర్యుని ముద్దాడిన భూతల్లి అదిగో చిన్నారి బిడ్డలికి
జన్మనిచ్చింది. అమ్మా ! నీవు త్యాగాల తల్లివి. త్యాగాల గుర్తువు.

భూతల్లి బిడ్డలు చిగురించె కొమ్మలు
చిదిమేసిన పువ్వులు త్యాగాల గుర్తులు హాఁ
మా భూములు మాకేనని భళె భళె భళె హాఁ
మా భూములు మాకేనని
మర్లబడ్డ గానమా తిరగబడ్డ రాగమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా
భలె భళె భళె భళె భళె హాఁ హాఁ హాఁ హాఁ .....
పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా

అమ్మా గోదవరి నీవొడ్డున జీవించే కోట్లాది ప్రజలకు జీవనాధారం.
అమ్మా క్రిష్ణమ్మా కిల కిల నవ్వే క్రిష్ణమ్మ అమ్మా మీకు వందనం.

గోదావరి అలలమీద కోటి కలల గానమా
క్రిష్ణమ్మ పరుగులకు నురుగుల హారమా హాఁ
మా నీళ్ళు భళె భళె భళె హాఁ
మానీళ్ళు మాకేనని  కత్తుల పోరాటమా కన్నీటి రాగమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా
భలె భళె భళె భళె భళె హాఁ హాఁ హాఁ హాఁ ...
పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా

అమ్మా మన వనరుల దోపిడి వలసాంధ్రుల దోపిడిదారులకు నోటయ్యింది, వోటయ్యింది, డాలరయ్యింది.

మా ప్రాణాన్ని పెట్టి మీ వనరులు రక్షిస్తాం
అడవి తల్లి గుండెలోన రగల్ జెండా రాగమా
సింగరేణి గనులల్లో పేలుతున్న శబ్దమా
తరలిపోయే వనరులలో తల్లడిల్లే ప్రాణమా
నిలువున దోయబడ్డ తల్లి తెలంగాణమా
తళ్వారుల గానామా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా
భలె భళె భళె భళె భళె హాఁ హాఁ హాఁ హాఁ .....
పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా

అదిగో ప్రకృతిని చూడు అలా అదుముకుంటుంది. ఆకొమ్మలు గాలిలో ముద్దాడుతాయి ఆ పువ్వులు అలా ఆడుతాయి అదిగో ఆ పావురాల జంట నేనెప్పుడూ విడిపోను అంటోంది.

విడిపోయిన బంధమా చెదిరిపోయిన స్నేహమా
ఎడబాసిన గీతమా ఎదలనిండ గాయమా హాఁ
పువ్వులు పుప్పొడిలా భళె భళె భళె హాఁ
పువ్వులు పుప్పొడిలా పవిత్ర బంధమా పరమాత్ముని రూపమా
పవిత్ర బంధమా పరమాత్ముని రూపమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా
భలె భళె భళె భళె భళె హాఁ హాఁ హాఁ హాఁ ...
పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా
పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా

అదిగో రాజులు, దొరలు, వలస దొరలు భూమిని నీళ్ళను ప్రాణుల్ని, సర్వ స్వప్నాన్ని చెరబట్టారు. రాజుల ఖడ్గాలకింద తెగిపోయిన శిరస్సులు

రాజరికం కత్తిమీద నెత్తుర్లో గానమా
దొరవారి గడులల్లో నలిగిపోయిన న్యాయమా
ఆంధ్ర వలస తూటాలకు ఆరిపోయిన దీపమా హాఁ ...
మా పాలన మాకేనని భళె భళె భళె హాఁ
మా పాలన మాకేనని మండుతున్న గోళమా
అమరవీరుల స్వప్నమా మండుతున్న హాఁ ...
మండుతున్న గోళమా అమరవీరుల స్వప్నమా
అమరవీరుల స్వప్నమా
అమరవీరుల స్వప్నమా
అమరవీరుల స్వప్నమా

# Okkokka paatesi...
anthology of Telangana Songs

రాష్ట్ర సాధన విజయానికి రెండు దశాబ్దాల ప్రజల వీరోచిత పోరాట చరిత్ర ఉంది. ఆద్యంతాలలో సాహిత్యం, కళలు ఉద్యమంతో పెనవేసుకొని పోయాయి. రాజకీయంగా నిరాశ పొందినప్పుడల్లా కళా సాహిత్యాలు కొత్త ఆశ్వాసన ఇచ్చాయి.

వేలాది కవులు, కళాకారులు, రచయితలు తమ కలాలను, గళాలను పోరాట బరిలో పునీతం చేశారు. దేశంలో ఇంత సుదీర్ఘమైన, ముమ్మరమైన సృజనాత్మక వత్తాసు ఏ ప్రజాస్వామిక ఉద్యమానికి లేదు. అందుకే ఈ వారసత్వం కొనసాగాలి. రేపటి ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణంలో కలాలు ప్రజల తరపున నిలబడాలి. ఒక కొత్త చరిత్ర పునాదులను నిర్మిస్తూ పోవాలి. ప్రజల త్యాగచరిత్ర స్ఫూర్తితో, నిన్నటి ఆటా, పాటా, రాతల బాటలో ముందుకు కదులుదాం! అందుకే తెలంగాణ మహత్తర గాన సాహిత్య సంప్రదాయాన్ని ప్రతిబింబించే తొలి సంకలనాన్ని మీకు అందిస్తున్నాం.

TELANGANA RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29.
Website: www.trchyd.org